PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 328 | విజయవాడ, గురువారం 29 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 29 June 2023 | Rs

బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముస్లిం సోదరుల త్యాగనిరతిని, ధర్మ నిబద్ధతను చాటే పండగే బక్రీద్ అని రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మనకు కలిగిన దానిని సాటి వారితో కలిసి పంచుకోవాలని చెప్పే గొప్ప మానవతా వాదాన్ని చాటే బక్రీద్ పండగను, భక్తి ప్రవృత్తులతో జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా, రాగద్వేషాలకు అతీతంగా బక్రీద్ నిర్వహించుకుంటారన్నారు. ఈ మేరకు బుధవారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

లైవ్ ఆపరేషన్లు

- 30న తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో ఆర్థోప్లాస్టీ సమ్మిట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

బర్డ్ ఆస్పత్రి చరిత్రలో నూతన అధ్యాయానికి తెర లేవనుంది. జూన్ 30వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు 'ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టి సమ్మిట్' పేరుతో లైవ్ సర్జరీలు నిర్వహించే కార్యక్రమం నిర్వహించబోతోంది. టిటిడి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయని ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో దేశంలోని టాప్ 20 ఆర్థో వైద్య నిపుణులు లైవ్‌లో సర్జరీలు చేస్తారు. ఇప్పటిదాకా నమోదు చేసుకున్న సుమారు 200 మంది వైద్యులు బర్డ్ ఆస్పత్రిలోని ఆధునిక ఆపరేషన్ థియేటర్‌లో జరిగే సర్జరీలను తిరుపతి ఫార్చ్యూన్ గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో వీక్షిస్తారు. సర్జరీకి సంబంధించి తమకు తెలియని విషయాలను సర్జరీ చేస్తున్న ప్రముఖ వైద్యులను అడిగి తెలుసుకోవచ్చు. ఈ సమ్మిట్‌ను టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి ప్రారంభిస్తారు.

17 నుంచి వర్షాకాల పార్లమెంట్!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై మూడో వారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిపిఎ) సమావేశం జరగనుంది. అందులో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. జులై 17 ప్రారంభమై ఆగస్టు 10 వరకు సమావేశాలు జరుగుతాయని సమాచారం. అదానీ కుంభకోణం ఈసారి కూడా పార్లమెంట్‌ను కుదిపేసే అవకాశముంది. పోస్టింగ్ విషయంలో ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కబళించే ఆర్డినెన్స్ స్థానే బిల్లు పార్లమెంటు ముందుకు రావచ్చు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దేశవ్యాప్తంగా తిరుగుతూ బిజెపి వ్యతిరేక పార్టీలను కలసి ఈ బిల్లుకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టే యత్నం చేశారు.

అలాగే, ఏకరూపత పేరుతో యూనిఫాం సివిల్ కోడ్‌ను బలవంతంగా మైనార్టీలపై రుద్దేందుకు బిజెపి ప్రభుత్వం ఓ బిల్లును తేవాలని తహతహలాడుతోంది. ప్రధాని మోడీ తాజా ప్రకటనపై పార్లమెంటులో దుమారం రేగవచ్చు. నూతన పార్లమెంట్ హౌస్‌లో జరిగే తొలి సెషన్ ఇదే. మే 28న ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రారంభించారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ కింద నిర్మించిన కొత్త పార్లమెంట్ హౌస్‌లో మంత్రులందరికీ వేర్వేరు కార్యాలయాలు ఉన్నాయి. అయితే 30 మంది కేబినెట్ మంత్రులు, కొంతమంది సహాయ మంత్రులకు మాత్రమే పాత భవనంలో కార్యాలయాలు ఇంకా కొనసాగుతున్నాయి. కొత్త భవనంలో అన్ని రాజకీయ పార్టీలకు కార్యాలయాలు ఇవ్వనున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రతి సంవత్సరం జూలైలో ప్రారంభమవుతాయి. గత ఏడాది జూలై 18న వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి.

విద్యా వ్యవస్థ గతినే మార్చేశాం



విద్యార్థులకు అమ్మఒడి నగదు నమూనా చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి
- 4వ విడత 'అమ్మఒడి'లో 42,61,965 మందికి లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమ
- వచ్చే నెలలో ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

గత నాలుగేళ్లలో విద్యా వ్యవస్థలో గతినేమార్చేశామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. పేద విద్యార్థులను గ్లోబల్ స్టూడెంట్లుగా తీర్చిదిద్దుతూ ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీషు మీడియం, సిబిఎస్‌ఇ విధానంలో బోధన నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. చదువులో అంటరానితనాన్ని రూపు మాపగలిగామని పేర్కొన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువూ ఆగకూడదనే సంకల్పంతో అధిక మొత్తంలో నిధులను వెచ్చిస్తూ భావితరాల పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో గిరిజన ప్రాంతంలో ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. విజయనగరం మెడికల్ కాలేజీలో ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెలిపారు. నాల్గో ఏడాది 'జగనన్న అమ్మఒడి' కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాప్‌టాప్‌లో బటన్ నొక్కుతూ 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. తద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే 83,15,341 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని అన్నారు. ఇప్పటివరకు ఒక్క జగనన్న అమ్మఒడి ద్వారానే రూ. 26,067.28 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ నాలుగేళ్లలో విద్యా రంగంపై ప్రభుత్వం రూ.66,722.36 కోట్లను ఖర్చు చేసిందన్నారు. నాడు-నేడు తొలిదశ పనులు పూర్తయిన పాఠశాలల్లో ఆరు, ఆపై తరగతుల నుంచి డిజిటల్ తరగతి గదులను, ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేసేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించి ప్రపంచంతో పోటీ పడేలా వెన్ను తడుతున్నామని తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీషులో నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను 'టోఫెల్' పరీక్షలకు సన్నద్ధం చేసి సర్టిఫికెట్లు అందించేలా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా అమెరికా సంస్థ ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఇటిఎస్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. విద్యార్థుల చేరికలను ప్రోత్సహిస్తూ జిఇఆర్ శాతాన్ని మరింత మెరుగుపర్చేందుకు టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణులు కాకపోయినా తిరిగి తరగతులకు హాజరైతే వారికి కూడా 'అమ్మఒడి'ని వర్తింపజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.15 వేలలో స్కూళ్లలో టాయిలెట్స్, మెయిటనెన్స్ కోసం రూ.2 వేలు డోనేట్ చేయాలని తల్లిదండ్రులను కోరారు. ప్రపంచంలోనే టాప్ 50 కాలేజీల్లో ఏ పిల్లాడికి సీటు వచ్చినా రూ.1.25 కోట్ల వరకు పూర్తి ఫీజును భరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

రాష్ట్రంలో మంచి వినవద్దు, మంచి కనవద్దు, మంచి అనవద్దు ఇదీ చంద్రబాబు, పవన్ కల్యాణ్ తీరు

ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ జీర్ణించుకోని చంద్రబాబు, ఆ నాయకుడి కోసం 15 ఏళ్ల క్రితమే పుట్టిన ఓ దత్తపుత్రుడు దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు 14 ఏళ్ల సిఎంగా ఉన్నా రాష్ట్రానికి ఏమీ చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో మంచి వినవద్దు, మంచి కనవద్దు, మంచి అనవద్దు, మంచి చేయవద్దు అని చెప్పే నాలుగు కోతులు ఉన్నాయని, వీటినే దుష్టచతుష్టయం అని పిలుస్తుంటామని దుయ్యబట్టారు.

వారాహి ఎక్కి నోటికి అద్దూఅదుపులేని మాటలు

'ఈ ప్యాకేజీ స్టార్ ఈ రోజు ఓ లారీ ఎక్కాడు. దాని పేరు వారాహి అంటా.. ఈ లారీ ఎక్కి ఊగిపోతూ తనకు నచ్చని వారిని చెప్పు తీసుకుని కొడతా అంటాడు. తాటా తీస్తా, గుడ్డలు ఊడదీసి కొడతా అంటాడు. ఈ మనిషి నోటికి అదుపు లేదు. ఈ మనిషికి నిలకడ లేదు. వారిలా పూనకం వచ్చినట్లు ఊగుతూ మాట్లాడలేం. రౌడీల్లా మీసాలు మెలేయలేం. రౌడీల్లా తొడలు కొట్టలేం' అంటూ పరోక్షంగా పవన్ కల్యాణ్‌ను విమర్శించారు. అటువంటి మాటలకు, చేష్టలకు ఆయనకే పేటెంట్ హక్కు అని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వ పునాదులు ప్రజల కష్టసుఖాల్లోనూ, సామాజిక బాధ్యతలోనూ, గవర్నెన్స్‌లోనూ ఉన్నాయని తెలిపారు. అందువల్ల వారి మాదిరి చౌకబారు మాటలు ఆడలేమన్నారు. కార్యక్రమంలో తొలుత విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప-శ్రీవాణి, పార్వతీపురం మిగతా 2లో

మడకంవారిగూడెం సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్

నిర్వాసితులకు అండగా ఐక్య పోరాటం

- అదాని, అంబానీ సేవలో మోడీ సర్కార్
- పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్

ప్రజాశక్తి- టి.నరసాపురం, జీలుగుమిల్లి (ఏలూరు జిల్లా)

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజల కోసం పని చేయాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీల సేవలో తరిస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ విమర్శించారు. ఈ నేపథ్యంలో పరిహారం, ప్యాకేజీ, పునరావాసం వంటి సమస్యల పరిష్కారానికి పోలవరం నిర్వాసితులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర తొమ్మిదో రోజు బుధవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని కొత్త మామిడిగొంది నిర్వాసిత కాలనీ నుంచి ప్రారంభమైంది. బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీల మీదుగా జీలుగుమిల్లి మండల కొరుటూరు కాలనీ వరకూ సాగింది. ఈ సందర్భంగా వంకావారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినందున నిధులు కేటాయించి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్య కేవలం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న గిరిజనులు, గిరిజనేతరులది మాత్రమే కాదని, ఇది జాతీయ సమస్య అని పేర్కొన్నారు. పునరావాస కల్పన, నష్టపరిహారం అందజేతలోనూ, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నాయన్నారు. ఇక్కడి ప్రజలకు పోరాట స్ఫూర్తి, హక్కులను కాపాడుకునే ధైర్యం ఉందని, వారికి ఎర్రజెండా సిపిఎం అండగా నిలుస్తుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీలుగుమిల్లి మిగతా 2లో

రసాయనిక ఎరువులకు ఎగనామం!

- ప్రత్యామ్నాయ ఎరువులకు ప్రాధాన్యం
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం
- చెరకు రైతుకు మళ్లీ మొండిచెయ్యి
- ఎంఎస్‌పి పది రూపాయలే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పొరుగున ఉన్న శ్రీలంక పెను సంక్షోభానికి ప్రధాన హేతువుల్లో ఒకటైన సేంద్రీయ ఎరువుల విధానానికే ప్రత్యామ్నాయ ఎరువుల పేరుతో ఇక్కడ ప్రోత్సహించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రీయ ఎరువుల(బయో ఫెర్టిలైజర్స్) వైపు మళ్లించడమే లక్ష్యంగా పెట్టుకున్న మోడీ ప్రభుత్వం బుధవారం మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోద ముద్ర వేసింది. 2023-24 వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పిఎం ప్రణామ్ పేరుతో ఈ విధానం గురించి అతిశయంగా చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకానికి బదులు సేంద్రీయ ఎరువులను వాడడం వల్ల శ్రీలంకలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయి తీవ్ర ఆహార సంక్షోభంలో ఎలా చిక్కుకున్నదీ యావత్ ప్రపంచం గమనించింది. విఫలమైన ఆ విధానాన్నే మోడీ ప్రభుత్వం దేశంలో అమలు చేయడానికి ఎక్కడలేని ఆతృత ప్రదర్శిస్తోంది. దీని వల్ల భూమాతను రసాయనిక కాలుష్యం బారి నుండి కాపాడవచ్చని, పంటల్లో పోషక విలువలు పెరుగుతాయని ప్రభుత్వం సెలవిచ్చింది.

చెరకు రైతుకు మళ్లీ మొండిచెయ్యి

చెరకు రైతుకు ఈసారి కూడా కేంద్రం మళ్లీ మొండిచెయ్యి చూపింది. ఈసారైనా ప్రోత్సాహక ధర పెంచుతారని ఆశించిన చెరకు రైతును నిరాశపరిచింది. చెరకుకు సరసమైన ప్రోత్సాహక ధర (ఎఫ్ఆర్‌పి)ను ముష్టి వేసినట్లు క్వింటాల్‌కు రూ.10 మాత్రమే పెంచి రూ. 315 గా ధర నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అనంతరం కేంద్ర మంత్రులు అనురాగ్ సింగ్ ఠాకూర్, మనుసుఖ్ మాండవీయా మీడియాతో మాట్లాడుతూ. తాజా నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది చెరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అక్టోబర్ నుంచి మొదలయ్యే సీజన్‌లో చక్కెర కర్మాగారాలు రైతులకు క్వింటాల్‌పై సరసమైన, ప్రోత్సాహక ధర (ఎఫ్ఆర్‌పి)గా రూ.315గా చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది ఎఫ్ఆర్‌పి రూ.305 గా ఉండగా, 2023-24 ఏడాదికి గాను క్వింటాల్‌పై రూ.315 కేంద్రం నిర్ణయించినట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు. బేసిక్ రికవరీ రేటు 10.25 శాతంగా నిర్ణయించారు. రికవరీ రేటు 10.25 శాతం మించి ఉంటే ప్రతి 0.1 శాతం పెరుగుదలకు క్వింటాల్‌కు రూ. 3.07 ప్రీమియంగా చెల్లిస్తారు. రికవరీ రేటు 10.25 శాతం కంటే తక్కువగా ఉంటే ప్రతి 0.1 శాతం తగ్గుదలకు క్వింటాల్‌కు రూ.3.07 తగ్గించి చెల్లిస్తారు. క్వింటాల్ రూ.290 ఉన్న చెరకు ధరను, 2022 ఆగస్టులో రూ.15 పెంచి రూ.305గా నిర్ణయించారు. ఇప్పుడు కేవలం రూ.10 పెంచారు.

రూ.3,70,128.7 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ

రైతుల కోసం రూ.3,70,128.7 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఈఎ) ఆమోదించిందని కేంద్ర మంత్రి మనుసుఖ్ మాండవీయ తెలిపారు. దేశంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఎరువులు వినియోగించేలా రాష్ట్రాలకు ప్రోత్సహించేందుకే పిఎంప్రణామ్ అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చామన్నారు. గోబర్ధన్ ప్లాంట్ల నుండి సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించడానికి మార్కెట్ అభివృద్ధి సహాయం (ఎండిఏ) కోసం రూ.1,451.84 కోట్లు కేటాయించామన్నారు. ఇందుకోసం ప్రధాని నేతృత్వంలో ఎన్ఆర్ఎఫ్ పాలక బోర్డు నియమించనున్నారు. ఇందులో 15 నుంచి 25 మంది పరిశోధకులు, అనుభవజ్ఞులు ఉంటారు.

చెరువులను తలపిస్తున్న ముంబయిలోని ఓ కాలనీలో పాఠశాల విద్యార్థుల అవస్థలు

ముంబయిని ముంచెత్తుతున్న వర్షాలు

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. మంగళవారం నుంచి ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలో రోడ్లన్నీ జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైకి నీరు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర శివార్లలోని మలాడ్ ప్రాంతంలోని మమ్లేడెర్‌వాదీ జంక్షన్ వద్ద చెట్టు కూలడంతో ఒకరు మరణించినట్లు అధికారులు తెలిపారు. మృతుడ్ని 38 ఏళ్ల కౌశల్ గా గుర్తించారు. ఎప్పుడూ రద్దీగా ఉండే అంధేరి సబ్‌వేను మూసివేసినట్లు ముంబయి ట్రాఫిక్ పోలీస్ ట్వీట్ ద్వారా వెల్లడించింది. అంధేరి సబ్‌వేలో సుమారు 3 అడుగుల వరకూ నీరు చేరుకోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్, మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడింది. ఈ వర్షాలు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

భీమ్ ఆర్మీ చీఫ్‌పై కాల్పులు

చంద్ర శేఖర్ అజాద్

లక్నో : దళిత నాయకులు, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ అజాద్‌పై ఉత్తరప్రదేశ్‌లో గుర్తు తెలియని దుండగులు బుధవారం కాల్పులు జరిపారు. షహరాన్‌పూర్ జిల్లాలోని దియోబండ్ పట్టణంలో ఈ దారుణం చోటుచేసుకుంది. దుండగులు జరిపిన కాల్పుల్లో అజాద్ గాయపడడంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. దియోబండ్‌లోని తన అనుచరుని ఇంట్లో జరిగిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళుతుండగా ఆయన ప్రయాణిస్తున్న ఎస్‌యువిపై దుండగులు కాల్పులు జరిపారు. అజాద్ పొత్తి కడుపులోకి బుల్లెట్ దూసుకుపోయింది. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఎన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దుండగులు ఉపయోగించిన వాహనం హర్యానా రిజిస్ట్రేషన్‌తో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దుండగుల కోసం గాలింపు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కాల్పుల ఘటనపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బిజెపి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతల దుస్థితికి ఈ ఘటన అద్దంపడుతోందని విమర్శించాయి.

ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి), స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ), ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎం)కు ఉద్యోగోన్నతుల షెడ్యూల్‌ను కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ బుధవారం విడుదల చేశారు. అడహాక్ పద్ధతిలో ఈ ఉద్యోగోన్నతులు జరగనున్నాయి. ఎస్ఎ, ఎస్‌జిటిలకు సీనియార్టీ జాబితా ఈ నెల 30న విడుదల కానుంది. జులై 1 నుంచి 3 వరకు ఈ జాబితాపై అభ్యంతరాలను విద్యాశాఖ స్వీకరిస్తుంది.

జులై 4న తుది సీనియార్టీ జాబితాను విడుదల చేస్తుంది. జులై 5న కౌన్సెలింగ్ నిర్వహించి 6న కొత్త ప్రదేశాల్లో పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనుంది. గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియార్టీ జాబితాను ఈ నెల 30న విడుదల చేసి జులై 1, 2 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరిస్తుంది. తుది సీనియార్టీ జాబితాను 3న విడుదల చేస్తుంది. 4న కౌన్సెలింగ్ నిర్వహించి 5న కొత్త పాఠశాలల్లో పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనుంది. తెలుగు, హిందీ సబ్జెక్టుల ఉద్యోగోన్నతుల అర్హతల కేసు కోర్టులో ఉంది. దీంతో వీరికి ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించడం లేదు.

ఉచిత బియ్యం బదులు నగదు

- కర్ణాటక ప్రభుత్వ నిర్ణయం
- అన్న భాగ్య పథకానికి కేంద్రం మోకాలడ్డిన ఫలితం

బెంగళూరు: 'అన్న భాగ్య' పథకానికి బియ్యం సరఫరాను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకోవడంతో కర్ణాటక ప్రభుత్వం బియ్యానికి బదులు నగదు పథకాన్ని ముందుకు తెచ్చింది. బుధవారం నాడిక్కడ జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి కిలో బియ్యానికి రూ. 34 చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో వేయనున్నారు. ఈ పథకానికి తగినన్ని బియ్యం నిల్వలు సమకూరే వరకూ తాత్కాలిక ప్రత్యామ్నాయంగా దీనిని అమలు చేస్తామని సిద్దరామయ్య ప్రభుత్వం తెలిపింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్న భాగ్య పథకం ద్వారా బిపిఎల్, అంత్యోదయ కార్డులున్న కుటుంబాల్లో ఒకొక్కరికి నెలకు ఐదు కేజీల బియ్యం ఉచితంగా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ ప్రకారమే జులై 1 నుంచి బియ్యం పంపిణీ కార్యక్రమం అమలుకు సిద్ధమైంది. అయితే కేంద్ర ప్రభుత్వం మోకాల్లడంతో ఎఫ్‌సిఐ నుంచి బియ్యం సరఫరా ఆగిపోయింది.

కేంద్రం కక్ష కట్టింది

- కర్ణాటక సిఎం సిద్ధరామయ్య

అన్న భాగ్య పథకం కోసం తమకు బియ్యం ఇవ్వడానికి కేంద్రం నిరాకరించినట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. "మార్కెట్ ధరకే కొనుగోలు చేసేందుకు మేము సిద్ధపడినప్పటికీ కేంద్రం బియ్యం ఇవ్వడానికి నిరాకరించింది. కర్ణాటక పట్ల కేంద్రం కక్షకటినట్టు వ్యవహరిస్తోంది. ఆరు నూరైనా ఈ పథకాన్ని ఆపేది లేదు. కొంత కాలంపాటు బియ్యానికి బదులు నగదు ఇవ్వాలని నిర్ణయించాం. బిపిఎల్ కుటుంబంలో నలుగురు సభ్యులుంటే రూ.680 ఇవ్వడం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి తెలిపారు.

పారిస్‌లో టీనేజర్ కాల్చివేత

- భగ్గుమన్న ఫ్రాన్స్ ప్రజానీకం
- సర్వత్రా నిరసనాగ్రహాలు
- క్షమించరాని నేరమన్న అధ్యక్షుడు మాక్రాన్

నిరసనకారులు తగలపెట్టిన కారు

పారిస్ : పారిస్ నగర శివారైన నాన్‌టెరె ట్రాఫిక్ స్టాప్ వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జామున 17ఏళ్ల వాహనదారుడిని అమానుషంగా కాల్చి చంపడంపై ఫ్రాన్స్ ప్రజలు భగ్గుమన్నారు. పారిస్‌తో సహా అన్ని ముఖ్యమైన పట్టణాలు నిరసనలతో హోరెత్తాయి. పోలీస్ కాల్పుల్లో మరణించిన టీనేజర్‌ని నేల్ ఎం గా గుర్తించారు. మంగళవారం తెల్లవారు జామున నేల్ కారును ఆపాల్సిందిగా పోలీసులు ఆదేశించారని, అయినా పట్టించుకోకుండా కారును ముందుకు తీసుకెళ్లడంతో పోలీసులు కారు విండో గుండా నేల్‌పై కాల్పులు జరిపారని, బులెట్లు ఛాతిలోకి దూసుకుపోయిన కొద్ది సేపటికే ఆయన చనిపోయాడని ప్రాసిక్యూటర్లు తెలిపారు. కారులో డ్రైవర్ సీటులో ఉన్న నేల్‌పైకి అతి సమీపం నుంచి పోలీసులు కాల్పులు జరుపుతున్న చిత్రాలను బంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వీడియోను తిలకించిన ఫ్రాన్స్ ప్రజలు పోలీసుల అమానుషత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేల్‌ను వెంబడించిన ఇద్దరు పోలీస్ అధికారుల్లో ఒకరు డ్రైవర్ సీటులో వున్న నేల్‌పై తుపాకీ గురిపెట్టి వుండడం స్పష్టంగా కనిపిస్తోంది. కాల్పుల్లో కుప్పకూలిన ఆ యువకుణ్ణి కాపాడేందుకు అత్యవసర సహాయక సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నేల్ హత్యకు నిరసనగా పారిస్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయం ఎదుట స్థానికులు ఆందోళనకు దిగారు. కొన్ని చోట్ల కార్లకు నిప్పంటించారు. బస్ స్టాప్‌లను ధ్వంసం చేశారు. పోలీసులపైకి పేలుడు సామాగ్రిని విసిరేశారు. దాంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. గ్రెనెడ్లను ఉపయోగించారు.

మరింతగా నిరసనలు తలెత్తగలవన్న భయాలతో బుధవారం వేలాదిమంది పోలీసులను నగరంలో మోహరించారు. నేల్ హత్య తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఓ మహిళ వ్యాఖ్యానించారు. ఈ నిరసనల్లో ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఫ్రెంచి ఫుట్‌బాల్ స్టార్ క్లియాన్ బాపె పోలీసుల దాష్టీకాన్ని ఖండించారు. నేల్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నటుడు ఓమర్ సై పిలుపిచ్చారు.

ఫ్రెంచి పోలీసుల వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. గతంలో పెన్షన్ ఆందోళనల సమయంలోనూ వారు ఇలాగే దారుణంగా వ్యవహరించారని గుర్తు చేస్తున్నారు. గతేడాది కాలంలో ట్రాఫిక్ స్టాప్‌ల వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో 13మంది చనిపోయారు. ఈ ఏడాదిలోనే ఇలాంటి సంఘటన ఇది రెండవది.

'యావత్ దేశం కదిలిపోయింది' అంటూ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఈ సంఘటనపై వ్యాఖ్యానించారు. ఈ ఘటన క్షమించరానిదని ఆయన అన్నారు. . ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టామని, ప్రజలు శాంతంగా వుండాల్సిందిగా కోరారు. ప్రదర్శనల సందర్భంగా జరిగిన అల్లర్లకి సంబంధించి 31మందిని అరెస్టు చేశారు. ఈ ఘర్షణల్లో 25మంది పోలీసు అధికారులు గాయపడ్డారు. మొత్తంగా 40కార్లు తగలబడ్డాయని చెప్పారు.కాల్పులు జరిపిన పోలీసు అధికారిని అరెస్టు చేశారు. హత్యా అభియోగాలు మోపినట్లు నాన్‌టెరె ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది.

మంత్రి బుగ్గన పర్యటనలో అపశృతి

- తేనెటీగలు దాడి

70 మందికి గాయాలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం కనుమకింది కొట్టాల గ్రామ సమీపంలో బిల్వ స్వర్గం గుహలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు బుధవారం మంత్రి పరిశీలనకు వచ్చారు. గుహల్లో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయబోగా.. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది టవళ్లతో మంత్రికి రక్షణగా నిలబడ్డారు. మంత్రితో పాటు వచ్చిన నాయకులు, కార్యకర్తలపై తేనెటీగలు దాడి చేయడంతో దాదాపు 70 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో బేతంచెర్ల ప్రజాశక్తి విలేఖరి వేణుగోపాల్ ఉన్నారు. గాయపడిన వారిని వైద్యం కోసం బేతంచెర్ల శేషారెడ్డి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ ఉపాధ్యాయ అవార్డు-2023కు సంబంధించి దరఖాస్తులను పాఠశాల విద్యాశాఖ ఆహ్వానించింది. అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఝఱఱీఅ-ఖశ్రీఖఝఱతీసరశేఞఝఎష్ట్రవతీ.వసబఝఖ్ఱశీఅ.ప్త శీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా జులై 15లోపు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 14న నిర్ణయిస్తారని పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ ఆమోదం తెలిపిన తరువాత ఎంపికైన అభ్యర్థులకు ఆగస్టు 16 నుంచి 18 తేదీల్లో సమాచారం అందిస్తారని వెల్లడించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న ఎంపికైన వారికి అవార్డులను ప్రదానం చేస్తామని పేర్కొంది.

రేపు డిస్కమ్‌ల వద్ద నిరసన

- ఎపి మీటర్ రీడర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 30న డిస్కమ్‌ల వద్ద నిరసన చేపట్టనున్నట్లు ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ రామకృష్ణ, హజరత్ వలి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీటర్ రీడర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, యాజమాన్యం కుదించిన పని దినాల ఉత్తర్వులను రద్దు చేయాలని, సామాజిక భద్రత పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎల్, సిపిడిసిఎల్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. తమ సమస్యలను పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. గతంలో ఉన్న పని దినాలను 14 నుంచి తొమ్మిది రోజులు పని పూర్తి చేయాలనే నిబంధన విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

వియత్నాంకు కిర్‌పన్ నౌక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఐఎన్‌ఎస్ కిర్‌పన్ నౌక విశాఖపట్నం తూర్పు నౌకాదళం నుంచి వియత్నాంకు బుధవారం బయల్దేరింది. క్షిపణి విధ్వంసక నౌక ఐఎన్‌ఎస్ కిర్‌పన్ వియత్నాం రక్షణ శాఖ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్ ఆహ్వానం మేరకు వెళ్లింది. దేశీయంగా నిర్మితమై నౌకల్లో ఐఎన్‌ఎస్ కిర్‌పన్ మూడోది. ఇండియన్ నేవీలో అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న నౌక కిర్‌పన్. అత్యంత ఆధునికమైన ఆయుధాలు, సెన్సార్‌లను కలిగి విపత్తుల సమయాల్లో మానవీయమైన సేవలను అందించడంలో విశేష కృషి చేస్తోంది. విశాఖ నుంచి తన ప్రయాణం ఈ నెల 28న ప్రారంభించింది. వియత్నాం చేరుకుని అక్కడ నావికాదళ అధికారులతో సముద్ర తీర అంశాలపై పరస్పర సాంకేతిక విషయాలపై భాగ స్వామ్యం కానుంది. ఐఎన్‌ఎస్ కిర్‌పన్‌కు తూర్పునౌకాదళ చీఫ్ స్టాఫ్ కమాండ్ సంజయ్ వాత్స్యాయన్ ఆధ్వర్యాన నేవల్ డాక్ యార్డులో బుధవారం జరిగిన వేడుకలో వియత్నాం వెళ్లేందుకు ఘనంగా వీడ్కోలు పలికారు. లైక్ మైండెడ్ నావికాదళ దేశాలతో సమైక్యంగా కలిసే దిశగా కిర్‌పన్ వియత్నాం వెళ్లడం మంచి విషయమని సంజయ్ పేర్కొన్నారు.

పంపుసెట్లు మార్చాలి

- పురాతన, రీవైండ్ పంపుల వల్లే అధిక విద్యుత్ వాడకం
- అన్ని శాఖలకూ ఇంధనశాఖ సూచనలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పట్టణాలు, నగరాల్లో పలు అవసరాలకు వినియోగిస్తున్న విద్యుత్ పంపుసెట్లను అత్యవసరంగా మార్చాలని విద్యుత్‌శాఖ నిర్ణయించింది. పాత, అనేక దఫాలుగా రీవైండ్ చేసిన పంపుసెట్ల కారణంగా విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోందని ఆ శాఖ అధికారులు అంటున్నారు. అలాగే ప్రభుత్వ భవనాల్లో వినియోగిస్తున్న వాటిపైనా దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకూ ఇంధనశాఖ లేఖ రాసింది.

ఇటీవల పలు ప్రాంతాల్లో రాష్ట్ర విద్యుత్ పొదుపు సంస్థ నిర్వహించిన ఒక సర్వేలో అనేక విద్యుత్ పంపు సెట్లలో అధిక విద్యుత్ వినియోగం నమోదవుతోందని గుర్తించారు. దీనివల్ల కోట్లాది రూపాయల వరకు నష్టం వాటిల్లుతోందని వెల్లడైంది. అనేక భవనాల్లో ఎప్పుడో కొనుగోలు చేసిన, చెడిపోయిన తరువాత ఐదుసార్లు కన్నా ఎక్కువ రీవైండింగ్ చేసిన పంపులనే వాడుతున్నట్లు గుర్తించారు. వీటిల్లో విద్యుత్ ఆదా 46 శాతం నుంచి 63 శాతం వరకు మాత్రమే ఉంటోందని, అదే బహిరంగ మార్కెట్‌లో లభ్యమయ్యే పరికరాల్లో 75 నుంచి 85 శాతం వరకు ఆదా సామర్థ్యం ఉంటుందని గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని 90 వేల వరకు ప్రభుత్వ భవనాల్లో విద్యుత్ ఆదా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంటుందని, తద్వారా 25 శాతం నుంచి 30 శాతం వరకు విద్యుత్‌ను ఆదా చేయొచ్చునని ఇంధనశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ భవనాల్లో ప్రస్తుతం పాత విద్యుత్ పరికరాలనే వినియోగిస్తున్నారని ఇంధన పొదుపు సంస్థ పేర్కొంది. పొదుపు సామర్థ్యం ఎక్కువగా ఉన్న స్టార్ రేటెడ్ పరికరాలను వినియోగిస్తే విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చునని అధికారులు అంటున్నారు. తద్వారా రానున్న కాలంలో విద్యుత్ బిల్లులు కూడా తగ్గుతాయని వారు తమ లేఖలో పేర్కొన్నారు.

ప్రభుత్వ భవనాల్లో ఇటువంటి చర్యలు చేపడితే, దాని ప్రభావం ప్రయివేటు భవనాలు, వ్యక్తులపైనా పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే అంశంపై ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్ద జరిగిన ఇంధన పొదుపు మిషన్ సమావేశంలో కూడా అనే కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

2.5 కోట్ల కిలోవాట్లు ఆదా..

ప్రస్తుతం గుర్తించిన కొన్ని ప్రాంతాల్లో 239 విద్యుత్ పంపుసెట్లను మార్పు చేయడం ద్వారా దాదాపు 2.5 కోట్ల కిలోవాట్ల విద్యుత్‌ను ఆదా చేయొచ్చని అంచనా వేశారు. ఈ అంచనా రూ.20 కోట్ల వరకు ఉంటుందని, కొత్త పంపు సెట్లను ఏర్పాటుచేసేందుకు రూ.17 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

కందారపు మురళిపై అక్రమ కేసు

- ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రెండేళ్ల క్రితం అమరావతి రైతుల పాదయాత్ర సందర్భంగా సిపిఎం తరుపున సంఘీభావం ప్రకటించడాన్ని నేరంగా పరిగణించి ఆరు సెక్షన్లతో కూడిన కేసును సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళిపై పోలీసులు బనాయించారు.

ఈ మేరకు ఆయనకు బుధవారం పోలీసులు నోటీసులు ఇచ్చారు. అక్రమ కేసులు బనాయించడంతో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వాస్తవంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అమరావతి పాదయాత్రలో పాల్గొనలేదని, రోడ్డుకు ఒక వైపున నిలబడి సంఘీభావం ప్రకటించారని, దీనిని సైతం జగన్మోహన్‌రెడ్డి నేరంగా పరిగణించి తమ నాయకుడి పై కేసులు బనాయించడం అప్రజాస్వామికమన్నారు. తక్షణం కందారపు మురళిపై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టటం దినచర్యగా మారిందని విమర్శించారు. కేసులకు తాము భయపడి ప్రజా ఉద్యమాలకు దూరంగా ఉంటామని ప్రభుత్వం భావించడం హాస్యాస్పదమన్నారు.

23న రైతు రక్షణ కోసం రాష్ట్ర సదస్సు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేసే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించినందున రైతు రక్షణ కోసం జులై 23న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి పేర్కొంది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపును అమలు చేసేందుకు బుధవారం విజయవాడలోని దాసరి భవన్‌లో సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన సమన్వయ సమితి సమావేశం జరిగింది. సమావేశం తీర్మానాలను ఆయన మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర సదస్సులోగా అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించాలని, ఆగస్టు 1 నుంచి 9 వరకు కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బిజెపి హటావో- దేశ్ బచావో ఉద్యమాన్ని నిర్వహించాలన్నారు. ఆగస్టు 15న ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు, జులై 4న 'పోలవరం పోరుకేక' పాదయాత్ర విజయవాడకు వచ్చే సందర్భంగా సంఘీభావం తెలపాలని పేర్కొన్నారు. విద్యుత్తు చట్ట సవరణ బిల్లును రైతు సంఘాలతో సంప్రదింపులు చేసిన తర్వాతే పార్లమెంటు ముందు పెడతామని చెప్పి మాట తప్పిన బిజెపి ప్రభుత్వం బిల్లు పెట్టడం అన్యాయమన్నారు. విద్యుత్తు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూన్ 7న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు మోసపూరితమైనవని, మరోసారి కేంద్ర ప్రభుత్వం రైతులను మోసగించిందన్నారు. డాక్టర్ స్వామినాథన్ సూచన ప్రకారం సి2 ప్లస్ 50 శాతం కలిపి అన్ని పంటలకూ మద్దతు ధరలు ప్రకటించలేదని పేర్కొన్నారు. సమన్వయ సమితి సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా ఎపి రాష్ట్ర ప్రతినిధి రాయల చంద్రశేఖర్, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, ఎపిరైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య తదితర రైతు సంఘాల నాయకులు ఎర్నేని నాగేంద్రనాథ్, గురునాథరావు, చుండూరు రంగారావు, చిట్టిపాటి వెంకటేశ్వరరావు, కొలనుకొండ శివాజీ, మర్రెడ్డి వెంకటరెడ్డి, డి హరనాథ్, మరీదు ప్రసాద్, ఎం గిరీష్, వేల్పూరి నరసింహారావు, ఎం వీరబాబు, మర్రాపు సూర్యనారాయణ, సింగోతు నాగేంద్రరావు, ఎస్‌కె గౌస్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఓట్ల దొంగలు

- ఎన్నికల ప్రధాన అధికారికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓట్ల దొంగలు పడ్డారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. 2,100 ఇంటి నెంబర్లతో 1.85 లక్షల దొంగ ఓట్లు చేర్పించారని ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను టిడిపి నాయకులతో కలిసి అచ్చెన్నాయుడు సచివాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లో జగన్, అతని ప్రభుత్వం వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని గెలిచారని, ప్రజాబలంతో కాదని అన్నారు. 14 నియోజకవర్గాల్లో వైసిపి ప్రభుత్వం ఇష్టానుసారం దొంగ ఓట్లు చేర్పించిందని విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఎన్నికల ప్రధాన అధికారికి అందించామన్నారు. ఒక్కో ఇంట్లో 50 నుంచి 500 వరకు దొంగ ఓట్లు చేర్పించారని ఆరోపించారు. కలెక్టర్ల తీరుపై కూడా తాము ఫిర్యాదు చేశామన్నారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో విపరీతంగా దొంగ ఓట్లు పోలయ్యాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అధికార పార్టీ అదేపంథా నమ్ముకుందని విమర్శించారు. వీటిపై త్వరలో హైకోర్టులో కేసు వేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు జాబితా పరిశీలన బూత్ స్థాయి అధికారులతో జులై 21 నుంచి అక్టోబరు 7 వరకు నిర్వహిస్తామని ప్రధాన అధికారి మీనా తమతో చెప్పారన్నారు. అక్టోబరు 17 నాటికి ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ అందిస్తామని చెప్పారని తెలిపారు. ఇందులో ఇంకా దొంగ ఓట్లు ఉంటే మరోసారి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నక్కా ఆనందబాబు, బోండా, దేవినేని ఉమామహేశ్వరరావులు, పరుచూరి అశోక్‌బాబు, వర్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యదర్శుల పనివేళల్లో మార్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న పారిశుధ్య పర్యావరణ కార్యదర్శుల పనివేళల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు గానీ, ఉదయం 6 నుంచి 11 వరకు, మరలా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి జిఓ 423ను బుధవారం విడుదల చేశారు. ఈ జిఓను ఎపి గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ తీవ్రంగా ఖండించారు. అన్ని శాఖల ఉద్యోగులు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని, వీరికి మాత్రం రెండు పూటలా విధులు నిర్వహించాలనడం సరికాదన్నారు.

తెలుగులోనే హైకోర్టు తీర్పులు

- రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పరిపాలన అంతా మాతృభాష తెలుగులోనే జరగాలని, ఉత్తర ప్రత్యుత్తరాలు వ్యవహారిక భాషలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు కోరారు. గుంటూరు కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష అమలుపై జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. స్పందన కార్యక్రమాన్ని నూరు శాతం తెలుగులోనే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో న్యాయస్థానాలలో తీర్పులు తెలుగులోనే అమలు చేయాలని ప్రధాన న్యాయమూర్తిని కలవడం జరిగిందని, న్యాయస్థానాలలో తీర్పులు తెలుగులోనే అమలు చేసే విధంగా సానుకూల స్పందన కనబరచారని తెలిపారు. కొన్ని విభాగాల్లో తగినంత స్థాయిలో తెలుగు అమలు కావడం లేదన్నారు. సాంకేతికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అధికారులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికి అధికార భాషా సంఘం పలు సూచనలు చేసిందన్నారు. ఐటి విభాగంలో రెండ్రోజులు వర్క్ షాప్ నిర్వహించి సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. రాబోయే రోజులలో సాంకేతిక ఇబ్బందులు తొలగించి పాలనలో అధికార భాష మరింత విస్తృతంగా అమలు జరిగేలా చూస్తామని తెలిపారు. అధికార తెలుగు భాషా సంఘం సభ్యులు భాషావేత్త ప్రొఫెసర్ జె చంద్రారెడ్డి గుంటూరు తూర్పు తహశీల్దార్ నగేష్ పాల్గొన్నారు.

వంకావారిగూడెంలో మహా పాదయాత్ర అగ్రభాగాన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ తదితరులు

మహా పాదయాత్రలో మహిళా వలంటీర్ల దళం

నిర్వాసితులకు అండగా ఐక్య పోరాటం

మొదటి పేజీ తరువాయి

మండలాన్ని కేంద్రం ప్రయోగశాలగా మార్చాలని చూస్తోందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో మండలంలో గ్రామాలను ఖాళీ చేసి ఆయుధ ఫ్యాక్టరీని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అదాని ఆయుధ ఫ్యాక్టరీని మండల ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జీలుగుమిల్లి మండలానికి గొప్ప పోరాట చరిత్ర ఉందన్నారు. అనేక భూపోరాటాల్లో రాటుదేలిన ప్రజలు మడకంవారిగూడెంలో ఉన్నారని అభినందించారు. పోరాటయోధులంతా తిరిగి ఎర్రజెండా పట్టుకోవడం అభినందనీయమన్నారు. భూ పోరాటాల మాదిరిగానే ఆయుధ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడి తమ భూములు వదలబోమని తేల్చి చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మడకంవారిగూడెం, వంకావారిగూడెం తదితర ప్రాంతాలు నిర్వాసిత ప్రాంతాలుగా మారే ప్రమాదం ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల లక్షా ఐదు వేల కుటుంబాలు సర్వం కోల్పోతున్నాయని, అందుకే వారి హక్కుల కోసం ఈ నెల 20న నెల్లిపాక నుండి ప్రారంభమైన మహా పాదయాత్ర దాదాపు 170 కిలోమీటర్లు పూర్తి చేసుకుని వంకావారిగూడెం చేరుకుందన్నారు. పోలవరం నిర్వాసితులకు అంతా సంఘీభావం ప్రకటించి అండగా నిలవాలని కోరారు. ఆయుధాల ఫ్యాక్టరీ గురించి తెలియదని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, ఎంపి కోటగిరి శ్రీధర్ చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. సభలో ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, వి.వెంకటేశ్వర్లు, కె.సుబ్బరావమ్మ, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, వై.అచ్యుతరావు, కె.హరికిశోర్, జె.జయరాం, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్, విఆర్‌పురం ఎంపిపి కె.లక్ష్మి, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, కాకినాడ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, వివిధ సంఘాల నేతలు జక్కంశెట్టి సత్యనారాయణ, పివి.రామకృష్ణ, మొడియం నాగమణి తదితరులు మాట్లాడారు.

వంకావారిగూడెంలో పాదయాత్ర సందర్భంగా అభివాదం

అనంతపురంలో టవర్‌క్లాక్ దగ్గర నిరసన తెలుపుతున్న సిపిఎం, ఐద్వా నాయకులు

ప్రజలపై మోయలేని భారాలు

- పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు తగ్గించాలి
- ఐద్వా, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెరిగిన నిత్యావసరాలు, కూరగాయలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో అనంతపురం టవర్ క్లాక్ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కూరగాయలు మెడలో తగిలించుకుని, పళ్లెంలో టమోటాలు, మిరపకాయలు, ఇతర కూరగాయలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ.. నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఏమి కొనాలన్నా రూ.100కు పైగానే ఉన్నాయన్నారు. పెరిగిన ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ.. కూరగాయల సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం ప్రజలపై మాత్రం అధిక ధరల భారం పడుతున్నా చేష్టలుడిగి చూస్తోందన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని తెలిపారు. ప్రజలు, రైతులను దళారి వ్యవస్థ దోపిడీ చేస్తున్నా పాలకులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ప్రభుత్వం మొద్దు నిద్రవీడి పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ముస్కిన్, వెంకటనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి : జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి ఆధ్వర్యాన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 22 వేలమంది నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లో కనీస వేతనాలకు నోచుకోకుండా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడు ప్రతిపక్షనేతగా పాదయాత్ర చేస్తున్నప్పుడు అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు విస్మరించారని విమర్శించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లోని ఉద్యోగులకు కనీసవేతనాలు, హెల్త్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్, హెచ్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. మినిమం టైమ్‌స్కేల్‌ను అమలు చేయడంతోపాటు, బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, అసోం, హర్యానా, ఒడిశా రాష్ట్రాల్లో నేషనల్ హెల్త్ మిషన్‌లోని ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేశారని, రాష్ట్రంలో కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే పోరాటాన్ని అంచెలంచెలుగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి నాయకులు డి దయామణి, జె నరసింహులు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు చల్లని కబురు

- హయ్యర్ పెన్షన్ నమోదుకు అవకాశం
- రూ.25 వేల పెన్షన్ ధ్రువీకరణ పత్రాన్ని అందించిన
- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులకు సుప్రీం కోర్టు ఆదేశాలతో హయ్యర్ పెన్షన్ నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతంలో కార్పొరేషన్‌లో వున్నప్పుడు గానీ, ప్రభుత్వంలో విలీనం అయ్యాక గానీ ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ కేవలం నామమాత్రంగా రూ.5 వేలకు మించి రాకపోవడంతో ఆర్‌టిసి ఉద్యోగులు రిటైర్డు అయ్యాక తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో ఆర్‌టిసిలోని ఉద్యోగ సంఘాలు పెన్షన్ సమస్యను పరిష్కరించాలని అనేక సందర్భాల్లో ఆందోళనలు చేశాయి. 2022 నవంబరు 4న సర్వీసులో వున్న ప్రతి ఉద్యోగికీ హయ్యర్ పెన్షన్‌కు అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ స్కీమ్‌కు ప్రభుత్వం ఒకే చెప్పింది. ఈ స్కీమ్‌లోకి రావడంతో గతంలో కేవలం రూ.5 వేలు వచ్చే పెన్షన్ ఇప్పుడు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వచ్చే అవకాశం వుంది. బుధవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న సత్యనారాయణకు నెలకు రూ.25 వేల వరకూ పెన్షన్ వచ్చేలా హయ్యర్ పెన్షన్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆర్‌టిసిలో ప్రతి ఉద్యోగీ ఈ హయ్యర్ పెన్షన్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్‌డి సూచించారు. దేశంలో ఏ ఇతర ఆర్‌టిసి ఉద్యోగులకూ లేని ఈ అవకాశాన్ని ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులకు కలగడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

అరుణాచలం ప్రత్యేక సర్వీసులతో రూ.3.50 కోట్ల ఆదాయం

రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి అరుణాచలంకు నడిపిన ప్రత్యేక సర్వీసులతో ఎపిఎస్‌ఆర్‌టిసికి రూ.3.5 కోట్ల ఆదాయం వచ్చిందని ఎపిఎస్‌ఆర్‌టిసి ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ నడిపిన 483 సర్వీసుల ద్వారా ఈ ఆదాయాన్ని సముపార్జించినట్లు పేర్కొంది.

పెట్రేగిపోయిన రంగురాళ్ల ముఠా

- అటవీ ఉద్యోగులపై దాడి

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో రంగురాళ్ల ముఠా పెట్రేగిపోయింది. అధికార పార్టీ నాయకుల అండ చూసుకొని అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడింది. నిందితులను పట్టుకునేందుకు ఫారెస్టు సిబ్బంది ప్రయత్నించగా దాచేపల్లి మండల వైసిపి నాయకులు తమ వాహనాలను అడ్డుపెట్టి వారిని తప్పించారు. శంకరాపురం అటవీ ప్రాంతంలో రంగురాళ్లు సేకరించే ముఠాను అటవీశాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వీరిని పోలీసు స్టేషన్‌కు తరలించేలోగా అటవీశాఖ అధికారులపై దాడి చేసి నిందితులు పరారయ్యారు. వారిని పట్టుకునేందుకు అటవీశాఖ సిబ్బంది ప్రయత్నించగా స్థానిక వైసిపి నాయకులు వారిని తప్పించారు. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, నిందితులను పట్టుకోవాలని పల్నాడు జిల్లా డిప్యూటీ పారెస్టు అధికారి మురళీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల పేర్లు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. వైసిపి నేతల అండతో కొంతకాలంగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు బ్రేకులు పడుతున్నాయి. తాజాగా అధికారులు పట్టుకున్నా దాడి చేసి పారిపోవడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మురళీ ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్టు దాచేపల్లి పోలీసులు తెలిపారు.

విద్యా వ్యవస్థ గతినే మార్చేశాం

మొదటి పేజీ తరువాయి

మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు సింగపురంలో మినీ రిజర్వాయర్ కోసం రూ.38 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్రిడ్జి నిర్మాణానికి, ఎత్తిపోతల ప్రాజెక్ట్, క్రాసింగ్ నెట్ ప్లాంట్‌ను కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఇంటర్ విద్య కమిషనర్ సౌరభ్‌గౌర్, పాఠశాల మౌలిక వసతుల కమిషనర్ కె.భాస్కర్, పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్ర బృందాలకు సమస్యల ఏకరువు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన పోరుకేక పాదయాత్రకు గ్రామాల్లో అడుగడుగునా ఘన స్వాగతం లభిస్తోంది. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలుకుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు పాదయాత్ర బృందాల వద్ద తమ సమస్యలను ఏకరువు పెట్టారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

యూత్ ప్యాకేజీ ఇవ్వలేదు

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ యూత్ ప్యాకేజీ ఇస్తామన్నారు. ఇప్పటి వరకూ ఇవ్వలేదు. దీనిపై అధికారులను అడిగితే జాబితాలో పేరు లేదన్నారు. కారణమేంటంటే మాకు తెలియదని చెప్తున్నారు. ఏదైనా పని చేసుకుందామంటే పని లేదు. ఎట్లా బతికాలి

-ముచ్చిక విజయవర్ధన్, చేగొండపల్లి పునరావాస కాలనీ, పోలవరం

ఉపాధి కోల్పోయాం

ఆరెకరాల పోడు భూముల్లో జీడి గింజలు ఏరుకుని జీవనోపాధి పొందేవారం. పోలవరం ప్రాజెక్టు పేరుతో ఆరు ఎకరాల భూమిని తీసుకున్నారు. నష్టపరిహారం, భూమికి భూమి ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

-మిడియం వెంకాయమ్మ, చేగొండపల్లి పునరావాస కాలనీ, పోలవరం

తాగు నీటి సమస్య ఎక్కువగా ఉంది

ఇక్కడ నీటి సమస్య ఎక్కువగా ఉంది. మౌలిక వసతులు లేవు. దాహార్తి తీర్చుకోవడానికి అన్ని కాలాల్లోనూ తిప్పలు తప్పడం లేదు. తాగునీటి కోసం దూరంగా వెళ్లాల్సి వస్తోంది.

-కోట్ల చంద్రకళ, పోరెడ్డిగూడెం, జీలుగుమిల్లి మండలం

పరిహారం అందలేదు

ఇక్కడ సంవత్సరం నుంచి ఉంటున్నా కనీస సదుపాయాలు కల్పించ లేదు. మా గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇద్దరు పిల్లలున్నా పరిహారం ఇప్పటికీ అందలేదు.

-కనుగుల సుబ్బలక్ష్మి, పోరెడ్డిగూడెం, జీలుగుమిల్లి మండలం

పొమ్మనకుండా పొగ

- అభివృద్ధి పనులు శిలాఫలకాలతో సరి
- మౌలిక వసతుల కల్పనకూ మొండిచేయి
- ఆందోళనలో పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజలు

అధ్వానంగా ఉన్న చింతూరు మండలంలోని ఎజి కోడేరు రోడ్డు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ముంపు మండలాల్లో అభివృద్ధి అటకెక్కింది. శిలాఫలకాలు తప్ప గ్రామాల్లో ఎటువంటి పనుల జాడా కానరావడం లేదు. మౌలిక వసతుల కల్పనలోనూ పాలకులు మొండిచేయి చూపుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక, కూనవరం, విఆర్.పురం, చింతూరు మండలాల్లో 375 గ్రామాల్లో మూడు లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో ప్రతిపక్ష నేతగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటించి వరాల జల్లు కురిపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అప్పటికి ఉన్న వసతులు, సౌకర్యాలకు సైతం కోత పెట్టారు. 45.72 కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు జరగడం లేదు. గతేడాది వచ్చిన వరదల కారణంగా రహదారులు ఛిద్రమయ్యాయి. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు రోజుల తరబడి నీటిలో ఉండడంతో మరింత ప్రమాదకర స్థాయికి చేరాయి. పలు పాఠశాలల భవనాలు సైతం విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళన కలిగించే విధంగా మారాయి. ఈ పరిస్థితుల్లో రహదారులకు మరమ్మతులు చేయడం, ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడం వంటి బాధ్యతను ప్రభుత్వం విస్మరించింది. పంచాయతీలలో నిధులు లేవంటూ బోర్లుకు సైతం మరమ్మతులు చేయడం లేదు. దీంతో, వందలాది గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతోంది.

ముందుకు కదలని పనులు

విఆర్ పురంలో పెద్దమట్టపల్లి నుంచి నర్సింగపేటకు 25 కిలోమీటర్ల బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దీనికి కోటి రూపాయల ఖర్చు చేస్తామని అధికారులు ప్రకటించారు. అదే మండలంలో తెల్లంవారి గూడెం నుంచి గుండేటి వాడకు రూ.50 లక్షలతో ఐదు కిలోమీటర్ల బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రోడ్లు వేసేందుకు పాత రోడ్డును తవ్వి చిప్స్ వేశారు. ఇప్పటికీ ఈ రోడ్లు వేయలేదు. పెద్ద మట్టపల్లి నుంచి ఒరివాడ బిటి రోడ్డుకు శంకుస్థాపన చేసినా పనులు జరగలేదు. రేఖపల్లిలో కస్తూర్బా పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆ స్కూలుకు ప్రత్యామ్నాయంగా రూ.26 లక్షలతో భవనం నిర్మిస్తామని శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ నూతన భవనం పూర్తి కాలేదు. విఆర్ పురం పిహెచ్‌సి పాత భవనంలో కొనసాగుతోంది. కొత్త భవనం నిర్మాణానికి సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో, శిథిల దశలో ఉన్న భవనంలోనే అక్కడి వైద్యులు రోగులకు సేవలందిస్తున్నారు. ఇటీవల భవనం పెచ్చులూడి పడిపోయిందని, ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నామని ఎఫ్ఎన్ఒ వినీత తెలిపారు.

తాగునీటికీ తప్పని అవస్థ

చింతూరు మండలంలో 117, విఆర్.పురంలో 72, ఎటపాకలో 130, కూనవరంలో 56 గ్రామాలు మొత్తం 375 గ్రామాలు ఉన్నాయి. చింతూరు మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. బోర్లు రిపేర్లు కూడా సకాలంలో చేయడం లేదు. సిపిఎం ప్రజాప్రతినిధులు ఉన్న చోట చొరవ తీసుకొని తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఎటపాక మండలంలో తోటపల్లి, నెల్లిపాక, గౌరిదేవిపేట తదితర 28 గ్రామాల్లో, కూనవరం మండలంలో 20 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. పంచాయతీలలో నిధులు లేకపోవడంతో బోర్లు మరమ్మతు ఆలస్యమవుతోందని అక్కడి పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

గొంతెండుతోంది

మా గ్రామంలో 170 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 500కుపైగా జనాభా ఉంది. తాగునీటి సౌకర్యం లేదు. కిలోమీటరు దూరంలోని సోకులేరు వాగు నుంచి ప్రతి రోజూ మూడు బిందెల నీళ్లు మోసుకుని ఇంటికి తెస్తున్నాను. గత్యంతరంలేని పరిస్థితుల్లో గ్రామంలోని అందరం ఈ వాగు నీటినే తాగడానికి వినియోగిస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-సున్నం అశ్రిత, ముకునూరు, చింతూరు మండలం

గ్రావెల్ రోడ్లు వేయాలని కోరినా మంజూరు చేయలేదు

గతేడాది వచ్చిన గోదావరి వరదలకు గ్రామంలో రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. రోడ్లు మరమ్మతులు చేయాలని అధికారులను కోరినా సమస్యను పరిష్కరించలేదు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పారు. పైప్‌లైన్‌లు వేశారుగానీ ఇప్పటికీ కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో, గ్రామంలోని ప్రజలు బోరు నీరే తాగుతున్నారు. ఈ ప్రాంతం అధికారుల రికార్డుల ప్రకారం 45.72 కాంటూరు పరిధిలో ఉందని అధికారులు చెప్తున్నా అభివృద్ధి పనులు చేయడం లేదు.

-జల్లి లావణ్య, ఎంపిటిసి సభ్యులు, ఎజి కోడేరు, చింతూరు మండలం

'పోలవరం పోరుకేక' ఉప పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాల్సిందే
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి దారుణం
- పోలవరం పోరుకేక ఉప పాదయాత్ర ప్రారంభ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- పోలవరం (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇళ్లు, భూములు సర్వం త్యాగం చేసిన నిర్వాసితులైన త్యాగమూర్తులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు ఆలస్యం చేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం నుండి విజయవాడ వరకు చేపట్టిన 'పోలవరం పోరుకేక' ఉప పాదయాత్రను బుధవారం పోలవరం సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. టిడిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలకులకు గిరిజనుల ఓట్లు మాత్రమే కావాలా? వారి అభివృద్ధి, సంక్షేమం పట్టదా? అని నిలదీశారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన గిరిజన, గిరిజనేతర నిర్వాసితుల జీవితాలు పాలకులకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత గ్రామాల ప్రజలంతా పునరావాస గ్రామాలకు తరలి వెళ్లడంతో పోలవరంలో సాగే వ్యాపారాలన్నీ కుంటుపడ్డాయన్నారు. రాష్ట్రంలో పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీలేవీ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణానికి నిధులు ఇస్తూ, నిర్వాసితుల పరిహారం కోసం నిధులివ్వకపోవడం దారుణమన్నారు. నిర్వాసితుల పునరావాసానికి కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల పోలవరం మండలంలో ముంపు గ్రామాలన్నింటినీ ఖాళీ చేయించారని, నిర్వాసితులకు ఇస్తానన్న పరిహారం ఇవ్వలేదని, పోడు భూముల సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక నిర్వాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధి లేక అల్లాడిపోతున్నారని తెలిపారు. నిర్వాసితులందరికీ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాలను రీసర్వే చేయాలని కోరారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్ అండ్ ఆర్ పరిహారం అర్హులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల కోసం సాగుతోన్న పోరాటంలో గిరిజన, గిరిజనేతరులు అందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిర్వాసితుల పోరాటానికి రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలపాలని కోరారు. పాదయాత్ర దళ నాయకులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకూ రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని, కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10.50 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, యువతీ యువకులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, కాంగ్రెస్ మండల నాయకులు బొంతు వేణు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిపిఎం పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. నిర్వాసితుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. అనంతరం ఈ యాత్ర ఇటుకలకోట, వింజరం మీదుగా కొండ్రుకోట పునరావాసం గ్రామం వరకు సాగింది. ఈ యాత్రలో సిపిఎం నేతలు తామా ముత్యాలమ్మ, బొరగం భూచంద్రరావు, సముద్రాల సాయికృష్ణ, కామా బాలరాజు, మడిమి చలపతి, కొమరం పోసిరత్నం, మిడియం గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ విస్తరించకుంటే ప్రజా ఉద్యమం

నల్లమడ రైతు సంఘం, గుంటూరు చానల్ సాధన కమిటీ

దీక్షల్లో మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించకుంటే ప్రజా ఉద్యమం తప్పదని రైతు, ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. గుంటూరు ఛానల్ విస్తరణ చేయాలని నల్లమడ రైతు సం ఘం, గుంటూరు చానల్ సాధన కమిటీ ఆధ్వర్యం లో బుధవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట బుధ వారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణ ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, పర్చూరు మండలాల ప్రజల కలని అన్నారు. ఎనిమిదిన్నర దశాబ్దాలుగా పాలక పార్టీల నిర్లక్ష్యంతో వేలాది మంది రైతులు కడగండ్ల బారిన పడుతున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.270 కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎంతోమంది నేతలు గుంటూరు ఛానల్ విస్తరణకు పోరాటాలు నడిపారని, ప్రభుత్వం ఈసారైనా నిధులు విడుదల చేయకుంటే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మద్దతు పలికారు. సంక్షేమ పథకాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోన్న ప్రభుత్వం 50 గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించటానికి ఉపయోగపడే ఛానల్ విస్తరణకు రూ.300 కోట్లు ఖర్చు చేయటానికి చేతులు రావట్లేదన్నారు. తక్షణమే భూసేకరణకు నిధులు విడుదల చేసి, ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని కోరారు. దీక్షల్లో గుంటూరు ఛానల్ సాధన కమిటీ నాయకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, జాస్తి వీరయ్య చౌదరి, రామినేని సురేష్, బండి నాగేశ్వరరావు, కంచుమాటి అజయ్‌కుమార్, కొల్లా చిట్టెమ్మ, గొల్లపూడి శారద తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు ఉచిత విద్యుత్

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం నిర్వాసితుల కాలనీల్లో నివసించే ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కాలనీల్లో ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు పూర్తిస్థాయిలో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు అందలేదనే సాకుతో నిర్వాసిత కాలనీ లబ్ధిదారులకు అన్యాయం చేస్తుండడం తగదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి నిర్వాసితుల వివరాలు పూర్తిస్థాయిలో అధికారుల దగ్గర ఉన్నప్పటికీ పరిశీలన చేయడంలో నిర్లక్ష్యం కన్పిస్తోందన్నారు. ఇప్పటికైనా నిర్వాసిత కాలనీల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు పథకం అమలు చేయకపోతే, ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

వేలాది ఉద్యోగులపై వేటు

- మూడు సంస్థల యోచన
- క్రెడిట్ సూస్సెలో 35వేల సిబ్బంది..
- ఫోర్డ్‌లో 3వేల మంది ఇంటికి..
- గూగుల్‌లోనూ మళ్లీ ఉద్వాసనలు

న్యూఢిల్లీ : బహుళజాతి కార్పొరేట్ సంస్థలు భారీ ఆదాయాలను ఆర్జిస్తున్నప్పటికీ.. మందగమన భయాలను సాకుగా చూపుతూ.. మరింత పొదుపు చర్యలకు పాల్పడుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది చివరి నుంచి వరుసగా ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. తొలుత టెక్నాలజీ రంగంలో లక్షలాది మంది సిబ్బందిపై ఉద్వాసనలు ప్రారంభం కాగా.. ఆ తర్వాత తయారీ, స్టార్టప్, ఇతర రంగాల్లోనూ తొలగింపులు ఊపందుకున్నాయి. తాజాగా ప్రముఖ బ్యాంకింగ్ దిగ్గజం క్రెడిట్ సూస్సె, ఫోర్డ్, గూగుల్‌లో వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నట్లు రిపోర్టులు వస్తోన్నాయి. అయితే ఈ సంస్థలు భారత్‌లో ఎంత మందిని తొలగించేది స్పష్టత లేదు. స్విట్జర్లాండ్ కేంద్రంగా పని చేస్తోన్న క్రెడిట్ సూస్సె ఏకంగా 35,000 ఉద్యోగులను తొలగించే యోచనలో ఉందని సమాచారం. సంక్షోభంలోని ఈ సంస్థను ఇటీవలే యుబిఎస్ స్వాధీనం చేసుకుంది. సూస్సెలో పని చేసే వారిలో సగానికిపైగా ఉద్యోగులను యుబిఎస్ తొలగించనుందని బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. ప్రస్తుత ఏడాదిలో మూడు దఫాలుగా ఉద్వాసనలు ఉంటాయని తెలుస్తోంది. వచ్చే రెండు మాసాల్లో కఠిన నిర్ణయాలు తీసుకోబోతున్నామని యుబిఎస్ సిఇఒ సెర్గియో ఎర్మోట్టి జూన్ ప్రారంభంలో పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో క్రెడిట్ సూస్సెలో 45వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, మెటా, ట్విట్టర్, గూగుల్, అమెజాన్ తదితర కంపెనీలు తమ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేసిన విషయం తెలిసిందే.

గూగుల్ మ్యాపింగ్‌లో తొలగింపులు..

టెక్ దిగ్గజం గూగుల్‌లో మరోసారి ఉద్యోగులపై వేటు పడనుంది. గూగుల్ మ్యాపింగ్ సర్వీస్ వేజ్‌లో ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోన్నట్లు ఆ కంపెనీ తెలిపింది.

అదే విధంగా వేజ్ అడ్వర్‌టైజింగ్ సాఫ్ట్‌వేర్‌ను గూగుల్ యాడ్స్ టెక్నాలజీ కోసం వినియోగించనున్నట్లు పేర్కొంది. వేజ్ ప్రకటనల మానిటైజేషన్‌కు సంబంధించిన ఉద్యోగాల్లో తొలగింపులుంటాయని గూగుల్ జియో యూనిట్ వైస్ ప్రెసిడెంట్ క్రిస్ ఫిలిప్స్ ఉద్యోగులకు తెలిపారు. అయితే ఎంత మందిపై వేటు వేసేది ఆ సంస్థ వెల్లడించలేదు.

ఫోర్డ్‌లో 3వేల మంది..

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఫోర్డ్ తమ ఆదాయం తగ్గడంతో ఉద్యోగులను తగ్గించుకోనున్నట్లు ప్రకటించింది. అమెరికాలో పనిచేస్తున్న వారిలో మూడు వేల మందిని తొలగించనున్నట్లు అంచనా. వీరిలో రెండు వేల మంది సాధారణ సిబ్బంది కాగా, మిగతా వెయ్యి మంది కాంట్రాక్ట్ ఉద్యోగులని రిపోర్టులు వస్తోన్నాయి. అన్ని స్థాయిల్లో తొలగింపులు ఉండనున్నప్పటికీ.. ప్రధానంగా అధిక వేతనాలు పొందుతున్న ఉన్నత స్థాయి ఉద్యోగులు ఎక్కువ మందిని ఇంటికి పంపించనున్నట్లు సమాచారం.

బ్రో సినిమా టీజర్‌కు డబ్బింగ్ చెప్తున్న పవన్ కల్యాణ్ పక్కనే దర్శకుడు సముద్రఖని

'బ్రో' ట్రీజర్‌కు డబ్బింగ్ పూర్తి చేసిన పవన్

- వారాహికి స్వల్ప విరామంతో సినిమాపై జనసేనాని దృష్టి

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

వారాహి విజయ యాత్రకు స్వల్ప విరామం రావడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమాపై దృష్టి పెట్టారు. వారాహి యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వచ్చిన పవన్ అస్వస్థతకు గురికావడంతో వారాహి యాత్రకు స్వల్ప విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆయన పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై సముద్రఖని దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న బ్రో చిత్రం టీజర్‌కు బుధవారం డబ్బింగ్ చెప్పారు. చిత్ర దర్శకుడు సముద్రఖనితోపాటు చిత్ర యూనిట్‌ను భీమవరం రప్పించుకున్నారు. బ్రో సినిమా టీజర్‌కు పవన్ డబ్బింగ్ చెప్పారు. మరో రెండు రోజుల్లో బ్రో సినిమా టీజర్‌ను విడుదల చేయాలన్న ఉద్దేశంతో అస్వస్థతకు గురైనప్పటికీ డబ్బింగ్ చెప్పారని చిత్రయూనిట్ తెలిపింది.

రాజధాని ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు

- గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దొరబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. విజయవాడ ఆటోనగర్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ 32వ బోర్డు సమావేశం ఛైర్మన్ దొరబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, త్వరలో 5 లక్షల ఇళ్లలో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించనున్నామన్నారు. జగనన్న కాలనీల్లో 13.13 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉండగా, 5.50 లక్షల లబ్ధిదారులు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, 2024 మార్చి నాటికి నూరుశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు జి లక్ష్మీశా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నా యన్నారు. ఇప్పటి వరకు 12 లక్షల మంది లబ్ధిదారులకు రూ.35 వేలు చొప్పున రుణాలు అందించామన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ బోర్డు డైరెక్టర్లు ఏలూరి శ్రీనివాసులు, కె భాస్కర్ నాయుడు, జి సంధ్య, గృహ నిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. బోర్డు సమావేశానికి ముందు కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్లు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సంస్థ ఛైర్మన్ దొరబాబు, ఎండి లక్ష్మీశా ప్రారంభించారు. హెల్త్ కేర్ సంస్థకు చెందిన డాక్టర్లు బి మంజువాణి, పి భద్రయ్య, కె సోమనాథ్ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎనిమిదేళ్లలో మూడు రెట్లయిన శాఖలు

- బంధన్ బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని బంధన బ్యాంక్ గడిచిన ఎనిమిదేళ్లలో తమ శాఖల సంఖ్య మూడు రెట్లు పెరిగిందని వెల్లడించింది. ప్రస్తుతం 1500 పైగా శాఖలకు విస్తరించినట్లు పేర్కొంది. మరో 4,500 బ్యాంకింగ్ యూనిట్ల నెట్‌వర్క్‌తో, మొత్తం బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ల సంఖ్య 6,000ను అధిగమించినట్లు తెలిపింది. 2015 ఆగస్టులో 501 శాఖలతో తన ప్రయాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. ప్రస్తుతం 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు తమ కార్యకలాపాలను విస్తరించామని బంధన్ బ్యాంక్ ఎండి, సిఇఒ చంద్ర శేఖర్ ఘోష్ తెలిపారు.

అత్యుత్తమ పెట్టుబడికి అధ్యయనం ముఖ్యం

- ఆలిస్ బ్లూ సిఇఒ సిధవేలాయుధం

చెన్నయ్ : స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు అధిక అధ్యయనం అవసరమని ఆలిస్ బ్లూ సిఇఒ సిధవేలాయుధం పేర్కొన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం స్టాక్‌లు, ఈక్విటీ ఫండ్‌ల మధ్య నిర్ణయం తీసుకోవాల్సి వస్తే అనుభవం లేకపోతే ఇన్వెస్టర్లు నలిగి పోతారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "మీ పెట్టుబడి దృక్పథం దీర్ఘకాలికంగా ఉంటే.. మార్కెట్‌ను అర్థం చేసుకోవడానికి మీకు సమయం, అనుభవం లేనట్లయితే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో ఎటువంటి సందేహం లేకుండా పెట్టుబడి పెట్టాలి. అయితే.. మీరు దీర్ఘకాలిక పెట్టుబడి కోసం స్టాక్‌లను పరిశోధించే నైపుణ్యాన్ని కలిగి ఉంటే, వాటిని క్రమ పద్ధతిలో పరిశీలించి, ఓపికను అలవర్చుకుంటే, మీరు విజయవంతమైన పెట్టుబడిదారుగా మారే అవకాశం ఉంది." అని పేర్కొన్నారు. చాలా మంది కొత్తగా పార్ట్ టైమ్ ఇన్వెస్టర్లు నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం, ఈక్విటీ ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేయడం మధ్య నలిగిపోతున్నారన్నారు. వ్యక్తిగత దీర్ఘకాలిక పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో సంపదను పోగుచేసుకోవడం నిజమే అయినప్పటికీ, ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada - 520002 (A.P.)

E-PROCUREMENT SHORT TENDER NOTICE

NIT No. 2023/Pedalandarikiillu/Phase -VII **Dated: 28.06.2023**
Name of Work: "Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati" **Total number of works:** 18 Nos.

S. No.	Name of Work	Estimate Amount Rs.in Lakhs
1	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati- Mandadam (Layout: GNT-1)	41.00
2	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati- Mandadam(Layout: GNT-2 (NTR-10)	37.00
3	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati - Krishnayapalem (Layout: GNT-4)	35.00
4	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati- Krishnayapalem (Layout: GNT-5)	40.00
5	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati-Kuragallu at Ch:10+800 of N-09 (Layout: NTR 4)	35.00
6	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati- Nidamarru (Layout: NTR -5)	57.00
7	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati - Nidamarru (Layout: NTR -6)(E-14 Road Ch:5+550 to 6+300).	31.00
8	Formation of Approach Road (Ch: 0+000 to 0+600) to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati - Nidamarru (Layout: NTR -6)	49.50
9	Formation of Approach Road (Ch: 0+600 to 1+200) to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati - Nidamarru (Layout: NTR -6)	49.50
10	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati - Pichukalapalem & Borupalem (Layout: NTR -13 & 14)	49.00
11	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati - Nidamarru (Layout: NTR -7)	49.00
12	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati - Nidamarru (Layout: NTR -8)	48.00
13	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati - Nidamarru (Layout: NTR -9)	37.00
14	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati - Ananthavaram (Layout: NTR -12)	45.00
15	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati - Nuvuluru (Layout: GNT -6)	39.00
16	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - PedalandarikiilluAmaravati - Nuvuluru (Layout: GNT -7)	37.00
17	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati - Nuvuluru (Layout: GNT -8 & 9)	33.00
18	Formation of Approach Road to EWS House sites under Navaratnalu - Pedalandarikiillu Amaravati- Nekkalu (Layout: GNT -12)	49.00

The bids can be downloaded onAP e-procurement portal **from 30.06.2023 to 03.07.2023 up to 15:30 Hrs. Due date for submission of Bid 03.07.2023 up to 16.00 Hrs, bid opening 03.07.2023 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.**

COMMISSIONER, APCRDA

సంపాదకీయం

అందరికీ 'అమ్మ ఒడి'

పిల్లల చదువుల కోసం 'జగనన్న అమ్మ ఒడి' పేరిట ప్రతి ఏటా ప్రభుత్వం అందించే నగదు సాయం పొందే తల్లులు నిరుటి కంటే ఈయేడు లక్షా 34 వేల మంది తగ్గారు. ఒక్క సంవత్సరంలో ఇంత మంది లబ్ధిదారులు తగ్గారంటే బడికిపోయే పిల్లలు తగ్గారనుకుంటే పొరపాటు. పథకం లబ్ధికి ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షలే 'అమ్మఒడి' లబ్ధికి తల్లులను దూరం చేశాయి. పిల్లలను బడికి పంపించడమే తల్లులు చేయాల్సిన పని, చదివించే బాధ్యత ప్రభుత్వానిదేనన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆయన ప్రభుత్వ ప్రతినకు చిత్తశుద్ధి లోపించిందని గడచిన నాలుగేళ్లల్లో 'అమ్మఒడి' అమలు తీరుతెన్నులను పరిశీలించిన వారెవరికైనా అర్థమవుతుంది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుకొనే పిల్లల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా ప్రతి ఏటా రూ.15 వేలు జమ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ప్రభుత్వంలోకొచ్చాక స్కీం రూపకల్పనలోనే ఎంతమంది పిల్లలున్నప్పటికీ ఒక్కరికే నగదు బదిలీ అని సవరించారు. అప్పుడే పథకం సగం చిక్కిపోయింది. సర్కారు పెట్టుకొనే నిధులు గణనీయంగా తగ్గాయి. తొట్టతొలిగా వేసిన ఆ షరతుకు కాలక్రమంలో మరెన్నో షరతులొచ్చి చేరి 'అమ్మఒడి' లబ్ధికి తూట్లు పొడుస్తున్నాయి.

'అమ్మఒడి'కి ప్రభుత్వం తతిమ్మా సంక్షేమ పథకాల నిబంధనలను వర్తింపజేసింది. ప్రధానంగా ఆరు అంశాల ప్రాతిపదికన వలంటీర్లను ఒకటికి పదిసార్లు ఇంటింటికీ తిప్పి దుర్భిణీ వేసి లబ్ధిదారులను ఎంపిక చేసింది. అవన్నీ దుర్మార్గమైన ఆంక్షలు. విద్యుత్ వినియోగం సగటున నెలకు 300 యూనిట్లు దాటకూడదు. ప్రభుత్వం పలు రూపాల్లో పలుమార్లు కరెంట్ ఛార్జీలు పెంచినందున ఆ నిబంధనను పలువురు అనివార్యంగా దాటారు. అంతమాత్రం చేత వారందరూ ధనవంతులు కాలేదు. ప్రభుత్వం నుంచి జీతం పొందేవారికి 'అమ్మఒడి' లేదన్నారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీల వంటి స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్, సిబ్బందిని మినహాయించారు. పట్టణాల్లో వంద అడుగుల ఇల్లు ఉండకూడదు. ఇన్‌కంటాక్స్ రిటర్న్ ఫైల్ చేసి ఉండకూడదు. ఫోర్ వీలర్ ఉండకూడదు. స్టూడెంట్ హాజరు 75 శాతం తప్పనిసరి. ఇవి కాకుండా ఎప్పటికప్పుడు బయోమెట్రిక్ అథంటికేషన్, ఇ-కెవైసి, ఆధార్-బ్యాంక్ అకౌంట్ అనుసంధానం. ఈ షరతుల వలన గతంలో లబ్ధి పొందిన తల్లులు కూడా ఈ మారు దూరమయ్యారు. సాధారణంగా ఏటికేడు స్కూళ్లకొచ్చే పిల్లలు పెరుగుతారు. ఆ మేరకు లబ్ధిదారులూ పెరగాలి. విరుద్ధంగా లబ్ధిదారులు తగ్గడాన్నిబట్టి ఆంక్షల మాటున ప్రభుత్వ కోతల ఉద్దేశం బహిర్గతమవుతుంది. నిరుడు లబ్ధి పొందిన తల్లుల సంఖ్య 43.95 లక్షలు కాగా ఇప్పుడు 42.61 లక్షలకు తగ్గిపోయింది.

తమది సంక్షేమ రాజ్యమని ఘనంగా చెప్పుకునే ప్రభుత్వం నిబంధనలతో ప్రజలను సంక్షేమ పథకాలకు దూరం చేయడం ప్రజలను వంచించడమే. 'అమ్మఒడి'నే తీసుకుంటే ఒక వైపు లబ్ధిదారులను తగ్గిస్తూ మరోవైపు రూ.15 వేలు ఇస్తామని, స్కూళ్ల నిర్వహణ, టాయిలెట్ల నిర్వహణ పేరిట రూ.2 వేలు కోత పెట్టారు. ఆ వారా నిధులు ఆదా చేసుకున్నారు. 2021లో 6,673 కోట్లు, 2022లో 6,595 కోట్లు జమ చేయగా 2023లో 6,392 కోట్లేనన్నారు. నిధుల తగ్గుదలే పథకం పలచపడడానికి నిదర్శనం. సెకండరీ స్థాయిలో మధ్యలోనే బడి మానేస్తున్న పిల్లల శాతం ఆలిండియా సగటుతో పోల్చితే ఎ.పి.లో చాలా ఎక్కువ. కోవిడ్‌తో విద్యా వ్యవస్థ దెబ్బతింది. పేదరికం వలన బాలలు బడికి దూరం జరిగి పనులు చేసుకుంటూ బాలకార్మికులుగా మారడం సమాజానికి చేటు. ఈ పరిస్థితుల్లో 'అమ్మఒడి' వంటి సర్కారీ సాయాలు పెరగాలేకాని తగ్గకూడదు. విద్య కార్పొరేటీకరణ జరిగి ఎల్‌కెజికి రూ.లక్ష వసూలు చేసే యుగం నడుస్తోంది. ఈ స్థితిని కేంద్రం తెచ్చిన నూతన విద్యావిధానం మరింత పటిష్టం చేస్తోంది. రాష్ట్రం సైతం అదే కోవలో స్కూళ్ల విలీనం, ఎయిడెడ్ స్కూళ్ల రద్దు అంటోంది. పేదలకు ఇప్పటికీ ప్రభుత్వ బడులే దిక్కు. ఆ రీత్యా సర్కారీ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. పేదలకు, సామాన్యులకు ఊరటనిచ్చే 'అమ్మఒడి' పథకాలకు సార్వజనీనత కల్పించాలి.

మహనీయుల మాట

చదరంగంలో మాదిరిగానే
జీవితంలో కూడా
ముందుచూపు ఎంతో అవసరం.
- కందుకూరి వీరేశలింగం

ఓట్ల కోసం బిజెపి హిందూత్వ కార్డు

విశ్లేషణ

వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించడం కష్టమని నరేంద్ర మోడీకి, బిజెపికి బాగానే అర్థమవుతున్నది. గత రెండు మూడు నెలలుగా చోటుచేసుకున్న ఘటనలు అందుకు నిదర్శనం. పుల్వామా ఘటనపై మాజీ గవర్నర్, బిజెపి జాతీయ ఆఫీస్ బేరర్ సత్యపాల్ మాలిక్ వెల్లడించిన అంశాలను మొదలుకొని...ప్రభుత్వాన్ని విమర్శించేవారి ఖాతాలను బ్లాక్ చేయని పక్షంలో ట్విటర్‌ను మూసేస్తామని మోడీ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడిందన్న వార్తల వరకు ... ఇదే అంశాన్ని తెలియచేస్తున్నాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయం తన విజయాన్ని పునరావృతం చేయగలదన్న బిజెపి విశ్వాసాన్ని దెబ్బతీసింది. అందుకే వచ్చే ఎన్నికల్లో బిజెపి పెద్దఎత్తున మతం పేరుతో ప్రజలను చీల్చేందుకు ప్రయత్నిస్తుందని పలువురు రాజకీయ పరిశీలకులు, నేతలు అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఘటనలు వారు వేసిన అంచనా నిజమేనని నిరూపిస్తున్నాయి. ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, బీహార్‌లలో మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించి, ప్రజలలో చీలికలు పెంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకత్వం ప్రయత్నిస్తున్నాయి.

ఎం.వి. గోవిందన్

వచ్చే లోక్‌సభ ఎన్నికలలో గెలవడానికి మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం మినహా మరో మార్గం లేదన్న నిర్ణయానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వచ్చాయని అర్థంచేసుకోవాలి. మోడీ బొమ్మతో మాత్రమే లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేమని, కొత్త వ్యూహాలు అవసరమని ఆర్‌ఎస్‌ఎస్ దినపత్రిక 'ఆర్గనైజర్' పేర్కొనడాన్ని మరచిపోరాదు. అంటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఉద్దేశపూర్వకంగానే మత ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తున్నాయని అర్థంచేసుకోవాలి. ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్‌నగర్‌లో మాదిరిగా పెద్ద ఎత్తున మత ఘర్షణలుగా కాకుండా...చిన్న చిన్న మత ఘర్షణలను వ్యాప్తి చేసి జనాభాను మత ప్రాతిపదికన విభజించి మెజారిటీ హిందూ ఓట్లను కూడగట్టాలన్నది బిజెపి పన్నాగం. ఉత్తరాఖండ్‌లో గత రెండు వారాలుగా జరుగుతున్న సంఘటనలు భారత రాజ్యాంగానికి, అందులో పేర్కొన్న లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు విరుద్ధమైనవి. పద్నాలుగేళ్ల హిందూ బాలిక కిడ్నాప్‌తో కేసు మొదలైంది. బాలికను కిడ్నాప్ చేసిన మోటార్ సైకిల్ మెకానిక్ జితేంద్ర సైనీని, పురోలా వ్యాపారి ఉబైద్ ఖాన్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనను 'లవ్ జిహాద్'గా చిత్రీకరించి పురోలా లోని సంఘ్‌పరివార్ శక్తులు ముస్లింల వేట ప్రారంభించాయి. బాలికను అపహరించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకుల్లో ఒకరు హిందువు అయినప్పటికీ 'లవ్ జిహాద్'గా వర్గీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది.

> వచ్చే లోక్‌సభ ఎన్నికలలో గెలవడానికి మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం మినహా మరో మార్గం లేదన్న నిర్ణయానికి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వచ్చాయని అర్థంచేసుకోవాలి. మోడీ బొమ్మతో మాత్రమే లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేమని, కొత్త వ్యూహాలు అవసరమని ఆర్‌ఎస్‌ఎస్ దినపత్రిక 'ఆర్గనైజర్' పేర్కొనడాన్ని మరచిపోరాదు. అంటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు ఉద్దేశపూర్వకంగానే మత ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తున్నాయని అర్థంచేసుకోవాలి. ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్‌నగర్‌లో మాదిరిగా పెద్ద ఎత్తున మత ఘర్షణలుగా కాకుండా...చిన్న చిన్న మత ఘర్షణలను వ్యాప్తి చేసి జనాభాను మత ప్రాతిపదికన విభజించి మెజారిటీ హిందూ ఓట్లను కూడగట్టాలన్నది బిజెపి పన్నాగం.

'ముస్లింలు లేని ఉత్తరాఖండ్' అనే అత్యంత ప్రమాదకరమైన నినాదాన్ని ఇక్కడి సంఘ్ పరివార్ లేవనెత్తుతోంది. ఇక్కడ లవ్ జిహాద్‌ను 'వాణిజ్య జిహాద్'గా ప్రచారం చేస్తోంది. వ్యాపార రంగంలో హిందువులు మాత్రమే సరిపోతారు, ముస్లింలు లేదా ఇతర మతాల వారు అవసరం లేదనే నినాదం ఉత్తరాఖండ్ నుండి వస్తోంది.

రాజధాని డెహ్రాడూన్ నుండి 140 కి.మీ దూరంలో ఉత్తర కాశీకి సమీపంలో ఉన్న ఒక చిన్న పట్టణం పురోలా. ఇది కేవలం 5000 మంది జనాభా ఉన్న నగర పంచాయతీ. ఇక్కడ దాదాపు 650-700 చిన్న, పెద్ద దుకాణాలు ఉన్నాయి. వాటిలో 45 మాత్రమే ముస్లింలవి. ఇక్కడ ముస్లింలు 200 లోపే ఉన్నారు. ప్రస్తుతం వారిని ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీరిలో ఎక్కువ మంది యాభై ఏళ్లకు పైగా అక్కడే నివసిస్తున్నారు. 'దేవభూమి రక్షా అభియాన్' అనే హిందూత్వ సంస్థ ఈ నెల పదిహేనవ తేదీలోగా ముస్లిం వ్యాపారస్తులందరినీ ఖాళీ చేయాలని నోటీసు జారీ చేసింది. 42 మంది ఇప్పటికే ఖాళీ చేశారు. ఏడుగురైతే అన్నీ సర్దుకుని పురోలా నగరానికి వీడ్కోలు పలికినట్లు మీడియా కథనాలు చెబుతున్నాయి. మరికొందరు డెహ్రాడూన్, సమీప పట్టణాల్లోని బంధువుల ఇళ్లలో భయంతో జీవిస్తున్నారు. ముస్లిం దుకాణాలపై నల్ల గీతలతో గుర్తించి సోదాలు చేసి ధ్వంసం చేసినట్లు నివేదికలు ఉన్నాయి.

ఇతర మతాల వారు బిజెపి తో అంటకాగితే సంఘ్ పరివార్ దాడుల నుంచి తప్పించుకోవచ్చని ఎవరూ అనుకోవద్దన్న సందేశాన్ని కూడా ఉత్తరాఖండ్ పంపుతోంది. 2017లో బిజెపి అధికారంలోకి రాగానే పురోలాలో బట్టల వ్యాపారి సాహిద్ మాలిక్ బిజెపిలో చేరారు. బిజెపి మైనారిటీ మోర్చా నాయకుడయ్యాడు. అయితే, సంఘ్ పరివార్ ముస్లిం వ్యాపారులను ఖాళీ చేయించాలని నిర్ణయించినప్పుడు, సాహిద్ మాలిక్ ప్రాణాలను కాపాడుకోవడానికి తన దుకాణాన్ని మూసివేసి పురోలా నుండి పారిపోవాల్సి వచ్చింది. మణిపూర్‌లో క్రైస్తవ బిజెపి మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లకు సంఘ్ పరివారీయులే నిప్పు పెట్టారు. కేరళలో బిజెపి కి దగ్గరవ్వాలని తహతహలాడుతున్న వారికి ఇది గుణపాఠం కావాలి.

బిజెపి చర్యలను వ్యతిరేకిస్తే ముస్లింలకు అనుకూలమన్న అపవాదును మోయాల్సి వస్తుందని కాంగ్రెస్ నేతలు మౌనంగా ఉంటున్నారని 'న్యూస్ క్లిక్' వార్తా కథనం పేర్కొంది. పురోలా లోని ముస్లిం వ్యాపారులను తొలగించడానికి సంబంధించి కాంగ్రెస్ ఏమాత్రం స్పందించలేదని ఆ కథనం చెబుతోంది.

ఉత్తరాఖండ్‌లో 'లవ్ జిహాద్', 'ట్రేడ్ జిహాద్' మాత్రమే కాకుండా 'మజర్ జిహాద్' (ల్యాండ్ జిహాద్) కూడా మొదలైంది. ఇప్పటికే 325 మసీదులను అనధికార భూమిలో ఏర్పాటు చేశారంటూ బుల్డోజర్లతో కూల్చివేశారు. వెయ్యికి పైగా అక్రమ మసీదులు ఉన్నాయని, వాటిని కూల్చివేస్తామని బిజెపి ప్రభుత్వం చెబుతోంది. అంటే రాష్ట్రంలో ముస్లింలు ఏ విధంగానూ జీవించలేని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ హయాంలోనే ఈ అక్రమ మసీదులు వచ్చాయని బిజెపి ఆరోపిస్తోంది. అయితే దీనిపై స్పందించేందుకు కూడా కాంగ్రెస్ సిద్ధంగా లేదు. ఇది కాంగ్రెస్ మెతక హిందుత్వ ధోరణిని తెలియజేస్తోంది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మాదిరిగానే ఉత్తరాఖండ్ కూడా హిందూ మత ప్రయోగశాలగా మారుతోంది. 2024లో మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే హిందూ రాష్ట్ర ప్రకటన ఉంటుందనడానికి ఇదొక స్పష్టమైన సంకేతం.

మహారాష్ట్రలో కూడా ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి గ్రూపు ఉద్దేశపూర్వకంగానే మత ఘర్షణలు సృష్టిస్తోంది. ఔరంగజేబు, టిప్పు సుల్తాన్‌లను కొనియాడుతూ కొందరు సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌లను సాకుగా చూపి కొల్హాపూర్, బీడ్, అహ్మద్‌నగర్‌లలో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించాయి. మూడు నెలల్లో ఎనిమిది నగరాల్లో మత ఘర్షణలు జరిగాయి. మరోవైపు ఇలాంటి విధ్వంసాలను అరికట్టాల్సిన ప్రభుత్వం ప్రజలను వీధిన పడేస్తూ ఉద్రిక్తతలను పెంచే ప్రయత్నం చేస్తోంది. మహారాష్ట్ర హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న దేవేంద్ర ఫడ్నవిస్ ప్రకటనను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. రాష్ట్రంలో అల్లర్ల వాతావరణం నెలకొనడానికి కారణం ఔరంగజేబు వారసులు ఇంకా ఇక్కడ వుండడమేనని ఫడ్నవిస్ పేర్కొన్నారు. దీనినిబట్టి అల్లర్లు సృష్టించేందుకు సంఘ్ పరివార్ పన్నిన పథకమే ఇదని రుజువైంది.

'గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలు మతతత్వ దూకుడును మరింతగా ఉధృతం చేసేందుకు ఒక పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నట్టుగా వుందని ఈ నెల 12వ తేదీన 'ది హిందూ' దినపత్రిక మొదటి పేజీలో రాసిన ప్రత్యేక కథనంలో పేర్కొంది. చిన్నచిన్న ఘటనలను ప్రస్తావిస్తూ సామాన్యుల జీవనం అగమ్యగోచరంగా మార్చే యత్నాలు జరుగుతున్నాయని ఆ పత్రిక పేర్కొంది. బిజెపి-షిండే గ్రూపు శివసేన ప్రభుత్వానికి కాంగ్రెస్-ఎన్‌సిపి-ఉద్ధవ్ శివసేన కూటమి నుంచి గట్టి సవాలు ఎదురవుతోంది. మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించడానికిది సులభమైన మార్గమిది. బీహార్ లోనూ బిజెపి ఇదే తరహాలో ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, ఉత్తరాఖండ్‌లో మాదిరిగా మహారాష్ట్రలో విజయం సాధించలేదు. కేరళలో కూడా ఆ విధమైన ఎత్తుగడలను నిరోధించేందుకు అప్రమత్తంగా వుండాల్సిన అవసరముంది.

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

కమ్యూనిస్టులపై నిందలు తగునా?

సమాధానం

ఈ నెల 11వ తేదీన ఆంధ్రజ్యోతిలో చెరుకూరి సత్యనారాయణ గారు రాసిన వ్యాసం చదివాక ఇలా రాయవలసి వచ్చింది. కమ్యూనిస్టు ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను, పిల్లలను కమ్యూనిస్టులు పట్టించుకోవటం లేదంటూ చేసిన తీవ్ర ఆరోపణలు నన్ను ఎంతో బాధించాయి. శ్రీకాకుళం గిరిజనోద్యమంలో మా అమ్మా, నాన్నలు పంచాది నిర్మల, పంచాది కృష్ణమూర్తి అమరులయ్యారు. నాకు ఐదేళ్లు నిండగానే మా నాన్నను 1969 మే 27న ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో కాల్పించింది. ఆ తరువాత కొద్ది వారాల తరువాత మా అమ్మ నన్ను, మా తమ్ముడ్ని మా తాతగారి ఇంటివద్ద ఉంచి తిరిగి ఉద్యమంలో పాల్గొనడానికి వెళ్లింది. పోలీసులు ఆమెను అదే ఏడాది డిసెంబర్ 22న పొట్టనబెట్టుకున్నారు. అప్పటికి మా తమ్ముడు ఏడాది బాలుడు. మాలాగే ఇంకెంతో మంది తల్లిదండ్రు లిద్దరినీ లేదా ఏ ఒకరినో కోల్పోయినవారున్నారు. తల్లిదండ్రులను, ఎదిగిన బిడ్డలను కోల్పోయిన వారి బాధ, ఆవేదన వర్ణనాతీతం. ఎవరూ తీర్చలేనిది, పూడ్చలేనిది కూడా.

పంచాది రోజా

అయితే అటువంటి బిడ్డలను, ఆ యా కుటుంబాలనూ కమ్యూనిస్టు పార్టీలు పట్టించుకోవటంలేదని నిందించడం ఎంతవరకు సబబు? నా వరకు నా అనుభవం చూస్తే ఇది పనిగట్టుకొని కమ్యూనిస్టు పార్టీలపై అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం అనిపిస్తుంది. ఎందుకంటే ఈ రాష్ట్రంలో 1962 నుండి 1978 వరకు కమ్యూనిస్టులకు గడ్డురోజులే. కమ్యూనిస్టు ఉద్యమం రెండు సార్లు నిలువునా చీలిపోయిన కాలమది. నక్సలైట్ ఉద్యమ అణచివేత పేరిట 1969-71 మధ్య ప్రభుత్వం వారిపై తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. ఎమర్జెన్సీ కాలంలో కేవలం కమ్యూనిస్టులేగాక యావత్ ప్రజాతంత్ర శక్తులకూ రాష్ట్రం ఓ బందిఖానాలా మారింది. 1969-71 మధ్య దొరికినవారిని దొరికినట్టుగా కొండల్లోకి అడవుల్లోకి తీసుకెళ్లి చెట్లకు కట్టి మరీ కాల్చివేయించింది. వేలాదిమందిని జైళ్లల్లో కుక్కింది. సమాజంలో స్వేచ్ఛగా తిరగలేని అతి క్లిష్టమైన పరిస్థితులను ఆ నాడు కమ్యూనిస్టులు ఎదుర్కొన్న సంగతి అందరికీ తెలిసినదే.

> నిరంతరం పేదల కోసం, ప్రజల సంక్షేమం కోసం తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడుతున్న త్యాగ చరిత్ర కమ్యూనిస్టు పార్టీలది. పాలకవర్గ పార్టీలు సంపన్నుల కొమ్ము కాస్తాయన్నది జగమెరిగిన సత్యం. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించటం, ప్రజల హక్కులను కాలరాయటం పాలకవర్గ పార్టీల నిత్యకృత్యం. మహిళలని కూడా చూడకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నడిబొడ్డున 2000 సంవత్సరంలో అంగన్‌వాడీ ఉద్యోగులను గుర్రాలతో తొక్కించిన పార్టీతో ఆ పాశవిక నిర్బంధానికి గురైన కమ్యూనిస్టులను పోల్చటం సముచితమా? టిడిపి పట్ల ప్రేమాభిమానాలు, ఆ నాయకుల పట్ల గౌరవాన్ని వ్యక్తం చేయడానికి అనేక మార్గాలున్నాయి. అందుకోసం ఆ వ్యాస రచయిత కమ్యూనిస్టుల్ని నిందించడం తగునా?

అట్టి పరిస్థితుల్లో కూడా ప్రాణాలను కోల్పోయిన తమ సహచరుల కుటుంబాలకు, పిల్లలకు చేయూతనందించాలని చాలామంది కమ్యూనిస్టు నేతలు కృషి చేశారు. కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారు, మరికొంతమంది నేతలు (నాకు పేర్లు గుర్తులేవు) అజ్ఞాతవాసంలో ఉంటూ కూడా మా వివరాలు తెలుసుకొని మమ్మల్ని కలవాలనుకున్నారట. కొరియర్ నన్ను ఒరిస్సా లోని ఒక రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ నన్ను చూసి మా గురించిన వివరాలన్నీ తెలుసుకొని మేము మా తాతగారింట్లో క్షేమంగా ఉన్నామని తెలిశాక కుదుటపడ్డారు. కామ్రేడ్ చౌదరి తేజేశ్వరరావు, సంపూర్ణమ్మలు జైలులో ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు మా సమాచారం తెలుసుకునేవారు. పెరోల్‌పై వచ్చిన సందర్భంలో కూడా సంపూర్ణమ్మ నన్ను కలిసేవారు. కావలసిన వస్తువులు కొనిచ్చేవారు. ఒకసారైతే విశాఖపట్నం తీసుకుపోయి 'మా భూమి' సినిమా చూపించారు. తేజేశ్వరరావు గారు జైలు నుంచి విడుదలయ్యాక శ్రీకాకుళంలో వారింట్లో ఉంచి నన్ను డిగ్రీ చదివించి అండగా నిలిచారు. ఆ సమయంలో మా గురించి తెలుసుకున్న కామ్రేడ్ ఎల్.బి.గంగాధరరావు గారు (ఆనాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి), కామ్రేడ్ డి.బిక్షావతి గారు (రాష్ట్ర మహిళా నాయకురాలు) మాకు బట్టలు పంపించారు.

మా తమ్ముడు పంచాది ప్రభాకరరావు (విశ్వం) గుండె జబ్బుకు గురయ్యాడు. ఒక వాల్వు పూర్తిగా పాడయింది. ఆ పరిస్థితుల్లో వాల్వు మార్పిడి కోసం ఆనాడు సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ తవనం చెంచయ్య గారు చాలా కృషి చేశారు. కేర్ హాస్పటల్ సర్జన్ డాక్టర్ ప్రసాదరావు గారితో మాట్లాడి 1999లో ఉచితంగా వాల్వు మార్పిడి, బైపాస్ శస్త్ర చికిత్స చేయించారు. ఆయన ఎంతో నాణ్యమైన విదేశీ వాల్వును అమర్చారు. మా వద్ద డైట్ చార్జీలు మినహా హాస్పటల్‌కు సంబంధించిన ఖర్చులేవీ లేకుండా ఉచితంగానే చేశారు. పార్వతీపురం కుట్ర కేసు వాదించిన ప్రముఖ న్యాయవాది పి.ఎల్ నాయుడు గారు (విశాఖపట్నం) మా చిన్నతనంలో మా తమ్ముడిని పెంచుకుని బాగా చదివిస్తానని అడిగారట (అందుకు మా తాతగారు, ఇతర కుటుంబ సభ్యులు అంగీకరించలేదు.). నా చిన్నతనంలో పెరిగిన బొడ్డపాడు గ్రామస్తులు ఇప్పటికీ నన్ను (వారు ఏ గ్రూపులు, పార్టీలకు చెందినవారైనా) వారి బిడ్డగా చూసుకుంటారు. మా పెళ్లికి బట్టలు కూడా పెట్టారు. నేను రాష్ట్ర కేంద్రంలో సిపిఎం కార్యకర్తగా చురుకుగా పని చేసిన సమయంలో వివిధ ఎం.ఎల్ పార్టీల రాష్ట్ర నాయకులు ముఖ్యంగా కోటయ్య గారు, సాంబశివరావు గారు, విజయకుమార్ గారు ఇలా చాలా మంది కలిసినపుడు మా యోగక్షేమాల గురించి ఎంతో ఆప్యాయంగా తెలుసుకునేవారు. ప్రత్యక్షంగా మాతో మాట్లాడకపోయినా ఆ యా సందర్భాల్లో మా గురించి ఫలానా జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు భోగట్టా చేశారని నేను కలిసినపుడు చాలామంది చెబుతుండేవారు. ఆ రకంగా మేమిద్దరం తల్లిదండ్రులు

లేకపోయినప్పటికీ చాలామంది కుటుంబ సభ్యుల మధ్య పెరిగాము. ఇప్పటికీ ఆ అనుబంధాలు, ఆప్యాయతలు కొనసాగుతున్నాయి. వారందరితో మాకు కమ్యూనిస్టు ఉద్యమం తప్ప ఇంకే రక్త సంబంధం ఉంది? అయితే అందరికీ మాలాంటి అనుభవాలే ఉండకపోవచ్చు. కష్ట సమయాల్లో కొందరికి ఏ సహాయమూ అందకపోవచ్చు. ఎన్నో ఇబ్బందులు పడివుండవచ్చు కూడా.

మాలాగే తల్లిదండ్రులను కోల్పోయిన చాలామందికి ఏదో ఒకరకంగా కమ్యూనిస్టు పార్టీలు, నాయకులు అండగా నిలిచారు..నిలుస్తున్నారు...నిలుస్తుంటారు. అయితే ఇవేవీ ఎవరూ బయటకు చెప్పరు. కాని ఆ వ్యాసం చూశాక నా అనుభవాలు కొన్నయినా చెప్పాల్సి వచ్చింది. ఎవరేమనుకున్నా కమ్యూనిస్టులు గొప్ప మానవతావాదులు. ఇది తిరుగులేని వాస్తవం.

మరో బాధాకరమైన విషయం కమ్యూనిస్టు పార్టీలను పాలకవర్గ పార్టీలతో పోల్చటం. నిరంతరం పేదల కోసం, ప్రజల సంక్షేమం కోసం తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడుతున్న త్యాగ చరిత్ర కమ్యూనిస్టు పార్టీలది. పాలకవర్గ పార్టీలు సంపన్నుల కొమ్ము కాస్తాయన్నది జగమెరిగిన సత్యం. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించటం, ప్రజల హక్కులను కాలరాయటం పాలకవర్గ పార్టీల నిత్యకృత్యం. మహిళలని కూడా చూడకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నడిబొడ్డున 2000 సంవత్సరంలో అంగన్‌వాడీ ఉద్యోగులను గుర్రాలతో తొక్కించిన పార్టీతో ఆ పాశవిక నిర్బంధానికి గురైన కమ్యూనిస్టులను పోల్చటం సముచితమా? టిడిపి పట్ల ప్రేమాభిమానాలు, ఆ నాయకుల పట్ల గౌరవాన్ని వ్యక్తం చేయడానికి అనేక మార్గాలున్నాయి. అందుకోసం ఆ వ్యాస రచయిత కమ్యూనిస్టుల్ని నిందించడం తగునా?

/ వ్యాసకర్త ఎ.పి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పూర్వ కార్యదర్శి, సెల్ : 9490098028 /

అభిప్రాయం

కృత్రిమ మేధస్సు సమాజంపై ప్రభావం

చాలా కాలం నుండి కృత్రిమ మేధస్సు గురించి చర్చ జరుగుతున్నప్పటికీ ఇటీవల కాలంలో దీని గురించి ఎక్కువగా వింటున్నాం. అనేక సంస్థలు తమ కృత్రిమ మేధస్సు గురించి మాట్లాడటం, అలాగే చాట్ జిపిటి వంటివి అందుబాటులోకి రావటం ఈ చర్చ వేడిని పెంచింది. గత వారం మైక్రోసాఫ్ట్ కూడా ఓపెన్ పైలెట్ అని తన కృత్రిమ మేధ గురించి ప్రపంచానికి చెప్పింది. అలాగే గూగుల్, మెటా వంటి అనేక దిగ్గజాలు కూడా కృత్రిమ మేధస్సు అభివృద్ధిపరచటంలో చాలా కాలం నుంచి పని చేస్తున్నాయి. తొందరలో అవి కూడా తమ వాటిని మార్కెట్ లోకి విడుదల చేయవచ్చు .

కృత్రిమ మేధస్సు (ఏ.ఐ) యొక్క వేగవంతమైన అభివృద్ధి ఉపాధి మార్కెట్‌పై, ముఖ్యంగా యువతరంపై దాని ప్రభావం గురించి ఆందోళనలను పెరుగుతున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఇటీవల జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 2025 నాటికి అన్ని పనులలో సగానికిపైగా యంత్రాల ద్వారా నిర్వహించబడతాయని, చాలా మంది కార్మికులకు ఉద్యోగాలు లేకుండా పోతాయని అంచనా వేసింది. నేటి పోటీ ఉద్యోగ విపణిలో ఇప్పటికే పని దొరక్క ఇబ్బందులు పడుతున్న యువతకు ఇది ఆందోళన కలిగించే అంశమే. రిటైల్, హాస్పిటాలిటీ, తయారీ రంగాలలో జాబ్ మార్కెట్‌పై కృత్రిమ మేధస్సు ప్రభావం అధికంగా వుండవచ్చు. తక్కువ నైపుణ్యం ఉన్న స్థానాల్లోని కార్మికులు ఈ మార్పు వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఏ.ఐ పెరుగుదల కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించగలదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. అయినప్పటికీ, భవిష్యత్తులో ఉద్యోగాలకు ప్రస్తుతం చాలా మంది యువకులకు లేని సాంకేతిక నైపుణ్యం అవసరం అవ్వవచ్చు. అందుచేత, ఏ.ఐ ప్రయోజనాలు అధిక నైపుణ్యం కలిగిన కొద్దిమంది కార్మికుల సమూహంలో కేంద్రీకృతమై...మెజారిటీ కార్మికులు ఉపాధి కోల్పోవటానికి అవకాశం ఉంది.

కృత్రిమ మేధస్సు వలన ఇప్పుడున్న చాలామంది కార్మికుల జీతాలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది (ఉత్పత్తి ఖర్చు కూడా తగ్గుతుంది). ఎందుకంటే ఒక పని చేయటానికి కార్మికుడికి కావలసిన నైపుణ్యం యంత్రానికి మరింత బదలాయించబడుతుంది కనుక. ఒక కార్మికుడికి ఇప్పుడు కావాల్సింది కృత్రిమ మేధను ఎలా ఉపయోగించాలనేది తెలియటమే. ఉదాహరణకు ఒక సాఫ్ట్‌వేర్ నిపుణుడు ఇప్పుడు తన పనిలో భాగంగా కోడ్ రాస్తాడు. కృత్రిమ మేధ వచ్చిన తరువాత ఈ బాధ్యత చాలా వరకు యంత్రానికి బదలాయించబడుతుంది. కార్మికుడు చేయవలసిందల్లా ఏ.ఐ ఇచ్చిన కోడ్‌ను కొంత పరిశీలించటం, వాడుకొనటం. ఇలా అన్ని రంగాలలో కార్మికుల విధులు ఇదే విధంగా యంత్రానికి మరింత బదలాయించబడతాయి. ఈ ప్రక్రియ ప్రతి పారిశ్రామిక విప్లవం జరిగినప్పుడు జరిగేదే కానీ ఈ కృత్రిమ మేధస్సు ప్రయోజనాలు అంతిమంగా మెజారిటీ ప్రజలయిన కార్మికులకు బదలాయించపడతాయా లేదా గుప్పెడు కార్పొరేట్లకా అనేదే ప్రశ్న. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు తగ్గి, ప్రైవేటు యాజమాన్యం ప్రతి రంగంలో బలీయమయిన శక్తిగా మారిన ఈ రోజుల్లో ఏ.ఐ పెరుగుదల పని పరిస్థితులపై కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. యంత్రాలు ఎక్కువగా ప్రబలంగా మారడంతో, కార్మికుల భద్రత, శ్రేయస్సు కంటే కంపెనీలు వారి ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. ఈ సవాళ్లకు ప్రతిస్పందనగా, అనేక సంస్థలు, ప్రభుత్వం భవిష్యత్తులో ఉద్యోగాల కోసం కార్మికులను సిద్ధం చేయడానికి విద్య, శిక్షణ కార్యక్రమాలలో ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంది. యంత్రాల ఆధిపత్యం ఉన్న ప్రపంచంలో యువత అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలను సమకూర్చడం ద్వారా, ఏ.ఐ ప్రయోజనాలు సమాజం అంతటా సమానంగా పంపిణీ చేయబడాలంటే ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రైవేటు రంగ పరిశ్రమలపై ప్రభుత్వం గణనీయమైన పట్టు కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే సాంకేతికత వల్ల చేకూరే ప్రయోజనాలు సమానంగా పంపిణీ చేయబడతాయి. లేనిపక్షంలో ఇప్పుడున్న అసమానతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. యంత్రాల పెరుగుదల అనేక ప్రయోజనాలను తెచ్చిపెట్టినప్పటికీ కార్మికులపై, ముఖ్యంగా యువకులపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవడం, వారు వెనుకబడిపోకుండా చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. విద్య, శిక్షణ కార్యక్రమాలలో పెట్టుబడి పెట్టడం ద్వారా, భవిష్యత్ సవాళ్లు, అవకాశాల కోసం తరువాతి తరాన్ని సిద్ధం చేయవచ్చు. అంతిమంగా పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలు మానవులను ఒక సంతోషకరమైన సమసమాజం వైపు నడిపించాలి. అంతేకానీ మరింత అసమానతలు, దోపిడి పెంచకూడదు. చరిత్ర చూసుకున్నట్లైతే ఇప్పుడున్న వ్యవస్థ సాంకేతిక విప్లవ ప్రయోజనాలను సాధారణ ప్రజలకంటే కొంతమంది పరిశ్రమాధిపతులకు, పాలకులకు మాత్రమే ఎక్కువగా బదలాయించింది. తదనుగుణంగా సమాజంలో అసమానతలు, పేదరికం, దు:ఖం తీవ్రమయ్యింది. ఈ కృత్రిమ మేధస్సు అయినా మెజారిటీ ప్రజల ప్రయోజనాల వైపు బదలాయించబడాలంటే ఇప్పుడున్న అసమాన న్యాయంతో కూడిన వ్యవస్థ స్థానంలో మరింత మెరుగైన సామ్యవాద వ్యవస్థ స్థాపన దిశగా ప్రయాణం సాగించాలి.

- ఆంజనేయ రాజు
డివైయఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

'మద్దతు'పై మీనమేషాలు

- జీడి పిక్కల ధరలు పతనం
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- నైరాశ్యంలో జీడి రైతాంగం

ప్రజాశక్తి - కవిటి (శ్రీకాకుళం జిల్లా)

జీడిపిక్కలకు మద్దతు ధరపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.10 వేలు ధర కల్పించి రైతులకు అండగా ఉంటామని చెప్పిన అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీదిరి అప్పలరాజు మాటలు నీటిమూటలయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా మంత్రి ఇచ్చిన హామీ అమలు కాకపోగా, ఐదేళ్ల కిందట రూ.14వేలు పలికిన జీడి పిక్కల బస్తా నేడు రూ.ఏడు వేలకు పడిపోయింది. దీంతో ఎకరాకు సుమారు రూ.30వేలు పెట్టుబడి పెట్టి పంట పండించిన జీడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరోవైపు పరిశ్రమల బంద్ పేరుతో జీడి వ్యాపారులు సరికొత్త డ్రామాకు తెరతీశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోంది.

పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట ఉద్దానం ప్రాంతాలతో పాటు జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడి పంట సాగవుతోంది. ఈ పంటే జీవనాధారంగా సుమారు 80 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తిత్లీ తుపాను జీడి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. తుపానుకు ఎక్కడికక్కడ నేలకొరిగిన చెట్లు తొలగించేందుకు పెట్టుబడులు పెట్టగా, మరోవైపు ఉన్న చెట్ల దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పాడైన చెట్ల స్థానంలో కొత్త జీడి మొక్కలను పెంచుతున్నారు. మూడేళ్లుగా దిగుబడులు తగ్గి తీవ్ర నష్టాలు చవిచూసిన రైతులకు ఈ ఏడాది జీడి పిక్కల దిగుబడి పెరగడంతో అప్పుల ఊబి నుంచి ఎంతోకొంత గట్టెక్కవచ్చని సంతోషించారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆ ఆనందం వారిలో ఆవిరైంది. ఇటీవలి కాలంలో 80 కేజీల జీడి పిక్కల బస్తా రూ.ఎనిమిది వేలు ఉండగా, జీడిపిక్కలు పంట వచ్చేసరికి ఒక్కసారిగా ఆ ధర రూ.7 వేల నుంచి రూ.8 వేలకు పడిపోయింది. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

గిట్టుబాటు ధర రాకపోగా, మరీ అంత తక్కువ ధరకు అమ్ముకోలేక ఇళ్లల్లోనే జీడి పిక్కల బస్తాలను ఉంచారు. కొందరు

రైతులు చేసిన అప్పుల వడ్డీలు కట్టేందుకు, ఇతర కుటుంబ అవసరాలకు తప్పనిసరి పరిస్థితుల్లో బస్తాను రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు తెగనమ్ముకున్నారు. గతేడాది కన్నా ధర పెరుగుతుందని భావిస్తే, అంతకంటే తగ్గడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.తొమ్మిది వేలు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం నుంచి అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు గతంలో హామీనిచ్చారు. ఆ హామీ నేటికీ నెరవేరకపోగా, ఉన్న ధర కూడా పతనమవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

స్థానిక రైతులకు మొండిచేయి

విదేశాల నుంచి వచ్చే లగ్జరీ కార్లు తదితర వాటిపై శత శాతం పన్ను విధించి స్థానిక కార్పొరేట్లకు ప్రోత్సాహం ఇచ్చే కేంద్ర ప్రభుత్వం, జీడి రైతుల విషయానికొచ్చేసరికి ఉదాసీన వైఖరి అవలంభిస్తోంది. విదేశాల నుంచి దిగుమతి అయ్యే జీడిపిక్కలు, జీడిపప్పుపై 2.5 శాతం మాత్రమే పన్ను విధిస్తుండడంతో స్థానిక వ్యాపారులు విదేశీ పిక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. ఉద్దానంలో పండిన జీడిపిక్కలను తూతూమంత్రంగా కొనుగోలు చేసి రైతులకు ఎంతో కొంత చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిత్యం టన్నుల కొద్దీ వాడే జీడిపప్పును విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తూ స్థానిక రైతులకు మొండిచేయి చూపిస్తోంది.

ధర ఎగ్గొట్టేందుకు డ్రామాలు

మరోవైపు వ్యాపారులు సరికొత్త డ్రామాకు తెరతీశారు. జీడిపప్పు విక్రయాల్లేకపోవడంతో ధర పడిపోయిందని, నిల్వలు పేరుకుపోయాయని చెప్తూ జులై ఐదో తేదీ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు పరిశ్రమల బంద్‌కు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాము రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయలేమని చెప్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేకపోవడంతో నిర్వేదంలో కూరుకుపోతున్నాడు జీడి రైతు. ఇప్పటివరకు తమ వద్ద కొన్న జీడిపిక్కల ద్వారా ఉత్పత్తి చేసిన పప్పును పలు గ్రేడ్‌లు చేసి కేజీ రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు అమ్మిన వ్యాపారులు తమకు మాత్రం 80 కేజీల బస్తాకు రూ.ఎనిమిది వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోతున్నారు. వ్యాపారులు జీడిపప్పు రేటు తగ్గిందని చెప్తున్నా, మార్కెట్‌లో కేజీ రూ.600కి తగ్గడం లేదని, నాసిరకం పప్పు రేటును నాణ్యమైన పప్పుకు అన్వయించి వ్యాపారులు ధర తగ్గిందని గగ్గోలు పెడుతున్నారని చెప్తున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఎంతోకొంతకు తెగనమ్ముకున్న తర్వాత జీడిపప్పు ధర అమాంతం పెరుగుతుందన్నది బహిరంగ రహస్యమేనని చెప్తున్నారు.

స్పందించని పార్టీలు

సుమారు 40 రోజులుగా రైతులు, రైతుసంఘాలు జీడిపిక్కల మద్దతు ధర కోసం పోరాడుతుంటే వామపక్షాలు తప్ప మిగతా రాజకీయ పార్టీలు రైతుల గోడును వినిపించుకున్న దాఖలాల్లేవు. అధికార పార్టీ ఇచ్చిన హామీనే అమలు చేయలేదు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఆ ఊసే ఎత్తడం లేదు. ప్రశ్నించేందుకు వచ్చామని చెప్తున్న జనసేన జీడి రైతుల తరుపున ప్రశ్నించిన దాఖలాలే లేవు.

టిడిపిది బోగస్ యాత్ర

- మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి చేపట్టిన బస్సు యాత్ర బోగస్ యాత్రగా సాగుతోందని రాష్ట్ర మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. బుధవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడారు. బస్సు యాత్రకు స్పందన రాకపోవడంతో దిక్కుతోచక టిడిపి కార్యకర్తలే రాళ్లేసే దుస్థితికి దిగజారారని అన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వ లేక దుష్ప్రచారానికి దిగుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో వున్నప్పుడు రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ఎగ్గొట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు అంతకంటే ఎక్కువ ఇస్తానంటే ప్రజలు నమ్ముతారా? అని ప్రశ్నించారు.

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండరు ప్రకటన నెం.408/డిఆర్ఎం/డబ్ల్యు/జిఎన్‌టి తేది.28.06.2023 PUB/0699

క్రింది సంతకందారుడు దిగువ పనుల కొరకు 21.07.2023న 15.30గం.లవరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1. టెండరు ఐడి: 2579 సీనియర్ డిఇఎన్/డిఇఎన్: ఎన్ పని వివరణ: టిఇఎల్-ఆర్ఎల్ సెక్షన్‌లో ఆర్‌యుబి నెం.73ఏ (ఎల్‌సి నెం.275)కు అభివృద్ధిపనులు. **సుమారు విలువ రూ.** 16206534/-, **బిడ్ సెక్యూరిటి రూ.:** 231000/-

క్ర.సం.2. టెండరు ఐడి: 2580 సీనియర్ డిఇఎన్/డిఇఎన్: ఎన్ పని వివరణ: ఎన్‌డబ్ల్యు1: పిజిడిపి-ఎన్‌డికెడి సెక్షన్‌లో ఆర్‌యుబి నం.181ఏ (ఎల్‌సి నెం.65)కు అభివృద్ధిపనులు. ఎస్‌డబ్ల్యు2: ఎస్ఎస్ఇ/డబ్ల్యు/ఎన్ఎల్‌డిఏ సెక్షన్(ఎల్‌సి నెం.లు 3,4,9,10,12, 18,35& 36)లోని ఆర్‌యుబిలకు అభివృద్ధిపనులు. **సుమారు విలువ రూ.** 18252562/-, **బిడ్ సెక్యూరిటి రూ.:** 241300/-

క్ర.సం.3. టెండరు ఐడి: 2581 సీనియర్ డిఇఎన్/డిఇఎన్: ఎన్ పని వివరణ: ఎన్‌డబ్ల్యు1: జిఎన్‌టి-ఎన్‌డికెడి సెక్షన్‌లో ఆర్‌యుబి నం.57ఏ (ఎల్‌సి నెం.56)కు అభివృద్ధిపనులు. ఎస్‌డబ్ల్యు2: జిఎన్‌టి-ఎన్‌డికెడి సెక్షన్‌లో ఆర్‌యుబి నం.31ఏ (ఎల్‌సి నెం.28)కు అభివృద్ధిపనులు. **సుమారు విలువ రూ.** 24609265/-, **బిడ్ సెక్యూరిటి రూ.:** 273100/-

1. ఇ-బిడ్లను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుటకు చివరి తేది: 21.07.2023న 15.30గం.ల వరకు. వివరణాత్మక సమాచారం కొరకు వెబ్‌సైట్: www.ireps.gov.inకు లాగాన్ అవ్వండి.
2. ఏదేని తదుపరి కమ్యూనికేషన్/ సవరణను ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడును.

డివిజినల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంటూరు

ఇ-టెండరు ప్రకటన నెం.18/డిప్యూటి సిఇ-జిఎస్-జిఎన్‌టి, తేది.28.06.2023 PUB/0700

క్రింది సంతకందారుడు దిగువ పనుల కొరకు 13.07.2023న 15.30గం.లవరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1. టెండరు ఐడి: 46 సెక్షన్: డిప్యూటీ సిఇ/జిఎస్/జిఎన్‌టి, **పని వివరణ:** జిఎన్‌టి డివిజన్‌లో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద రైల్వే స్టేషన్స్ (జిఐడి-2, డికెడి-2 & సిబిఎం-2) వద్ద 6 ప్యాసింజర్ లిఫ్టులను ఏర్పాటుచేయుట. **సుమారు విలువ రూ.:** 16040367.43. **ధరావత్తు రూ.:** 230200.00

క్ర.సం.2. టెండరు ఐడి: 47 సెక్షన్: డిప్యూటీ సిఇ/జిఎస్/జిఎన్‌టి, **పని వివరణ:** జిఎన్‌టి డివిజన్‌లో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద గుంటూరు స్టేషన్ (ప్లాట్‌ఫామ్ నెం.4&5) వద్ద 1 నెం. ఎస్కాలేటర్ ఏర్పాటుచేయుట& గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద 30 నెం.ల ప్యాసింజర్ లిఫ్టులను ఏర్పాటుచేయుట. **సుమారు విలువ రూ.:** 15070483.84. **ధరావత్తు రూ.:** 225400.00

1. ఇ-బిడ్లను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుటకు చివరి తేది: 13.07.2023న 15.30గం.ల వరకు. వివరణాత్మక సమాచారం కొరకు వెబ్‌సైట్: www.ireps.gov.inకు లాగాన్ అవ్వండి.
2. ఏదేని తదుపరి కమ్యూనికేషన్/ సవరణను ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజనీరు, గతిశక్తి, గుంటూరు

జివై/డిఎస్ఎల్/06/2023 తేది.27.06.2023 PUB/0701

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీరు/ డీజిల్/ గూటీ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

పని వివరణ: టిబియు/పిబియు టైప్ బ్రేక్ రిగ్గింగ్ నుండి కన్వెన్షనల్ బ్రేక్ రిగ్గింగ్ వరకు డబ్ల్యుఏజి9 లొకోమోటివ్ యొక్క బ్రేక్ రిగ్గింగ్ మార్పిడి. **సుమారు విలువ రూ.:** 41,51,256.36 (రూపాయలు నలభైఒక లక్షల యాభైఒకవేల రెండువందల యాభైఆరు & ముప్పైఆరు పైసలు మాత్రమే) జీఎస్టీతోకలిపి. **ధరావత్తు రూ:** 83,000.00 (రూపాయలు ఎనభైమూడు వేలు మాత్రమే).

ముగింపు తేది : సమయం: 21.07.2023న 12.00గం.లు.
బిడ్ పత్రాలు మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్: https://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి, ఏదేని సవరణ ఉంటే ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడును.

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీరు, డీజిల్ లోకో షెడ్, గూటీ

టెండరు నెం.ఎంఇడి-డిఆర్‌హెచ్/జిటిఎల్-బయో-ఎంఇడి-01-23-24, PUB/0702

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్/ గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.:1, టెండరు నెం: ఎంఇడి-డిఆర్‌హెచ్/జిటిఎల్-బయో-ఎంఇడి-01-23-24. **పని పేరు:** 04 సంవత్సరాలకు రైల్వే హాస్పిటల్, గుంతకల్ వద్ద బయో మెడికల్ వేస్ట్ జనరేటెడ్ యొక్క కలెక్షన్, రవాణా మరియు హైజినిక్ డిస్పోజల్. **పని యొక్క అంచనా విలువ: రూ.** 21,11,900/-, **ధరావత్తు (రూ.):** 44,300/-, **టెండరు ఫారం ధర** :రూ.నిల్, **కాలవ్యవధి:** 4 సంవత్సరాలు.

ముగింపు తేది : సమయం: 24.07.2023న 14.00గం.లు.
బిడ్ పత్రాలు మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్: https://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి, ఏదేని సవరణ ఉంటే ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడును.

చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, గుంతకల్.

A0979

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https:www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

కోర్టు ఆదేశాలను లెక్కచేయరా!

- హైకోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి
- పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనరుకు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనరును హైకోర్టు ప్రశ్నించింది. ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రాంట్ ఇన్ ఎయిడ్ పోస్టుల భర్తీకి అనుమతివ్వాలన్న 2013 నాటి ఉత్తర్వులు అమలు చేయకపోవడం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై జులై 3న జరిగే విచారణకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనరు సురేష్‌కుమార్ స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వులు అమలు కాలేదంటూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్లు దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్లపై విచారణను వాయిదా వేశారు.

ఇవి వినూత్నతలకు ఎంజి మోటార్ మద్దతు

న్యూఢిల్లీ : విద్యుత్ వాహన రంగంలో వినూత్నతను ప్రోత్సహించడానికి ఎంజి మోటార్స్ తీసుకున్న ఎంజి డెవలపర్ ప్రోగ్రామ్, గ్రాంట్ సీజన్ 4.0 ముగిసినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ సీజన్‌లో 250కి పైగా దరఖాస్తులను అందుకున్నట్లు పేర్కొంది. ఇందులో 30 శాతం మహిళ ఔత్సాహికవేత్తల ఉత్పత్తులు ఉన్నట్లు తెలిపింది. ప్రథమంగా నిలిచిన 14 బృందాలను షార్ట్ లిస్ట్ చేశామని ఎంజి మోటార్ ఇండియా డిప్యూటీ ఎండి గౌరవ్ గుప్తా తెలిపారు. ఎంపికైన సంస్థలు, ఆవిష్కర్తలు, ఔత్సాహికవేత్తలకు అగ్రగామి సంస్థల సహకార సమన్వయంతో మద్దతును అందించనున్నామన్నారు.

ఒబెన్ ఎలక్ట్రిక్‌కు రూ.40 కోట్ల నిధులు

బెంగళూరు : దేశీయ ఇవి స్టార్టప్ ఒబెన్ ఎలక్ట్రిక్ రూ.40 కోట్ల నిధులు సమీకరించినట్లు తెలిపింది. దీంతో ప్రీ సిరిస్ ఎ రౌండ్‌లో ఇప్పటి వరకు రూ.72 కోట్ల ఈక్విటీ, రుణాల రూపంలో మూలధనం సమకూర్చుకున్నట్లయ్యిందని పేర్కొంది. సంస్థ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తంగా రూ.88 కోట్లు సమకూర్చుకున్నట్లు వెల్లడించింది. బెంగళూరులోని తమ తయారీని ఏడాదికి లక్ష యూనిట్లకు చేర్చుకోవాలనే లక్ష్యానికి ఈ నిధులు దోహదం చేయనున్నాయని ఒబెన్ ఎలక్ట్రిక్ ఫౌండర్, సిఇఒ మధుమితి అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

నెం.04/2023-24, తేది: 24.06.2023
కార్యపాలక ఇంజనీర్, పి.ఆర్.ఐ.డివిజన్, కందుకూరు పరిధిలో 10 పనులకు అంచనా విలువ: రూ.87.32 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ డాక్యుమెంట్లు లభ్యమగు తేది: 30.06.2023, సా.5గం. నుండి. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in లో చూడగలరు.

DIPRNo.9976/CL/ADVT/1/1/2021-22
సం/- కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ.డివిజన్, కందుకూరు.

బిఇడి కాలేజీల పరిధి మార్పుపై స్టే

ప్రజాశక్తి-అమరావతి

నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన బిఇడి కాలేజీలను ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయ పరిధిలో ప్రభుత్వం తేవడాన్ని హైకోర్టు నిలిపేసింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేస్తూ జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. గత ఏప్రిల్ 20 నాటి ఉత్తర్వులను ప్రైవేట్ బిఇడి కాలేజీల సంఘం ఛైర్మన్ కె గుండారెడ్డి, బిఇడి కాలేజీలు హైకోర్టులో సవాల్ చేశాయి. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలన్న హైకోర్టు విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

సూర్యనారాయణపై తొందపాటు చర్యలొద్దు : హైకోర్టు

వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ ప్రభుత్వానికి రూ.కోట్లు నష్టం కలిగించారని పేర్కొంటూ సిఐడి దాఖలు చేసిన కేసులో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యనారాయణ దాఖలు చేసిన కేసుపై విచారణ పూర్తి చేసి జులై 7 నాటికి తగిన నిర్ణయాన్ని వెల్లడించాలని ఎసిబి కోర్టును ఆదేశించింది. అప్పటి వరకు సూర్యనారాయణపై పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోరాదని హైకోర్టు న్యాయమూర్తు జస్టిస్ కె సురేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ పిటిషన్ విచారణ పరిధి తమకు లేదంటూ మెట్రోపాలిటన్ సెక్షన్స్ కోర్టు పిటిషన్‌ను కొట్టేస్తూ ఆ పిటిషన్‌లోని అంశాలపై విచారణ చేయడాన్ని తప్పుపట్టారు. ఆ కోర్టు ఉత్తర్వులను రద్దు చేశారు. అలాగే పోలీసులు వేధిస్తున్నారంటూ సూర్యనారాయణ కుటుంబ సభ్యులు దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

కేసులు వీగిపోవడంపై రివ్యూకు కమిటీ వేయాలని పిల్

పోలీసులు పెట్టిన క్రిమినల్ కేసులు కోర్టుల్లో వీగిపోవడానికి కారణాలను రివ్యూ చేసేందుకు స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, కేసులు ఓడిపోవడానికి కారకుల్ని గుర్తించాలని సుప్రీంకోర్టు 2014లో ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిని జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ డివి రమణతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. హోంశాఖ ముఖకార్యదర్శి, డిజిపి, ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్లకు నోటీసులిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

హైకోర్టుకు ఐపిఎస్ వెంకటేశ్వరరావు

ఆర్జిత సెలవు కింద విదేశాలు వెళ్లేందుకు అనుమతిచ్చేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ సస్పెన్షన్‌లో ఉన్న ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ విచారించారు. పిటిషనరు వినతిపై ఈ నెల 30 సాయంత్రం 5 గంటల్లోగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వానికి ఆదేశించారు. సిఎస్, డిజిపికి ఉత్తర్వులు జారీ చేశారు. ఇఎల్‌పై 41 రోజులు విదేశాలు వెళ్లేందుకు అనుమతివ్వాలని ఈ నెల 5న పిటిషనర్ దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల నుంచి ఏ స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనరుపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నందున అనుమతివ్వాలో లేదో అధికారుల విచక్షణపై తుది నిర్ణయం ఉంటుందని ప్రభుత్వ ప్లీడర్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐకి ఊరట

పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఎన్ఆర్ఐ కుదరవల్లి శ్రీనివాసరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ట్రస్టు భూముల వ్యవహారంపై దాఖలైన కేసులో ఆయనపై పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోరాదన జస్టిస్ కృపాసాగర్ మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. ముప్పరపు చౌదరి అండ్ లీలా రామకృష్ణ ప్రసాద్ ట్రస్టు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటుంటే తనపై రవికుమార్ తప్పుడు కేసు పెడితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్ఐఆర్‌పై తొందరపాటు చర్యలు వద్దని ఆదేశించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM

e-Procurement Tender Notice dt. 26-06-2023

Tender Notice No. 166 to 172 and 58/MCR/RUDA FUNDS/2023-24,
With total EC Value of Rs. 2,51,05,736/-

Name of Scheme	RUDA Funds	RUDA Funds
No. of Works	7 Works	1 Work
Bid Document download starting date	23-06-2023 at 10.10 P.M	23-06-2023 at 02.00 P.M
Bid Document download end date	30-06-2023 at. 2.00 P.M	03-07-2023 at 2.00 P.M
Last date and time for receipt of Bids	30-06-2023 at 2.30 P.M	03-07-2023 at 2.30 P.M
Commercial Bid Opening Date	30-06-2023 at 3.00 P.M	03-07-2023 at 3.00 P.M

Name & Address of the Concerned Officer Commissioner, Municipal Corporation, Rajamahendravaram.
Further details can be seen @ e-procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- **K.DINESH KUMAR,** IAS.,
COMMISSIONER, Municipal Corporation, Rajamahendravaram

కొటాక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీస్: 27బికెసి, సి-27, జి-బ్లాక్, బాంద్రా కూర్ల కాంప్లెక్స్, బాంద్రా(ఇ), ముంబయి-400051.
బ్రాంచ్ ఆఫీస్: బ్రాంచ్ ఆఫీస్: నెం.24-4-19, కోదండరామిరెడ్డి స్ట్రీట్, రహమాన్ పార్క్ వాటర్ ట్యాంక్ ఎదురుగా, గవర్నర్‌పేట్, విజయవాడ-520002.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)తో చదవగల అనుబంధం 4 ప్రకారం)

... RHB369512 &RHB359625 (CRN 84013117) ...

తేది: 29-06-2023
ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కొటాక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ తరఫున

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గుడివాడ బ్రాంచి (01461): # 10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ-521301.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

... (01461), # 10/52-1, ... 8886737999, ...
UBin0801461@unionbankofindia.bank ...

సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి ...

తేది : 23-06-2023
ప్రదేశం : గుడివాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుడివాడ బ్రాంచి

'అమ్మఒడి'పై జగన్‌వి అబద్ధాలే

- చంద్రబాబు ట్వీట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమ్మఒడి పథకంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. రాష్ట్రంలో అమ్మఒడి పథకానికి 83 లక్షల మంది లబ్ధిదారులుంటే కొంతమందినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారన్నారు. ఎన్నికల ముందు ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికి అమ్మఒడి వేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆంక్షల పేరుతో కుటుంబంలో ఒక్కరికే డబ్బులు వేస్తున్నారని అన్నారు. అందులో కూడా కోత పెడుతున్నారని పేర్కొన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వాడారని, 75 శాతం హాజరు లేదని, ఇంట్లో వారికి ట్యాక్సీ గానీ, కారు గానీ ఉందని కొర్రీలు పెడుతూ అమ్మఒడికి అర్హులను అనర్హులుగా చేశారన్నారు.

ఇంటి పనికి లభించని ప్రతిఫలం

- అధిక పని గంటలతో మహిళ సతమతం

చెన్నయ్ : పని గంటలపై తమిళనాడులో చర్చోపచర్చలు సాగుతున్నాయి. గతంలో రోజుకు 9 పని గంటలు మాత్రమే ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని 12కు పెంచింది. అయితే భాగస్వామ్య పక్షాలు, కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అయినప్పటికీ దీనిపై రాష్ట్రంలో వాడివేడిగా చర్చలు కొనసాగుతున్నాయి. పని గంటలు పెంచితే ఉత్పత్తి పెరుగుతుందని పారిశ్రామికవేత్తలు వాదిస్తుంటే 8 గంటలకు మించి పని చేస్తే కార్మికులు అలసిపోతారని, వారి సమర్ధతపై ప్రభావం పడుతుందని కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పని గంటలను పెంచితే ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కుకు విఘాతం కలుగుతుందని కార్మికులు వాదిస్తున్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తోంది. అటు పని ప్రదేశాలలోనూ, ఇటు ఇంటి వద్ద పని చేస్తూ వారు అధిక శారీరక శ్రమకు గురవుతున్నారు. ఇంటి వద్ద చేసే పనికి ఎలాగూ వేతనం అంటూ ఉండదు. అంటే ఏమిటి? కర్మాగారాలలో పని చేస్తే వచ్చే జీతంతోనే వారు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పని గంటలు మాత్రం అధికం. ఒక్క మాటలో చెప్పాలంటే వారు రెండు షిఫ్టులలో పని చేస్తున్నారన్న మాట. ఉదాహరణకు తమిళనాడు గ్రామీణ ప్రాంతాలలో 92.9% మంది, పట్టణ ప్రాంతాలలో 90.4% మంది మహిళలు చేసే పనికి ఎలాంటి ప్రతిఫలం లభించడం లేదు. ఎనిమిది గంటలకు వేతనం తీసుకుంటూ రోజుకు 12-13 గంటలు పని చేస్తున్నారన్న మాట. వీరికి కార్మిక చట్టాలేవీ వర్తించవు. ఎక్కువ గంటలు పని చేయడాన్ని శ్రమ దోపిడీగా పరిగణించడం లేదు. అది ఓ భార్య లేదా తల్లి బాధ్యత అని వితండవాదం చేస్తున్నారు. వేతనంతో కూడిన పనిలోనూ పురుషులు, మహిళల మధ్య తేడా కన్పిస్తోందని పలు నివేదికలు చెబుతున్నాయి. తమిళనాడు ప్రభుత్వం ఇటీవలే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. నెలవారీ మహిళా విద్యా నిధిని ప్రవేశపెట్టింది. మధ్యాహ్న భోజన పథకంలో అల్పాహారాన్ని చేర్చింది. పని గంటల బిల్లు విషయంలో వెనక్కి తగ్గినప్పటికీ మహిళల శారీరక శ్రమను మాత్రం అర్థం చేసుకోవడం లేదు. ఇక దేశంలో పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఓ నివేదిక ప్రకారం 15-29 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో 85% మంది ఎలాంటి ప్రతిఫలం లేకుండానే ఇంటి పనులు చేస్తున్నారు. వీరి శ్రమకు గుర్తింపు లభించడం లేదు. ఎన్ఎస్ఎస్ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో 76.7% మంది, పట్టణ ప్రాంతాలలో 81.1% మంది మహిళలు చేసే పనిని ఉత్పాదకత లేని పనిగా పరిగణిస్తున్నారు. అంటే ఇంటి పనిని లెక్కలోకి తీసుకోవడం లేదు. మహిళలు తాము కర్మాగారాలు, ఇతర పని ప్రదేశాలలో చేసే పని కంటే ఇంటి వద్ద నాలుగైదు గంటలు ఎక్కువ సమయమే పని చేస్తున్నారు. అదే పురుషులైతే కేవలం గంటన్నర మాత్రమే ఇంటి పనికి కేటాయిస్తున్నారు. మహిళలు ఆర్థికంగా పురుషుల పైన ఆధారపడాల్సి రావడంతో వారు వృత్తివిద్యకు, నైపుణ్యాభివృద్ధికి దూరమవుతున్నారు. గృహహింసకు సైతం గురవుతున్నారు.

15 నుంచి అమెజాన్ ప్రైమ్ డే సేల్

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ జులై 15, 16 తేదిల్లో అమెజాన్ ప్రైమ్ డే సేల్‌ను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఆ రెండు రోజుల్లో ఎంపిక చేసిన ఉత్పత్తులను అదే రోజు డెలివరీ చేయనున్నట్లు తెలిపింది. 45,000 పైగా కొత్త ఉత్పత్తులు, 400 టాప్ ఇండియన్, గ్లోబల్ బ్రాండ్ల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. చిన్న, మధ్య తరహా వ్యాపారులు కొత్తగా తమ 2వేల పైగా ఉత్పత్తులను అమ్మకానికి పెట్టనున్నారని తెలిపింది.

AXIS BANK LIMITED
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోనెం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520002

రూల్ 8(1) క్రింద (స్థిరాస్తుల కొరకు) లాంఛనప్రాయ స్వాధీనతా నోటీసు

ఏదైతే, క్రింది సంతకందారుడు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా ...) ... దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం ... యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ... రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన ... చెల్లించమని దిగువ రుణగ్రహీతలను కోరుతూ సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ...

క్ర. సం	రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు, హామీదారుల పేరు / చిరునామా	బాకీ రూ.లలో	తనఖా పెట్టబడిన స్థిరాస్తుల వివరాలు
1	... డిమాండ్ నోటీసు తేది: 19.04.2023 ... ఎన్‌పిఎ తేది: ... PHR006901744352	Rs.19,27,208/- ...	గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, ... స్వాధీన తేది: 23.06.2023

తేది: 23.06.2023
ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు

ఐక్య ఉద్యమాలతోనే ఉక్కు పరిరక్షణ

ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

ఐక్య ఉద్యమాలతోనే విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ సాధ్యమని ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 867వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ.. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ఐక్య ఉద్యమాల ద్వారా కాపాడుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని పరిశ్రమలను ప్రయివేటీకరించి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దీక్షల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.దేముడు, డి.రమేష్, కర్రి వేణుమాధవ్, జి.నరేంద్ర, రాజేశ్వరరావు, వర్మరాజు పాల్గొన్నారు.

'అనంత' తమ్ముళ్లకు అధిష్టానం పిలుపు

- వివాదాలపై సీరియస్ • రచ్చపై అమరావతిలో పంచాయితీ
- 'భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సుయాత్ర' నిర్వహణపైనా అసహనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భమిష్యత్తుకు భరోసా బస్సు యాత్ర కాస్త టిడిపి నాయకుల మధ్య విబేధాల యాత్రగా కొనసాగుతోంది. వరుసగా జిల్లాలో కొనసాగుతున్న వివాదాలపై టిడిపి అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గొడవులు జరుగుతున్న నియోజకవర్గాల్లోని నేతలను త్వరలో అమరావతికి పిలిపించనున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 23వ తేదీన భవిష్యత్తుకు బస్సుయాత్ర ప్రారంభమైంది. ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని నియోజకవర్గాల్లో పార్టీలోని అంతర్గత విబేధాలు రచ్చకెక్కుతున్నాయి. ఎన్నికలు సమీస్తున్న తరుణంలో జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో విబేధాలు అధికంగానున్నాయి. పెనుకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో బస్సుయాత్ర పూర్తయ్యింది. ఈరెండు చోట్ల కూడా నాయకులు బాహాటంగానే ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడులు రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. జిల్లా నేతల ముందే ఇవి జరుగుతున్నా వాటిని పుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం గాని, నిలువరించే చర్యలుగాని చేపట్టలేక పోయారు. దీనిపైనా అధిష్టానం సీరియస్ అయినట్టు సమాచారం. జిల్లా ముఖ్య నేతలకు ఫోన్ చేసి అధినాయకుడు క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక మడకశిర నియోజకవర్గంలో బస్సుయాత్రనే రద్దు చేశారు. ఇక శింగనమల నియోజకవర్గంలో ఇంకా యాత్ర జరగాల్సి ఉంది. ఇక్కడ ఏమి జరుగుతుందోనని చర్చ ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. అంతకుమునుపు లోకేశ్ పాదయాత్ర సమయంలోనే నాయకుల మధ్య విబేధాలు పొడచూపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ యాత్రలో ఏమి జరుగుతుందోనన్న గుబులు ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇలా విబేధాలు రచ్చకెక్కుతుండటంతో అధిష్టానం దృష్టి సారించింది. ఈ నియోజకవర్గాల్లోని నాయకులతోపాటు, ముఖ్య నాయకులతో వచ్చే వారంలో ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటు చేసింది. విభేదాలతో రచ్చకెక్కుతున్న నేతలకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అధినాయకుడు చంద్రబాబునాయుడు క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. పార్టీ ప్రతిపక్షంలో ఉండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నేతల తీరులో మార్పు రాకపోవడంపై ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఇదివరకే అనేక మార్లు నేతలకు సర్ధిజెప్పే ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో ఈసారి జరిగే సమావేశంలో ఎటువంటి నిర్ణయాలు చేస్తారన్నది పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నియోజకవర్గాల్లో ఈ రకమైన పరిస్థితి ఉంటే జిల్లా నేతలు ఏమి చేస్తున్నారన్న దానిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం నుంచి ముఖ్య నేతలకు అక్షింతలు పడినట్టు సమాచారం. ఎన్నికలు కొన్ని నెలల్లో ఉన్న సమయంలో ఇప్పటికైనా అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాల్సిన సమయంలో ఇదేతీరున కొనసాగడం పార్టీ క్షేత్ర స్థాయి నేతల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించి వీటిని పుల్‌స్టాప్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో నష్టం జరుగుతుందని భావిస్తున్నారు.

అన్నమాచార్యలో మొదటి గ్రాడ్యుయేషన్ డే

హాజరైన జెఎన్‌టియు విసి రంగ జనార్ధన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో మొదటి గ్రాడ్యుయేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ అనంతపురం ఉపకులపతి రంగ జనార్ధన ముఖ్య అతిథిగా హాజరై గ్రాడ్యుయేషన్ డే సందేశాన్ని పట్టభద్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాదముని రెడ్డి మాట్లాడుతూ.. 2022-23 విద్యా సంవత్సరంలో 529 మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో పట్టభద్రులయ్యా రన్నారు. ఇందులో 375 మంది డిస్టెక్షన్‌లో పాస్ అయ్యారన్నారు. కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 350 మంది విద్యార్థులు బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలు పొంది వారి జీవితంలో నూతన శకాన్ని ప్రారంభించారన్నారు. కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ గంగిరెడ్డి, యూనివర్సిటీ నామిని బి. ఈశ్వర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, గవర్నమెంట్ బాడీ సభ్యులు సి. ఎల్లారెడ్డి, కళాశాల వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

సవరణ

ఈడల్వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
CIN: U67100MH2007PLC174759
రీటైల్ సెంట్రల్ మరియు నమోదిత కార్యాలయం : ఈడల్వీజ్ హౌస్, ఆఫ్ సిఎస్‌టి రోడ్డు, కలిన, ముంబై-400098.

22.06.2023న వార్తా పత్రికలో ప్రచురించబడిన **ఈడల్వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్** యొక్క స్వాధీనతా నోటీసుకు సూచన.

ఎస్ఎల్ నం.2,3,4 మరియు 5 కొరకు స్వాధీనతా తేదిని 18.06.2023 కి బదులుగా 17.06.2023 గా చదవాలి.

క్ర.సం. 2 నుండి 5 వరకు మాత్రమే.

ప్రచురణ యొక్క అన్నీ ఇతర వివరాలు మారవు.

తేది : 27.06.2023
ప్రదేశం : ముంబై
సం/- ఆధీకృత అధికారి
ఈడల్వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్. తరఫున

Edelweiss Asset Reconstruction

స్వాధీన నోటీసు
(స్థిరాస్తి కోసం)

పేర్కొనడంఏమనగా,

దిగువ సంతకం చేసిన వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఇన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 కింద **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (CIN:L65922DL2005PLC136029)** యొక్క అధికృత అధికారి మరియు సెక్యూరిటీస్ ఇంట్రెస్ట్ (ఇన్ఫోర్స్‌మెంట్) నిబంధన, 2002 యొక్క నిబంధన 3 లోని సెక్షన్ 13 (12) కింద హక్కులను వినియోగించుకుంటూ, లోన్ అకౌంట్ నం **HHLVJW00377982** లో తేదీ **21.03.2023** నాటికి నోటీసులో పేర్కొన్న **రూ. 47,79,738.92 (నలభై ఏడు లక్షల డెబ్బై తొమ్మిది వేల ఏడు వందల ముప్పై ఎనిమిది రూపాయల తొంభై రెండు పైసలు మాత్రమే)** అసలు మొత్తాన్ని దానిపై అయ్యే వడ్డీతో సహా, ఈ నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోపున తిరిగి చెల్లించవలసిందిగా ఋణం తీసుకున్న వారైన **చందలూరు దేవి లలిత రాణి, యజమాని, డీలక్స్ సైంటిఫిక్ అండ్ కెమికల్ కంపెనీ, చందలూరు చైతన్య కృష్ణ, యజమాని, చైతన్య సైంటిఫిక్ ఎక్విప్‌మెంట్స్ మరియు చందలూరు నవీన్ కృష్ణ**లను కోరుతూ తేదీ **29.03.2023** నాడు డిమాండ్ నోటీసు జారీ చేయడం జరిగింది.

ఋణం తీసుకున్న వారు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, పేర్కొన్న చట్టం సెక్షన్ 13(4) లోని పేర్కొన్న నిబంధన 8 ప్రకారం తేదీ **23.06.2023** నాడు అతనికి గల హక్కును వినియోగించుకుంటూ దిగువ సంతకం చేసిన వారు దిగువ **ఆస్తిని స్వాధీనం** చేసుకున్నారని ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానికానికి నోటీసు జారీ చేస్తున్నారు.

ప్రత్యేకించి ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానీకానికి ఈ ఆస్తి విషయంలో వ్యవహారాలు కొనసాగించవద్దని హెచ్చరించడమైనది మరియు దీని విషయంలో ఏవైనా లావాదేవీలు జరిపితే తేదీ **21.03.2023** నాటికి **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**కి **రూ. 47,79,738.92 (నలభై ఏడు లక్షల డెబ్బై తొమ్మిది వేల ఏడు వందల ముప్పై ఎనిమిది రూపాయల తొంభై రెండు పైసలు మాత్రమే)** మొత్తాన్ని మరియు దీనిపై అయ్యే వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులని రిడీమ్ చేసుకునేందుకు లభించే సమయానికి చట్టంలోని సెక్షన్ 13 కోని ఉప-సెక్షన్ (8) నిబంధనలపై దృష్టి పెట్టవలసిందిగా రుణ గ్రహీతను ఆహ్వానించడం జరుగుతోంది.

స్థిరాస్తి వివరాలు

డోర్ నం. 24-17-3, దుర్గాపురం, విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, విజయవాడ- 520003, ఆంధ్రప్రదేశ్ చిరునామాలోని మున్సిపల్ వార్డు నం. 19, పాత రెవెన్యూ వార్డు నం. 14, పాత బ్లాక్ నం. 3, పాత ఎన్.టి.ఎస్ నం. 1489, సబ్ సెక్వెంట్ ఆర్.ఎస్ నం.: 121/2బి, రెవిన్యూ వార్డు నం. 14, బ్లాక్ నం. 37, ఎన్.టి.ఎస్ నం. 52, పాత ఎసెస్‌మెంట్ నం. 15354, కొత్త ఎసెస్‌మెంట్ నం. 113089లో 255.41 చ.గజాలు లేదా 213.55 చ.మీ నివాస స్థలం మరియు దానిలో ఉన్న నిర్మాణాలు, వాటికి సంబంధించిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు ఫిక్చర్‌లు మరియు దీనికి హద్దులు ఇలా ఉన్నాయి:-

1వ ప్రతి: 206.25 చ.గజాలు లేదా 172.4 చ.మీటర్ల విస్తీర్ణం గల నివాస స్థలం మరియు దానిలో ఉన్న నిర్మాణాలు.
తూర్పు : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న బేతంపూడి కోటేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన ప్రాపర్టీలు.
పశ్చిమం : కొంత విస్తీర్ణం మేరకు కందుకూరి చంద్రశేఖర్‌కి మరియు కొంత మేరకు 2వ ప్రతికి చెందిన ప్రాపర్టీ.
ఉత్తరం : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న శనగశెట్టి సూర్యనారాయణ మరియు ఇతరుల ప్రాపర్టీ.
దక్షిణం : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న సామా సుబ్బారావు ప్రాపర్టీ.

2వ ప్రతి: 24.66 చ.గజాలు లేదా 20.61 చ.మీటర్ల విస్తీర్ణం గల ఉమ్మడి పాసేజ్ సైట్, దీనికి హద్దులు ఇలా ఉన్నాయి.
తూర్పు : 1వ ప్రతి ప్రాపర్టీ
పశ్చిమం : 3వ ప్రతి ప్రాపర్టీ
ఉత్తరం : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న శనగశెట్టి సూర్యనారాయణ మరియు ఇతరుల ప్రాపర్టీ.
దక్షిణం : కందుకూరి చంద్రశేఖర్, యజమాని

3వ ప్రతి: మొత్తం 49.0 చదరపు గజాల ఉమ్మడి పాసేజ్ సైట్‌లో 24.5 చ.గజాలు లేదా 20.48 చ.మీటర్ల విస్తీర్ణంగా ఒక మరియు '/2 వాటా, దీనికి హద్దులు ఇలా ఉన్నాయి:
తూర్పు : 2వ ప్రతి ప్రాపర్టీ
పశ్చిమం : మున్సిపల్ రోడ్డు
ఉత్తరం : జొన్నవిత్తుల వెంకట్రావుకు చెందిన కాంపౌండ్ గోడ
దక్షిణం : గోపిశెట్టి వెంకట సుబ్బమ్మ, యజమాని, కొంత విస్తీర్ణం మేరకు. క్షత్రియ కృష్ణ బాబు యజమాని, కొంత విస్తీర్ణం మేరకు

మొత్తం విస్తీర్ణం 255.41 చదరపు గజాలు లేదా 213.55 చదరపు మీటర్ల స్థలం (1వ + 2వ + 3వ ప్రతి)

తేదీ : 23.06.2023
స్థలం : విజయవాడ
అధికృత అధికారి
ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

సంగీత కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయగనంలోని మహరాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కెవిఎల్‌ఎన్ శాస్త్రి తెలిపారు. భారతీయ సంస్కృతి, కళల పట్ల అవగాహన కలిగించి ఆకర్షితులను చేసే ఉద్దేశంతో సంగీత కళాశాలలో 4 సంవత్సరాల సర్టిఫికేట్ కోర్సు, 2 సంవత్సరాల డిప్లొమా కోర్సులను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు మాత్రమే డిప్లొమా కోర్సుకు అర్హులని వెల్లడించారు. గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మదంగం, డోలు, భరతనాట్యం అంశాల్లో కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రవేశానికి దరఖాస్తు చేయదలచిన అభ్యర్థుల వయస్సు జూలై 1, 2023 నాటికి 10 సంవత్సరాలు నిండి ఉండాలని, 60 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. డిప్లొమా కోర్సులో ప్రవేశానికి సంబంధిత సర్టిఫికేట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సులో చేరే విద్యార్థులు ఏడాదికి రూ.1500, డిప్లొమా కోర్సు విద్యార్థులు ఏడాదికి రూ.2000 ఫీజు చెల్లించాల్సి వుంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులంతా రూ.50 చెల్లించి కళాశాలలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. సాధారణ రుసుముతో జూలై 1 నుంచి 31 వరకు ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం కళాశాల ఫోన్ నెంబరు 08922 - 223751 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

ఆదాయం రూ.32,985 కోట్లు

- వ్యయం రూ.58,281 కోట్లు
- 2 నెలల లెక్కలు వెలుగులోకి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తొలి రెండు నెలలకు (ఏప్రిల్, మే) సంబంధించిన గణాంకాలను రిజర్వ్‌బ్యాంకు విడుదల చేసింది. ఆదాయం కన్నా వ్యయం పాతిక వేల కోట్ల కన్నా ఎక్కువగా ఉంది. ఇదే మొత్తం లోటుగా గుర్తించారు. అలాగే ఈ మొత్తం రుణంగా తీసుకున్నట్లు లెక్కల్లో తేలింది. ఈ గణాంకాలతో రెండు నెలల్లోనే ఆర్థిక అంచనాలు తారుమారయ్యాయి. రెండు నెలల్లో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం కింద రూ.17,910 కోట్లు రాగా, కేంద్రం నుంచి వచ్చిన రూ.14,137 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.937 కోట్లు కలిపి మొత్తం రూ.32,985 కోట్లు ఖజానాకు చేరింది. అదే సమయంలో రూ.25,293 కోట్లు రుణంగా సేకరించడంతో మొత్తం ఖజానాకు వచ్చిన ఆదాయం రూ.52,281 కోట్లుగా గణించారు. ఇందులో ఏకంగా రూ.48,889 కోట్లను ఒక్క రెవెన్యూ వ్యయానికే ఖర్చు చేయగా, పెట్టుబడి వ్యయం కింద రూ.9,235 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం ఆదాయ, వ్యయాలను పరిశీలిస్తే రెవెన్యూ లోటుగా రూ.15,904 కోట్లు, ద్రవ్య లోటుగా రూ.25,293 కోట్లు నమోదయ్యాయి.

ఏఐకెఎస్ ఆందోళన విజయవంతం

తమిళనాడు మామిడి రైతులకు ఊరట

చెన్నయ్ : తమిళనాడులో మామిడి రైతుల కోసం అఖిలభారత కిసాన్ సభ (ఏఐకెఎస్) చేపట్టిన ఆందోళన విజయవంతం అయింది. దిండిగల్ జిల్లాలో ఇరు పక్షాలకూ ఆమోదయోగ్యమైన ధర చెల్లించి రోజుకు 400 టన్నుల మామిడి కాయలను కొనుగోలు చేసేందుకు అధికారులు అంగీకరించారు. మామిడి సీజన్ ముగుస్తుండడంతో టన్ను మామిడి కాయల ధర రూ.7000 నుండి రూ.14,000 మాత్రమే పలుకుతోంది. గత సంవత్సరం ఇదే కాలంలో టన్ను మామిడి కాయలకు రూ.30,000 నుండి రూ.70,000 వరకూ ధర లభించింది. ధరలను తగ్గించేందుకు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో ప్రస్తుతం టన్నుకు రూ.6,500 మాత్రమే లభిస్తోంది. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని 15,800 హెక్టార్లలో మామిడిని పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కనీసం నాలుగు ప్రాంతాలలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర చెల్లించాలని ఏఐకేఎస్, రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు తమ డిమాండ్ల సాధన కోసం ఏఐకేఎస్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో సీజన్ ముగిసే వరకూ రోజుకు 400 టన్నుల మామిడి కాయలు కొనుగోలు చేసేందుకు జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీ అంగీకరించిందని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి రామ స్వామి తెలిపారు. రైతులకు న్యాయమైన ధర లభించాలంటే ప్రభుత్వమే వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మామిడి కాయలు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ధృవ్ షోరే సెంచరీ

నార్త్‌జోన్ 306/6
ఈస్ట్ జోన్‌తో దులీప్ ట్రోఫీ

బెంగళూరు: నార్త్ ఈస్ట్‌జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్ జట్టు భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 306పరుగులు చేసింది. ధృవ్ షోరే(135) సెంచరీకి తోడు నిషాంత్ సింధూ(76నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. ఓపెనర్ ధృవ్ షోరే సెంచరీతో మెరిసినా.. అంకిత్ కల్సి(0), అంకిత్ కుమార్(9), కెప్టెన్ జయంత్ యాదవ్(0) నిరాశపరిచారు. ప్రభుసిమ్రన్ సింగ్(31), ప్రశాంత్ చోప్రా(32) ఫర్వాలేదనిపించారు. జోటిన్, కిషన్ సింఘూకు రెండేసి వికెట్లు దక్కాయి.

సెంట్రల్ జోన్ 182ఆలౌట్

మరో మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్ బౌలర్ల దెబ్బకు సెంట్రల్ జోన్ జట్టు 182పరుగులకే కుప్పకూలింది. హిమాన్షు (29), రింకు సింగ్(38) బ్యాటింగ్‌లో రాణించారు. మురాసింగ్(5/42), ఆవేశ్ ఖాన్(2/13) బౌలింగ్‌లో మెరిసారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్ల నష్టానికి 32పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(0), శంతను మిశ్ర(6) నిరాశపరిచారు. సుదీప్ కుమార్(19), షాబాజ్ నదీమ్(6) క్రీజ్‌లో ఉన్నారు. ఆవేశ్‌ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

అల్కరాజ్, స్వైటెక్‌లకు టాప్ సీడింగ్స్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ


అల్కరాజ్

స్వైటెక్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ మరోసారి సత్తాచాటాడు. తాజా ఏటిపి ర్యాంకింగ్స్‌తోపాటు వచ్చే నెలలో ప్రారంభం కానున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడింగ్ లభించింది. మహిళల సింగిల్స్‌లో ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ విజేత ఇగా స్వైటెక్‌కు అగ్రస్థానం దక్కింది. దీంతో కార్లోస్ అల్కరాజ్, ఇగా స్వైటెక్ టాప్ ర్యాంక్‌తో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ బరిలి దిగనున్నారు. ఇక నాలుగుసార్లు ఛాంపియన్, 2023 ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ నెగ్గిన సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ రెండోర్యాంక్‌కే పరిమితమయ్యాడు. నొవాక్ జకోవిచ్ ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకొని 23వ గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. ఇక మహిళల సింగిల్స్‌లో అర్యానా సబలెంక(బెలారస్)కు 2వ, ఎలేనా రైబకినాకు 3వ సీడింగ్స్ దక్కాయి. అలాగే పురుషుల సింగిల్స్‌లో మెద్వదెవ్(రష్యా) 3వ, కాస్పర్ రూఢ్ 4వ, సిట్సిపాస్ 5వ సీడింగ్‌లో ఈ ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ బరిలో దిగనున్నారు. ఇంగ్లండ్‌కు చెందిన మాజీ ఛాంపియన్ ఆండీ ముర్రే 39వ ర్యాంక్ దక్కినా.. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగనున్నాడు.

స్వాధీన నోటీసు
(స్థిరాస్తి కోసం)

పేర్కొనడంఏమనగా,

దిగువ సంతకం చేసిన వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఇన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 కింద **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (CIN:L65922DL2005PLC136029)** యొక్క అధికృత అధికారి మరియు సెక్యూరిటీస్ ఇంట్రెస్ట్ (ఇన్ఫోర్స్‌మెంట్) నిబంధన, 2002 యొక్క నిబంధన 3 లోని సెక్షన్ 13 (12) కింద హక్కులను వినియోగించుకుంటూ, లోన్ అకౌంట్ నం **HHLVJW00427919** లో తేదీ **21.03.2023** నాటికి నోటీసులో పేర్కొన్న **రూ. 15,97,957.85 (పదిహేను లక్షల తొంభై ఏడు వేల రూపాయల తొమ్మిది వందల యాభై ఏడు రూపాయల ఎనభై అయిదు పైసలు మాత్రమే)** అసలు మొత్తాన్ని దానిపై అయ్యే వడ్డీతో సహా, ఈ నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోపున తిరిగి చెల్లించవలసిందిగా ఋణం తీసుకున్న వారైన **చందలూరు దేవి లలిత రాణి, యజమాని, డీలక్స్ సైంటిఫిక్ అండ్ కెమికల్ కంపెనీ, చందలూరు చైతన్య కృష్ణ, యజమాని, చైతన్య సైంటిఫిక్ ఎక్విప్‌మెంట్స్ మరియు చందలూరు నవీన్ కృష్ణ**లను కోరుతూ తేదీ **29.03.2023** నాడు డిమాండ్ నోటీసు జారీ చేయడం జరిగింది.

ఋణం తీసుకున్న వారు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, పేర్కొన్న చట్టం సెక్షన్ 13(4) లోని పేర్కొన్న నిబంధన 8 ప్రకారం తేదీ **23.06.2023** నాడు అతనికి గల హక్కును వినియోగించుకుంటూ దిగువ సంతకం చేసిన వారు దిగువ **ఆస్తిని స్వాధీనం** చేసుకున్నారని ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానికానికి నోటీసు జారీ చేస్తున్నారు.

ప్రత్యేకించి ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానీకానికి ఈ ఆస్తి విషయంలో వ్యవహారాలు కొనసాగించవద్దని హెచ్చరించడమైనది మరియు దీని విషయంలో ఏవైనా లావాదేవీలు జరిపితే తేదీ **21.03.2023** నాటికి **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**కి రూ. **15,97,957.85 (పదిహేను లక్షల తొంభై ఏడు వేల రూపాయల తొమ్మిది వందల యాభై ఏడు రూపాయల ఎనభై అయిదు పైసలు మాత్రమే)** మొత్తాన్ని మరియు దీనిపై అయ్యే వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులని రిడీమ్ చేసుకునేందుకు లభించే సమయానికి చట్టంలోని సెక్షన్ 13 కోని ఉప-సెక్షన్ (8) నిబంధనలపై దృష్టి పెట్టవలసిందిగా రుణ గ్రహీతను ఆహ్వానించడం జరుగుతోంది.

స్థిరాస్తి వివరాలు

డోర్ నం. 24-17-3, దుర్గాపురం, విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, విజయవాడ- 520003, ఆంధ్రప్రదేశ్ చిరునామాలోని మున్సిపల్ వార్డు నం. 19, పాత రెవెన్యూ వార్డు నం. 14, పాత బ్లాక్ నం. 3, పాత ఎన్.టి.ఎస్ నం. 1489, సబ్ సెక్వెంట్ ఆర్.ఎస్ నం.: 121/2బి, రెవిన్యూ వార్డు నం. 14, బ్లాక్ నం. 37, ఎన్.టి.ఎస్ నం. 52, పాత ఎసెస్‌మెంట్ నం. 15354, కొత్త ఎసెస్‌మెంట్ నం. 113089లో 255.41 చ.గజాలు లేదా 213.55 చ.మీ నివాస స్థలం మరియు దానిలో ఉన్న నిర్మాణాలు, వాటికి సంబంధించిన ఈజ్‌మెంట్ హక్కులు మరియు ఫిక్చర్‌లు మరియు దీనికి హద్దులు ఇలా ఉన్నాయి:-

1వ ప్రతి: 206.25 చ.గజాలు లేదా 172.4 చ.మీటర్ల విస్తీర్ణం గల నివాస స్థలం మరియు దానిలో ఉన్న నిర్మాణాలు.
తూర్పు : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న బేతంపూడి కోటేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన ప్రాపర్టీలు.
పశ్చిమం : కొంత విస్తీర్ణం మేరకు కందుకూరి చంద్రశేఖర్‌కి మరియు కొంత మేరకు 2వ ప్రతికి చెందిన ప్రాపర్టీ.
ఉత్తరం : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న శనగశెట్టి సూర్యనారాయణ మరియు ఇతరుల ప్రాపర్టీ.
దక్షిణం : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న సామా సుబ్బారావు ప్రాపర్టీ.

2వ ప్రతి: 24.66 చ.గజాలు లేదా 20.61 చ.మీటర్ల విస్తీర్ణం గల ఉమ్మడి పాసేజ్ సైట్, దీనికి హద్దులు ఇలా ఉన్నాయి.
తూర్పు : 1వ ప్రతి ప్రాపర్టీ
పశ్చిమం : 3వ ప్రతి ప్రాపర్టీ
ఉత్తరం : ఈ ప్రాపర్టీ కాంపౌండ్ గోడ గుండా వెళుతున్న శనగశెట్టి సూర్యనారాయణ మరియు ఇతరుల ప్రాపర్టీ.
దక్షిణం : కందుకూరి చంద్రశేఖర్, యజమాని

3వ ప్రతి: మొత్తం 49.0 చదరపు గజాల ఉమ్మడి పాసేజ్ సైట్‌లో 24.5 చ.గజాలు లేదా 20.48 చ.మీటర్ల విస్తీర్ణంగా ఒక మరియు '/2 వాటా, దీనికి హద్దులు ఇలా ఉన్నాయి:
తూర్పు : 2వ ప్రతి ప్రాపర్టీ
పశ్చిమం : మున్సిపల్ రోడ్డు
ఉత్తరం : జొన్నవిత్తుల వెంకట్రావుకు చెందిన కాంపౌండ్ గోడ
దక్షిణం : గోపిశెట్టి వెంకట సుబ్బమ్మ, యజమాని, కొంత విస్తీర్ణం మేరకు. క్షత్రియ కృష్ణ బాబు యజమాని, కొంత విస్తీర్ణం మేరకు

మొత్తం విస్తీర్ణం 255.41 చదరపు గజాలు లేదా 213.55 చదరపు మీటర్ల స్థలం (1వ + 2వ + 3వ ప్రతి)

తేదీ : 23.06.2023
స్థలం : విజయవాడ
అధికృత అధికారి
ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

MOTILAL OSWAL HOME LOANS

మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టార్ ఆఫీసు: మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. టెలి: (022) 47189999, వెబ్‌సైట్: **WWW.motilaloswalhf.com**, ఇ మెయిల్: **hfquery@motilaloswal.com**

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు)

ఏదైతే అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క దిగువ సంతకందారుడైన అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఇన్ కంప్లియన్స్ ఆఫ్ రూల్ 8(1) ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు/ల స్వీకరణ యొక్క నోటీసు(ల)/ తేది నుండి 60 రోజులలోగా ప్రతి ఖాతా ఎదురుగా పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించమని సంబంధిత రుణగ్రహీత/లు పిలుస్తూ ప్రతి ఖాతా ఎదురుగా పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు/లు జారీ చేయబడినాయి. రుణగ్రహీత/లు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందినారు, సెక్యూరిటీ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి క్రింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారుడు స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తి/లతో ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదని, సదరు ఆస్తి/లతో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి మాత్రమే జరుగవలెనని ప్రత్యేకించి రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలకు గమనించాల్సిందేమనగా ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు ఉన్నంత సమయంలో చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలకు అహ్వానించడమైనది.

క్ర. సం	లోన్ గ్రిమెంట్ నెం./రుణగ్రహీత పేరు/సహ రుణగ్రహీత/హామీదారుడు	డిమాండ్ నోటీసు తేది & మొత్తం	స్వాధీనం చేసుకున్న తేది	తనఖాపెట్టిన ఆస్తు/ల వివరణ
1	LXVIJ00117-180056671 రామాంజనేయులు సుబ్బారావు దాసరి మరియు సుబ్బారావు కోటేశ్వరరావు దాసరి	07-12-2020 for Rs. 2092675/-	23-06-2023	డో.నం.5/44, ఆర్.ఎస్.నం.240, మూల్యాంకనం నం.635, పెద్దపులిపాక, గ్రామ పంచాయతీ పెనమలూరు, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521134.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 29.06.2023
*అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.
సం/-
అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)

పబ్లిక్ నోటీసు

ICICI Bank

రిజిష్టర్డ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ల్యాండ్ మార్క్, రేస్ కోర్స్ సర్కిల్ వడోదర-390007
కార్పోరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈ), ముంబై-400051
శాఖా కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ గ్రీన్ స్క్వేర్ ప్లాజా, పబ్లిక్ గార్డెన్ ఎదురు, హనంకొండ, తెలంగాణ-506001

దిగువ రుణగ్రహీత/లు బ్యాంక్ నుండి వారి ద్వారా రుణాల సౌకర్యాలు అసలు మరియు వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలమైనారు మరియు రుణాలు నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడినాయి. వారి చివరిగా తెలిసిన చిరునామాల మీద సెక్షన్ 13 (2) యొక్క సెక్యూరిటీజైషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద నోటీసు జారీచేయబడింది, అయినప్పటికీ ఇది తీసుకొనబడలేదు మరియు కావునా పబ్లిక్ నోటీసు ద్వారా వారు ఇక్కడ గమనించవలసిందిగా కోరుతున్నాము.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారుడు/(లోను ఖాతా నంబర్) మరియు చిరునామా	అమలుచేయబడిన సెక్యూర్డ్ అస్సెట్ ఆస్తి చిరునామా	పంపబడిన నోటీసు తేది/నోటీసు తేది నాటికి బకాయిలు	ఎన్‌పిఎ తేది
1.	**UVGTR00043039034/** సాయి లక్ష్మి గ్రానిటెస్/ చింత కల్పన/ ఎస్‌వై నం.63 3 మెయిన్ రోడ్డు/ గురుజెపల్లి/ప్రకాశం ఆంధ్రప్రదేశ్/ఒంగోలు-523301	BLAZO 25/ BLAZO 25 RMC/ AP39TH5285	31-May-23 Rs. 9,67,004/-	30-Jan-2023
2.	**UVGTR00043039160/** సాయి లక్ష్మి గ్రానిటెస్/ చింత కల్పన/ ఎస్‌వై నం.63 3 మెయిన్ రోడ్డు/ గురుజెపల్లి/ప్రకాశం ఆంధ్రప్రదేశ్/ఒంగోలు-523301	BLAZO 25/ BLAZO 25 RMC/ AP39TH5286	31-May-23 Rs. 9,98,460/-	30-Jan-2023
3.	**LAVJW00041910268/** చుండూరు సంతోష్ అభయ్/56-19-20 బి/జయప్రకాష్ నగర్/క్రీస్తురాజపురం/విజయవాడ-520008	Duster/ 85 PS RXS 4X2 MT/ AP39FT3456	02-Jun-23 Rs. 6,70,596/-	13-Oct-2022
4.	**LAVJW00043291240/** దండెబోయిన శ్రద్ధ/ఫ్లాట్ నం.101 అనిష్ సన్‌రైస్ ఎన్‌క్లెవ్/కనకదుర్గ ఎన్‌జిఆర్/ విజయవాడ/విజయవాడ-520008	Jazz/ 1.2 ZX CVT/ AP39JH1984	02-Jun-23 Rs. 8,62,838/-	08-Nov-2022
5.	**LUVJW00043151009/** కె ఎన్ ఎస్ ప్రభాకర్/23-46 2వ అంతస్తు ఫ్లాట్ నం.203/ శ్రీ శ్రీనివాస్ అపార్ట్‌మెంట్/బెల్లంవారి వీధి ప్రసాదంపాడు/ విజయవాడ-521108.	SAFARI STROME/ VX/ AP16EF9784	02-Jun-23 Rs. 7,33,790/-	08-Sep-2022

పై రుణగ్రహీత/లు మరియు వారి హామీదారులు (వర్తించబడతారు) నోటీసు యు/ఎస్. 13(2), ప్రకారం ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60 రోజులలోపట బకాయిలు చెల్లించవలసిందిగా కోరుతున్నాము లేనియెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 నోటీసు యు/ఎస్. 13(2) నిబంధనల ప్రకారం తదుపరిగా మందడగు వేయడం జరుగుతుంది.

తేది: 29 జూన్, 2023
ప్రదేశం: విజయవాడ
సం/- ఆధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్. తరఫున

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పోరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదాపేట, చెన్నై-600015.
సిఐఎన్: U65922TN2015PLC10093,
www.hindujahousingfinance.com

అనుబంధం-IV
స్వాధీనత నోటీసు (స్థిరాస్తి)

ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002, కింద సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్) కంపెనీ యొక్క ఆధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసును జారీ చేయబడింది. రుణగ్రహీతలు/హామీదారులకు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తాన్ని చెల్లించాలని సదరు నోటీసులో పేర్కొనడం జరిగింది. రుణగ్రహీతలు/హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కింద సంతకం చేసిన వ్యక్తి తనకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి ఇక్కడ వివరించిన ఆస్తిని రూల్ 8తో చదువుతూ సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002,లోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. సురక్షితమైన ఆస్తులను రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించారు. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఆస్తితో వ్యవహరించవద్దని హెచ్చరిస్తూ, మరియు ఆస్తికి సంబంధించిన ఏదైనా లావాదేవీలు దానిపై వడ్డీతో పాటు ఇక్కడ పేర్కొన్న మొత్తానికి హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ చార్జీకి లోబడి ఉంటాయని తెలియజేస్తున్నారు.

క్ర. సం	రుణగ్రహీత(లు)/హామీదారు(లు) యొక్క పేర్లు	డిమాండ్ నోటీసు తేది & మొత్తం	స్వాధీనత తేది
1	1) 1. శ్రీ. భారత్ కృష్ణ పుప్పాల, ఫ్లాట్ నం.707, బ్లాక్-ఎ, అలేక్య పాల్మ్ ఉడ్స్, నానక్రంగూడ, హైదరాబాద్-500008. ఇక్కడ కూడా: ఫ్లాట్ నం.713, ఎస్‌వై.నం.476, గోరంట్ల గ్రామం కొరిటేపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522034. 2. శ్రీమతి. సమీన సౌదాగర్, ఫ్లాట్ నం.707, బ్లాక్-ఎ, అలేక్య పాల్మ్ ఉడ్స్, నానక్రంగూడ, హైదరాబాద్-500008. ఇక్కడ కూడా: ఫ్లాట్ నం.713, ఎస్‌వై.నం.476, గోరంట్ల గ్రామం కొరిటేపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522034. LAN: AP/HDB/LBNG/A000000093	24.03.2023 & Rs.25,53,010/- (ఇరవై ఐదు లక్షల యాభై మూడు వేల పది రూపాయలు మాత్రమే)	27-06-2023
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ వివరణ : గుంటూరు జిల్లా, కొరిటేపాడు, గోరంట్ల గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ఓపెన్ ప్లాట్ బేరింగ్ నం.714 కొలిచే 200 చ.గ.లు. బేరింగ్ ఎస్.వై.నం.476 మరియు క్రింది విధమైన హద్దులు : తూర్పు: ప్లాట్ నం.719, దక్షిణం: ప్లాట్ నం.713, పడమర: 33 అ.లు. వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.715.		
2	1. శ్రీ. దిల్‌షాద్ మహమ్మద్, హౌ.నం.12-1-490/40/ఎ/3/2, 1వ అంతస్తు, హుడా కాలనీ ఆసిఫ్ నగర్, హైదరాబాద్-500028. ఇక్కడ కూడా : ప్లాట్ నం.697, డో.నం.476 మరియు డో.నం.477, 6వ బ్లాక్, గోరంట్ల గ్రామం, కొరిటేపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522034.2. శ్రీ. పర్వీన్ అస్మ, హౌ.నం.12-1-490/40/ఎ/3/2, 1వ అంతస్తు, హుడా కాలనీ, ఆసిఫ్ నగర్, హైదరాబాద్-500028. ఇక్కడ కూడా : ప్లాట్ నం.697, డో.నం.476 మరియు డో.నం.477, 6వ బ్లాక్, గోరంట్ల గ్రామం, కొరిటేపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522034. LAN: AP/HDB/LBNG/A000000076	22.02.2023 & Rs.40,58,158/- (నలభై లక్షల యాభై ఎనిమిది వేల ఒక వందా యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే)	27-06-2023
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ యొక్క వివరణ: గుంటూరు జిల్లా, కొరిటేపాడు ఉపజిల్లా, గోరంట్ల గ్రామ పంచాయతీ ఏరియా పరిధి, 6వ బ్లాక్, గోరంట్ల గ్రామం డో.నం.476 విస్తీర్ణం ఎసి. 10.06 సెంట్లు., డో.నం.477 విస్తీర్ణం 14.75 సెంట్లు., మొత్తం విస్తీర్ణం ఎసి.24.81 సెంట్లు., బయట విస్తీర్ణం 1.85 సెంట్లు., వైడ్ ప్లాట్ నం.697 సైట్ విస్తీర్ణం 200 చ.గ.లు. ఉన్న హద్దులు: సరిహద్దులు: తూర్పు: 33 అ.లు. వెడల్పు రోడ్డు, 33.4 అ.లు., దక్షిణం: ప్లాట్ నం.698-54.0 అ.లు., పడమర: కోల ఇమానియేల కు చెందిన ప్లాట్ నం.688-33.4 అ.లు., ఉత్తరం: సుదుల హనుమంతరావుకు చెందిన ప్లాట్ నం.696-54.0 అ.లు., ఈ పై సరిహద్దుల ఖాళీ సైట్ విస్తీర్ణం 200 చ.గ.లు. లేదా 167.23 చ.మీ.లకు సమానం మాత్రమే.		
3	1. శ్రీ.మస్తాన్ మహ్మద్, హౌ.నం.13-6-434/ఎ/168, సర్దార్ బాగ్ లంగర్ హౌస్, గోలుకొండ, హైదరాబాద్, తెలంగాణ-500008.2. శ్రీమతి. ఉన్నీసాజెబా, హౌ.నం.13-6-434/ఎ/168, సర్దార్ బాగ్ లంగర్ హౌస్, గోలుకొండ, హైదరాబాద్, తెలంగాణ-500008. LAN: AP/HDB/LBNG/A000000103	23.01.2023 & Rs.25,40,517/- (ఇరవై ఐదు లక్షల నలభై వేల ఐదు వందల పదిహేడు రూపాయలు మాత్రమే)	27-06-2023
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ యొక్క వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, ప్రస్తుత కొరిటేపాడు ఉపజిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలోని టౌన్ సర్వే కాని గోరంట్ల గ్రామం డో.నం.476, ఎసి. 10-06 సెంట్లు., ప్లాన్ ద్వారా ప్లాట్లుగా విభజించిన దీని బయట బేరింగ్ ప్లాట్ నం.ఎ-656, సైట్ విస్తీర్ణం 200 చ.గ.లు., ఉన్న సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.ఎ-862 యొక్క సైట్ -33'4", పడమర: 33 అ.లు. వెడల్పు రోడ్డు-33'4", ఉత్తరం: ప్లాట్ నం.ఎ-657 యొక్క సైట్-54'-0", దక్షిణం: ప్లాట్ నం.ఎ-655 యొక్క సైట్-54'0". ఈ సరిహద్దుల ఖాళీ సైట్ పరిధిలో 200 చ.గ.లు. లేదా 167-23 చ.మీ.లు. మాత్రమే.		
4	1. శ్రీ. సిద్దార్ద్ రెడ్డి దండోలు, ఫ్లాట్ నం.101, ఫేజ్-1, ఇందిర ప్రస్థా కాలనీ హస్తినాపురం సెంట్రల్ సరూర్ నగర్, కె.వి.రంగారెడ్డి తెలంగాణ-500079. ఇక్కడ కూడా: ప్లాట్ నం.713, డో.నం.476, గోరంట్ల, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కొరిటేపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522034. 2. శ్రీ. రాధ దండోలు, ఫ్లాట్ నం.101, ఫేజ్-1, ఇందిరా ప్రస్థా కాలనీ హస్తినాపురం సెంట్రల్ సరీరనగర్, కె.వి.రంగారెడ్డి, తెలంగాణ-500079. ఇక్కడ కూడా : ప్లాట్ నం.713, డో.నం.476, గోరంట్ల, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కొరిటేపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522034. LAN:AP/HDB/LBNG/A000000064	22.02.2023 & Rs.42,65,544/- (నలభై రెండు లక్షల అరవై ఐదు వేల ఐదు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే)	27-06-2023
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ యొక్క వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గోరంట్ల, డో.నం.476 లో మొత్తం ఆ ఖాళీ ప్లాట్ బేరింగ్ నం.713 కొలిచే 200 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు: కొరిటేపాడు ఉపజిల్లా సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.720, దక్షిణం: ప్లాట్ నం.712, పడమర: 33 అ.లు. వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.714.		

తేది: 29.06.2023 ప్రదేశం: హైదరాబాద్
శ్రీ.ఎమ్. రామకృష్ణ మూర్తి (అధీకృత అధికారి), హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రథయాత్రలో ఘోరం

- ఏడుగురి మృతి
- 15 మందికి గాయాలు

అగర్తలా : ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉన్‌కోటి జిల్లాలోని కుమార్‌ఘాట్‌లో జరిగిన ఉల్టా రథయాత్రలో విద్యుదాఘాతం జరగడంతో ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు మరణించారు. మరో 15మంది గాయపడ్డారు. బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కుమార్ ఘాట్ ప్రాంతంలో జగన్నాథుడికి నిర్వహించిన రథయాత్రలో బుధవారం సాయంత్రం 4.30గంటల సమయంలో రథం పైభాగం హైటెన్షన్ వైర్లను తాకడంతో మంటలు వ్యాపించి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో వేలాదిమంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై త్రిపుర ముఖ్యమంత్రి మానిక్ షా స్పందించారు. కుమార్‌ఘాట్‌లో జరిగిన ఈ దుర్ఘటన తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు.

మహారాష్ట్రలో రెండు వంతెనలకు పేర్లు మార్పు

ముంబయి : మహారాష్ట్ర ప్రభుత్వం బుధవారం రెండు ముఖ్యమైన వంతెనలకు పేర్లను మార్చింది. వెర్సోవా-బాంద్రా సీ లింక్ వంతెనకు వీర్ సావర్కర్ సేతు అని నామకరణం చేసింది. అదేవిధంగా ముంబయి ట్రాన్స్ హార్బర్ లింక్ వంతెనకు అటల్ బిహారీ వాజ్‌పేయీ స్మృతి నవ సేవ అటల్ సేతు అని పేరు పెట్టింది. రాష్ట్ర మంత్రి సుధీర్ ముంగంటివార్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ వంతెనలకు భరత మాత ముద్దు బిడ్డల పేర్లు పెట్టినందువల్ల వివాదాలకు తావులేదన్నారు. కాగా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే గత నెలలో మాట్లాడుతూ, ముంబైలోని బాంద్రా-వెర్సోవా సీ లింక్‌కు సావర్కర్ పేరు పెడతామని చెప్పారు. ధైర్య, సాహసాలు ప్రదర్శించినవారికి కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న గాలంట్రీ అవార్డుల మాదిరిగానే మహారాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర స్థాయిలో గాలంట్రీ అవార్డును సావర్కర్ పేరు మీద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం

- ఐదుగురి మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. దతియా జిల్లా దుర్సాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుహ్రా గ్రామంలో బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో ఉన్న ఒక మినీ ట్రక్కు వంతెన దాటుతుండగా అదుపుతప్పి నదిలో పడిపోయింది. ఐదుగురి మతదేహాలు లభ్యం కాగా మిగిలినవారు గల్లంతయ్యారు. గ్వాలియర్‌లోని భేలేటి గ్రామం నుంచి తికమ్‌గఢ్‌లోని జాతర గ్రామానికి పెళ్లి వేడుకల కోసం వీరంతా మినీ ట్రక్కులో వెళుతున్నారు. ప్రమాద వార్త అందిన వెంటనే గ్రామస్థులు అక్కడికి చేరుకుని ట్రక్కులోనివారిని రక్షించే ప్రయత్నం చేపట్టారు.. ప్రస్తుతం నదిలో పడిన వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వ్యక్తులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఇప్పటికీ కొంతమంది వ్యక్తుల ఆచూకీ తెలియడం లేదని.. ఎస్‌డీఆర్‌ఎఫ్ బందం ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపడుతుందని స్థానిక అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని మధ్యప్రదేశ్ హెూంమంత్రి నరోత్తమ్ మిశ్రా తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై హోంమంత్రి నరోత్తం మిశ్రా విచారం వ్యక్తం చేశారు. బుహ్రా నది వంతెన దాటుతుండగా ట్రక్కు చక్రం తెగిపోవడంతో ట్రక్కు అదుపుతప్పి నదిలోకి పడిపోయి దూసుకెళ్లిందన్నారు.

లోతైన సముద్ర జలాల్లో తవ్వకాలకు చైనా నౌకా నిర్మాణం

బీజింగ్ : లోతైన సముద్ర జలాల్లో బహుముఖంగా పనిచేసే నౌక నిర్మాణాన్ని చైనా ఆదివారం అధికారికంగా ప్రారంభించింది. ఈ తరహా నౌకల్లో ఇదే మొదటిది. లోతైన సముద్ర జలాల్లో శాస్త్రీయ పరిశోధనలు చేపట్టేందుకు, సాంస్కృతికపరమైన అవశేషాల పురావస్తు తవ్వకాలకు ఈ నౌకను ఉపయోగిస్తారు. దక్షిణ చైనాలోని గుయాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో గుయాంగ్జులోని నాన్షా వద్ద ఈ నౌక నిర్మాణాన్ని ఆరంభించారు. 2025లో ఇది పూర్తయి విధుల్లోకి చేరుతుందని భావిస్తున్నారు. 103 మీటర్ల పొడవుండే ఈ నౌక బరువు దాదాపు 9200 టన్నులు వుంటుంది. గంటకు 29.63కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దీంట్లో 80మంది సిబ్బందికి అవకాశం వుంటుంది. లోతైన సముద్ర జలాల్లో పురావస్తు తవ్వకాలకు ఈ నౌక గట్టి మద్దతునిస్తుందని జాతీయ పురావస్తు కేంద్రానికి చెందిన పరిశోధకుడు సాంగ్‌జియాన్‌ఝాంగ్ గ్లోబల్ టైమ్స్‌కు తెలిపారు.

యుసిసి అమలు — దేశ బహుళత్వం, వైవిధ్యంపై దాడి

- ప్రతిపక్షాల విమర్శ

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) అమలు దేశ బహుళత్వం, వైవిధ్యంపై దాడి చేయడమేనని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దేశంలో యుసిసి అమలు చేయాలని, కానీ ప్రతిపక్షాలు దాన్ని అడ్డుకుంటున్నట్టు ప్రధాని మోడీ ఆరోపించిన సంగతి తెలిసిందే. భోపాల్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయి. హిందూ మతంలో ముందుగా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలనీ, దేశంలోని ప్రతి ఆలయంలో ఎస్‌టీలు, ఎస్‌సీలు పూజలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్ ప్రశ్నించారు. యూసీసీ తమకు అవసరం లేదని, ఎందుకంటే రాజ్యాంగం ప్రతి మతానికి రక్షణ కల్పించిందని అన్నారు. ప్రధాని మొదట దేశంలో పెరుగుతున్న పేదరికం, ధరల పెరుగుదల, నిరుద్యోగంపై స్పందించాల్సి వుందని కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఒకవైపు మణిపూర్ మండిపోతోందనీ, కానీ ప్రధాని మణిపూర్ అంశంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. ట్రిపుల్ తలాక్ అనేది ఇస్లాంలో విడదీయరాదని భాగమైతే పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఖతర్, జోర్డాన్, సిరియా వంటి ముస్లిం మెజారిటీ దేశాల్లో ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం వర్గాన్ని ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయని ప్రధాని ఆరోపించారు. ప్రజలకు రెండు రకాల రూల్స్ ఉంటే ఒక కుటుంబం ఎలా పనిచేస్తుందని, అప్పుడు దేశం ఎలా పనిచేస్తుందని ఆయన ప్రశ్నించారు.

ఒకవేళ ఉమ్మడి పౌరస్మృతి కావాలంటే దాన్ని పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టవచ్చునీ, వాళ్లను ఎవరు అడ్డుకున్నారని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరీ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో యూసీసీ ప్రవేశపెట్టకుండా, ప్రతిపక్షాలపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. భారత్‌లో ఉన్న బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని ప్రధాని మోడీ సమస్యగా చూస్తున్నారని, యూసీసీ పేరుతో దేశ ఔన్నత్యాన్ని తగ్గిస్తారా అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసి మండిపడ్డారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే.. : పి. చిదంబరం

ప్రధాని మోడీ ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) ప్రతిపాదనపై కాంగ్రెస్ నాయకులు పి. చిదంబరం విరుచుకుపడ్డారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్వేషపూరిత నేరాల సమస్యల నుండి దేశ ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రధాని యుసిసి ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చారని బుధవారం విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజాన్ని విభజించేందుకు బిజెపి యుసిసిని వినియోగిస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం యుసిసిని ప్రజలపై బలవంతంగా రుద్దదని, ఎందుకంటే ప్రజల మధ్య విభజనలను వ్యాప్తి చేయడమే మెజారిటీ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని అన్నారు.

ప్రధాని మోడీ యుసిసిని ఓ సాధారణ ప్రకియలా కనిపించేలా చేస్తున్నారని, అయితే ఇది ఆచరణ సాధ్యం కాదని వెల్లడించిన గత లా కమిషన్ నివేదికను చదవాలని అన్నారు. బిజెపి మాటలు, చేతల కారణంగా నేడు దేశం విడిపోయిందని, ప్రజలపై విధించే యుసిసి విభజనలను మరింత విస్తృతం చేస్తుందని అన్నారు. సుపరిపాలనను అందించడంలో విఫలమైన బిజెపి, ఓటర్లను విభజించేందుకు యుసిసిని ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చిందని మండిపడ్డారు.

యుసిసిని హైలెట్ చేసేందుకు ప్రధాని దేశాన్ని ఒక కుటుంబంతో సమానం చేశారని, ప్రజల కోణంలో నిజంగానే అనిపిస్తుందని, కానీ వాస్తవికతలో భిన్నంగా ఉంటుందని అన్నారు. ఓ కుటుంబం రక్తసంబంధాలతో ముడిపడి ఉంటుందని, కానీ దేశం చట్టపరమైన పత్రమైన రాజ్యాంగం ద్వారా ఓచోటకు చేర్చబడుతుందని అన్నారు. కుటుంబంలో వైవిధ్యమున్నట్లే, రాజ్యాంగం భారత దేశంలోని ప్రజల మధ్య వైవిధ్యం మరియు భిన్నతానికి గుర్తింపునిచ్చిందని తెలిపారు.

49 శాతం పేదలున్న ప్రాంతాల్లో 70 శాతం ఉపాధి నిధులు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శాఖ ప్యానెల్ సిఫార్సు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 49 శాతం పేదలున్న ప్రాంతాల్లో 70 శాతం ఉపాధి నిధులు ఖర్చు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసింది. అలాగే ఆస్తుల కల్పనతో ఉపాధి హామీని అనుసంధానం చేసేలా కార్యక్రమాన్ని పూర్తిగా సవరించాలని సిఫార్సు చేసింది. దేశంలోని అత్యంత పేద బ్లాకులను లక్ష్యంగా చేసుకునేందుకు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న మొత్తం 7,245 బ్లాకుల్లో 3,500 బ్లాకులకు (49 శాతం) 70 శాతం ఉపాధి నిధులను ఖర్చు చేయాలని సూచించింది. 3,500 ప్రాంతాల్లో 2,500 నీటి కొరత ఉన్న బ్లాక్‌లు, 1,000 పేదరికంతో ఉన్న బ్లాక్‌లుగా గుర్తించినట్లు కమిటీ తెలిపింది. ఈ ప్రాంతాల్లో బడ్జెట్ వ్యయంలో 70 శాతం ఖర్చు చేయాలని సూచించింది.

పేదరిక నిర్మూలన సాధనంగా ఉపాధి హామీ పథకం సామర్థ్యాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం 2022 అక్టోబర్‌లో తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అమర్జీత్ సిన్హా నేతృత్వంలోని కమిటీ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005లో ఆమోదించబడింది. డిమాండ్-ఆధారిత పథకం ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల నైపుణ్యం లేని పనికి హామీ ఇస్తుంది. 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు భారీగా తగ్గాయి. కేంద్ర బడ్జెట్ 2023-24లో పథకానికి కేటాయింపులు 32 శాతం తగ్గాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో గ్రామీణ హామీ పథకం కింద డిమాండ్ బాగా పెరిగినప్పటికీ, అప్పటి నుంచే బడ్జెట్ క్షీణత కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఉత్తరప్రదేశ్, అస్సాం, మేఘాలయ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని 10 రాష్ట్రాల్లో సర్వే నిర్వహించిన తాజా ప్యానెల్ "అందరికీ ఒకే పరిమాణం" పని చేయదని, లక్ష్యంతో కూడిన విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సర్వే సందర్భంగా, కొత్త సాంకేతిక జోక్యాలకు వ్యతిరేకంగా కమిటీకి అనేక ఫిర్యాదులు అందాయని, అందులో హాజరు నమోదు చేయడానికి మొబైల్ యాప్, తప్పనిసరి ఆధార్ ఆధారిత చెల్లింపులు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సాంకేతికత అనేది ఒక సాధనం కావచ్చు, కానీ అంతం కాదని కమిటీ తన నివేదికలో ఎత్తి చూపింది.

ఉపాధి కార్మికులు, కార్యకర్తలతో సహా ఉపాధి హామీతో అనుబంధించబడిన వారు తప్పనిసరిగా చేసిన మొబైల్ యాప్ అయిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ని వ్యతిరేకిస్తున్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌ను ప్రవేశపెట్టడానికి ముందు, కార్మికుల హాజరు భౌతికంగా కాగితంపై గుర్తించబడింది. కానీ ఎన్ఎంఎంఎస్ కింద, ప్రతి కార్మికుడి హాజరును గుర్తించడానికి వర్క్‌సైట్‌లో రెండు సార్లు స్టాంప్డ్, జియో-ట్యాగ్ చేయబడిన ఫోటోగ్రాఫ్‌లు తీసుకోవాల్సి వస్తోంది. అందుకే ఈ యాప్‌ను రద్దు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఎందుకంటే ఇది లక్ష్యాన్ని చేరుకోవడం లేదని కార్మికులు ఎత్తు చూపుతున్నారు.

రైల్వేల్లో 2.74 లక్షల ఖాళీలు

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే శాఖలో భారీగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 2.74లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉండగా.. వీటిలో ఒక్క సేఫ్టీ కేటగిరీలోనే 1.7లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నట్టు రైల్వే శాఖ తాజాగా వెల్లడించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సమాచార హక్కు చట్టం కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ రైల్వేల్లో ఖాళీలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించింది. రైల్వేశాఖలో గ్రూప్ సీ కేటగిరి (లెవెల్ 1 లేదా ఎంట్రీ లెవెల్ స్టాఫ్)లోనే 2,74,580 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపింది. వీటిలో ఒక్క భద్రతకు సంబంధించిన కేటగిరీలోనే 1,77,924 ఖాళీలు ఉన్నట్టు పేర్కొంది. ఈ ఏడాది జూన్ 1 నాటికి సేఫ్టీ కేటగిరీలో 9,82,037 పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా.. 8,04,113 ఉద్యోగాలను భర్తీ చేసినట్టు సమాధానంలో పేర్కొంది.

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, త్వరితగతిన పదోన్నతులు కల్పించడం, శిక్షణ తర్వాత కోర్ ఉద్యోగాలకు నాన్-కోర్ సిబ్బందిని తరలించడం వంటి చర్యల ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నట్టు రైల్వేశాఖ అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ తెలిపారు. కాగా, రైల్వేశాఖలో మొత్తంగా 3.12లక్షల నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 2022 డిసెంబర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది అక్టోబర్ నాటికి 1.52లక్షల ఖాళీలను భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే 1.38లక్షల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు.

బ్రిటన్‌లో ప్రతి ఏడుగురిలో ఒకరు ఆకలితో సతమతం!

- బలహీనమైన సామాజిక భద్రతా వ్యవస్థే కారణం
- ట్రస్సెల్ ట్రస్టు నివేదిక వెల్లడి

లండన్ : బ్రిటన్‌లో ప్రతి ఏడుగురిలో ఒకరు గతేడాది ఆకలి బాధలను ఎదుర్కొన్నారు. వారి వద్ద తగినంత డబ్బు లేకపోవడమే ఇందుకు కారణమని ఆహార బ్యాంక్ చారిటీ సంస్థ ట్రస్సెల్ ట్రస్టు బుధవారం ప్రచురించిన నివేదిక పేర్కొంది. అంటే దాదాపు కోటీ 13లక్షల మంది గతేడాది ఆకలి బాధకు గురయ్యారని తెలిపింది. ఇది స్కాట్లాండ్ జనాభాకు రెట్టింపు కంటే ఎక్కువేనని పేర్కొంది. పనిచేయని సామాజిక భద్రతా వ్యవస్థ ఇందుకు కారణమని తెలిపింది. దీనికి తోడు జీవన వ్యయ సంక్షోభం కూడా నెలకొందని నివేదిక పేర్కొంది. ఈ సంక్షోభం ఇప్పట్లో సమసిపోయే సూచనలు కూడా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. బ్రిటన్‌ది ప్రపంచంలోనే ఆరవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. కానీ అధిక ద్రవ్యోల్బణం కారణంగా ఇక్కడి ప్రజలు ఏడాదికి పైగా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు కార్మికులందరి వేతనాల పెంపు కన్నా ఎక్కువగా ఈ ద్రవ్యోల్బణం మించిపోయింది. 1950ల నాటి రికార్డులతో పోలిస్తే గత రెండేళ్ళ కాలంలో బ్రిటన్ కుటుంబాల జీవన ప్రమాణాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ట్రస్సెల్ ట్రస్ట్‌కి బ్రిటన్‌వ్యాప్తంగా 1300 ఫుడ్ బ్యాంక్ సెంటర్లు వున్నాయి. ఈ ఫుడ్ బ్యాంక్‌లు మార్చితో ముగిసిన ఏడాది కాలంలో రికార్డు స్థాయిలో 30లక్షల ఆహార పార్శిళ్ళను అందచేశాయి. ఐదేళ్ళ క్రితం అందచేసిన పాకెట్ల కన్నా ఇది రెట్టింపుగా వుంది. దేశంలోని సామాజిక భద్రతా వ్యవస్థ బలహీనంగా వుండడమే ఇందుకు ప్రధాన కారణంగా వుందని ఆ నివేదిక తెలిపింది. దేశంలోని ఏడు శాతం మంది ప్రజలకు ఫుడ్ బ్యాంకులతో సహా స్వచ్ఛంద సంస్థల నుండి ఆహార తోడ్పాటు అందుతోందని తెలిపింది. అయినా 71శాతం మంది ప్రజలు ఆకలి బాధలను ఎదుర్కొన్నారని వారికి ఎక్కడ నుండి ఎలాంటి సాయం అందలేదని తెలిపింది.

బెలారస్‌లో వాగ్నర్ చీఫ్

- ధ్రువీకరించిన లుక షెంకో

మిన్స్క్ : వాగ్నర్ మిలటరీ గ్రూప్ అధినేత యెవ్‌గనీ ప్రిగొజిన్ ప్రస్తుతం బెలారస్‌లోనే వున్నారని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుక షెంకో ధ్రువీకరించారు. వాగ్నర్ గ్రూపు సభ్యులు కావాలంటే బెలారస్‌కి వెళ్ళవచ్చుని, రష్యా మిలటరీతో చేరవచ్చుని లేదా ఇంటికి వెళ్ళిపోవచ్చుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భద్రతా హామీలిచ్చారు. ఆ హామీల మేరకే, వాగ్నర్ సభ్యులు కొంత కాలం పాటు బెలారస్‌లో వారి స్వంత ఖర్చులతో వుండేందుకు లుకాషెంకో అనుమతించారని ప్రభుత్వ వార్తాసంస్థ బెల్టా తెలిపింది. ప్రిగోజిన్‌తో ఫోన్‌లో మాట్లాడానని, తిరుగుబాటుకు దిగాలన్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని చెప్పి ఒప్పించినట్లు లుకాషెంకో మంగళవారం తెలిపారు. బెలారస్‌లో పనికిరాని ఒక సైనిక స్థావరంలో తలదాచుకోవాల్సిందిగా వాగ్నర్ నేతకు చెప్పినట్లు లుకాషెంకో తెలిపారు. ప్రిగొజిన్ విషయంలో తొందరపడవద్దని, పరిస్థితి అదుపు తప్పుతుందని పుతిన్‌కు చెప్పినట్లు లుకాషెంకో చెప్పారు. అలాగే ప్రిగొజిన్‌తో కూడా మాట్లాడానని, మాస్కోపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తే పురుగులా నలిపివేస్తారని హెచ్చరించానని చెప్పారు. పైగా ప్రిగొజిన్ చేసే డిమాండ్లకు క్రెమ్లిన్ ఎన్నడూ అంగీకరించదని స్పష్టం చేసినట్లు తెలిపారు.

రక్తపాతాన్ని నివారించేందుకే తక్షణ చర్యలు : పుతిన్

వాగ్నర్ సమస్యను పరిష్కరించడంలో సమైక్యత, సంఘీభావంతో వ్యవహరించినందుకు దేశ ప్రజలకు పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. రక్తపాతాన్ని నివారించేందుకే తక్షణ చర్యలు చేపట్టామన్నారు. తప్పు చేసిన వారికి ఒక అవకాశం ఇవ్వాలని, తమ చర్యలను సమాజం తిరస్కరించిందని వారు తెలుసుకోవాలని పుతిన్ వ్యాఖ్యానించారు. తిరుగుబాటుదారులను ముందుకు రాకుండా ఆపడంలో తమ ప్రాణాలను పణంగా పెట్టిన పైలట్ల సంస్మరణార్థం ఒక నిముషం మౌనం పాటించారు.

గత ఏడాది కాలంలో వాగ్నర్ సైనికుల వేతనాలు, ఇతర సదుపాయాల నిమిత్తం వంద కోట్ల డాలర్లకు పైగా వారికి చెల్లించినట్లు పుతిన్ తెలిపారు. మాస్కోలో ఒక సైనిక సమావేశంలో మాట్లాడుతూ పుతిన్ ఈ వివరాలు తెలిపారు. అలాగే ప్రిగొజిన్‌కి చెందిన కాంకర్డ్ గ్రూపు రష్యా సైన్యానికి ఆహారం అందించే కాంట్రాక్టు నుండి కూడా దాదాపు మరో వంద కోట్ల డాలర్లను పొందింది.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బ్రెజిల్ కార్మికుల ఆందోళన

బ్రసీలియా : చమురు శుద్ధి కర్మాగారం 'లుబ్నార్ రిఫైనరీ' విక్రయానికి వ్యతిరేకంగా బ్రెజిల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. సియారా నగరంలో ఉన్న లుబ్నార్ లూబ్రికెంట్స్ అండ్ డెరివేటివ్స్ రిఫైనరీని గతేడాది 34 మిలియన్ల అమెరికన్ డాలర్లకు గ్రేపర్ పార్టిసిపాసియోస్‌కి విక్రయించింది. ఇది ఆ సంస్థ మార్కెట్ విలువ కన్నా 55 శాతం తక్కువ కావడం గమనార్హం. లుబ్నార్ 500 మంది కార్మికులను కలిగి ఉండటంతో పాటు బ్రెజిల్‌లో తారు ఉత్పత్తిలో సుమారు 10 శాతం బాధ్యత వహిస్తుంది. అలాగే నాప్తనిక్ లూబ్రికెంట్లను కూడా ఉత్పత్తి చేస్తుంది. వీటిని అధిక వోల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్లు, వెహికల్ షాక్ అబ్జార్బర్‌లు మరియు థర్మల్ ఇన్సులేషన్‌లో వినియోగిస్తారు.

లుబ్నార్ స్థానిక సంస్థలకు డీజిల్, గాసోలిన్, ఏవియేషన్ కిరోసిన్‌ను సరఫరా చేస్తుందని యునిఫైడ్ ఫెడరేషన్ ఆఫ్ ఆయిల్ వర్కర్స్ (ఎఫ్‌యుపి) కోఆర్డినేటర్ డెవిడ్ బాసెలర్ పేర్కొన్నారు. ఇతర రిఫైనరీలు, టెర్మినల్స్ నుండి ఎల్‌పిజిని నౌకల ద్వారా పోర్టులకు రవాణా చేయడంతో పాటు తీర ప్రాంత కార్యకలాపాలతో పాటు దిగుమతులు చేపడుతుంది. లుబ్నార్ విక్రయంతో నౌకల కొరత ఏర్పడుతుందని, ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. లుబ్నార్‌ను ప్రైవేటీకరించడం వల్ల సియారా రాష్ట్రంపై గుత్తాధిపత్యం ఏర్పడుతుందని సిండిపెట్రో -సిఇ/పిఐ అధ్యక్షుడు ఫెర్నాండేజ్ నెటో హెచ్చరించారు. ప్రైవేట్ కంపెనీ స్థానిక మార్కెట్‌కు సరఫరా చేయడం కన్నా లాభదాయకమైన ఎగుమతులు, దిగుమతులపై దృష్టి సారిస్తుందని అన్నారు.

వలసదారుల హక్కులను కాపాడండి

- అభివృద్ధి చెందిన దేశాలకు చైనా విజ్ఞప్తి

జెనీవా : బ్రిటన్‌తో సహా కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు వలసదారుల హక్కులను ఉల్లంఘించడంపై చైనా ఆందోళన వ్యక్తం చేసింది. వారి హక్కులను సమర్థవంతంగా కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ దేశాలను కోరింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి 53వ సమావేశంలో ఈ మేరకు చైనా ఒక ప్రకటన జారీ చేసింది. బాగా చదువుకున్న, అత్యంత నైపుణ్యాలు కలిగిన వలసదారుల వల్ల కలిగే ప్రయోజనాలను కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు పొందుతున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. అయితే ఈ దేశాలు, అంతర్జాతీయంగా వలసదారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో బృహత్తర పాత్ర పోషించడానికి బదులుగా దేశీయంగా వలసదారుల హక్కులను ఉల్లంఘించడమే కాకుండా అంతర్జాతీయ శరణార్థుల., ఇమ్మిగ్రేషన్ సంక్షోభానికి చోదక శక్తిగా మారుతున్నాయని చైనా విమర్శించింది. ఆశ్రయం కోరుతూ వచ్చిన వారిని బ్రిటన్ ఇతర దేశాలకు పంపడం ఆందోళన చెందే విషయమని ఆ ప్రకటన పేర్కొంది. దేశంలో ఇలా ఆశ్రయం కోరుతూ వచ్చే పిల్లల ఆచూకీ గల్లంతయ్యే ప్రమాదముందని, వారిని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించే ముప్పు పొంచి వుందని ఆ ప్రకటన హెచ్చరించింది. దీనిపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి, అనుబంధ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని పేర్కొంది. వెంటనే, అక్రమ ఇమ్మిగ్రేషన్ బిల్లును అత్యవసరంగా సవరించాల్సిందిగా ఇటీవల బాలల హక్కులపై ఐక్యరాజ్య సమితి కమిటీ బ్రిటీష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇతర దేశాలు కూడా ఈ విషయంలో ఉల్లంఘనలు విడనాడాలని, మైగ్రెంట్ల హక్కులను కాపాడే చర్యలు తీసుకోవాలని కోరింది.

టాప్ 150 ఉన్నత విద్యాసంస్థల్లో ఐఐటి బొంబాయి

ముంబయి : వాణిజ్య రాజధాని ముంబయిలోని ఐఐటి-బొంబాయి భారత విద్యా వ్యవస్థలో బుధవారం ఒక మైలురాయిని నెలకొల్పింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మైన మొదటి 150 విశ్వవిద్యాలయాల జాబితా లో చోటు సంపాదించింది. క్యుఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్ తాజా ఎడిషన్‌లో ఈ ఘనత దక్కింది. గతేడాది 177వ స్థానంలో వున్న బాంబే ఐఐటి ఈసారి 149వ స్థానంలోకి వచ్చింది. గత 8ఏళ్ళలో భారత ఉన్నత విద్యా సంస్థ టాప్ 150లోకి చేరుకోవడం ఇదే మొదటిసారి. 2016లో విడుదల చేసిన జాబితాలో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి)కి 147వ ర్యాంక్ లభించింది. కాగా ఈ ఏడాది ఐఐఎస్‌సి ర్యాంక్ 225కి పడిపోయింది. గతేడాది 155వ స్థానంతో సరిపెట్టుకుంది. గతేడాది 174వ స్థానంలో వున్న ఐఐటి ఢిల్లీ ఈసారి 197కి పడిపోయింది. కానీ, ఈ జాబితాలోని రెండో ఉన్నత భారత విద్యా సంస్థ ఇదే. టాప్ 150లో చేరినందుకు ఐఐటి బాంబేను కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అభినందించారు. భారతీయ విశ్వవిద్యాలయాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకున్నాయని అన్నారు. ఇక ఇప్పుడు మెరుగైన విద్య కోసం విదేశాలకు తక్కువమంది భారతీయులు ప్రయాణిస్తారని వ్యాఖ్యానించారు. భారతీయ విద్యా వ్యవస్థ బాగుండడం కాదని, ప్రపంచంలోనే ఉత్తమంగా వుందని అన్నారు. పరిశోధనల నాణ్యతలో స్థిరమైన మెరుగుదలలతో కూడిన అద్భుతమైన ప్రయాణం ఐఐటి బాంబేదని క్యుఎస్ అనలిస్ట్ జారీ చేసిన ప్రకటన పేర్కొంది.

మాంసం అమ్మకాలపై నిషేధం

- కన్వర్ యాత్ర సందర్భంగా యుపి ప్రభుత్వ ఆదేశం

లక్నో : కన్వర్ యాత్ర సాగే మార్గంలో మాంసాన్ని బహిరంగంగా విక్రయించడంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. సీనియర్ అధికారులతో జరిపిన సమీక్షా సమావేశం అనంతరం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కన్వర్ యాత్ర వచ్చే నెల 4వ తేదీన ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం అధిక మాసం వచ్చినందున శ్రావణ మాసం రెండు నెలల పాటు కొనసాగుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కాలంలో శ్రావణ శివరాత్రి, నాగపంచమి, రక్షాబంధన్ పండుగలను ప్రజలు జరుపుకుంటారని ఆయన తెలిపారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ కన్వర్ యాత్ర మార్గంలో మాంసాన్ని బహిరంగంగా అమ్మడంపై నిషేధం విధించామని వివరించారు. ఈ మార్గం శుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంటుందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. మత ప్రాతిపదికన ప్రజలను రెచ్చగొట్టేందుకు కొందరు దుండగులు ప్రయత్నిస్తారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బక్రీద్ సందర్భంగా నిర్దేశించిన మార్కెట్ ప్రదేశాలలో తప్ప ఎక్కడా జంతువధ జరగకుండా చూడాలని అన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, ఛాటింగ్ యాప్స్ ద్వారా మత మార్పిడులు జరుగుతున్నాయని చెబుతూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ సిండికేట్ ఈ అక్రమ మతమార్పిడులకు పాల్పడుతోందని ఆరోపించారు.

గత సంవత్సరం శ్రావణ మాసంలో కోటి మంది భక్తులు వారణాసిలోని కాశీ విశ్వనాథ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ నెలలో ప్రతి సోమవారం ఆరు లక్షల మంది దేవాలయాన్ని సందర్శిస్తారు.

జులై 13న చంద్రయాన్-3

న్యూఢిల్లీ : ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోన్న చంద్రయాన్-3 ప్రయోగానికి తేదీ ఖరారయ్యింది. జులై 13 మధ్యాహ్నం 2.30 గంటలకు జాబిల్లి వైపు దూసుకెళ్లనుంది. ఈ విషయాన్ని ఇస్రో అధికారికంగా బుధవారం ప్రకటించింది. ఈ మిషన్‌కు సంబంధించిన పనులు ఇప్పటికే దాదాపు పూర్తయినట్లు సమాచారం. యువ శాస్త్రవేత్త వీరముత్తుయేల్ సారథ్యంలో రూపుదిద్దుకున్న ఈ ఉపగ్రహం అనుసంధాన పనులతోపాటు రోవర్, ల్యాండర్ బిగింపు పనులు ఏకకాలంలో చేస్తున్నారు. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ ఎం-3 భారీ వాహకనౌక ద్వారా ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.615 కోట్లు కేటాయించింది.

ఇక చంద్రయాన్-1ను 2008లో చేపట్టగా.. అది విజయవంతంగా చంద్రుడి ఉపరితలంపై నీటి జాడలను గుర్తించిన విషయం తెలిసిందే. అయితే, అది రెండేళ్ల పాటు పనిచేసే విధంగా రూపొందించినప్పటికీ.. దాదాపు ఏడాదిలోనే దాంతో సంబంధాలు తెగిపోయాయి. చంద్రుడి చుట్టూ తిరుగుతూ మొత్తం 312 రోజులు సేవలు అందించిన తర్వాత.. ఆ మిషన్ ముగిసినట్లు ఆగస్టు 2009లో ఇస్రో ప్రకటించింది. అనంతరం చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని ఆవిష్కరించడమే లక్ష్యంగా ఇస్రో చేపట్టిన చంద్రయాన్-2.. చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్‌ల్యాండింగ్ సమయంలో విఫలమైంది. అయినప్పటికీ ఎనిమిది సాంకేతిక పరికరాలతో కూడిన ఆర్బిటర్ మాత్రం చంద్రుడి కక్ష్యలో విజయవంతంగా తిరుగుతోంది. ఇక చంద్రయాన్ 3 మిషన్ విజయవంతమైతే మాత్రం భారత అంతరిక్ష పరిశోధనలో కీలక అడుగుపడినట్లే.

రాహుల్‌పై అనుచిత వీడియో

- బిజెపి ఐటీ విభాగం చీఫ్‌పై కేసు

బెంగళూరు : బిజెపి ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవ్యాపై బెంగళూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాలలో వీడియోను పోస్ట్ చేయడం ద్వారా ప్రజలలో శత్రుత్వాన్ని ప్రేరేపిస్తున్నారని, ప్రజలను రెచ్చగొడుతున్నారని మాలవ్యాపై కర్నాటక పిసిసి సభ్యుడు రమేష్ బాబు ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ పైన, కాంగ్రెస్ పార్టీ పైన దురభిప్రాయం కలిగించేలా ఉన్న యానిమేషన్ వీడియోను మాలవ్యా పోస్ట్ చేశారు. అంతేకాక 'రాహుల్ గాంధీ ప్రమాదకారి. ఆయన ఓ కృత్రిమమైన ఆట ఆడుతున్నాడు. ఆ పార్టీ వారు మరింత ప్రమాదకారులు. భారతదేశ ప్రతిష్ఠను విదేశాలలో దిగజార్చేందుకు వారు ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. గౌరవనీయ ప్రధాని నరేంద్ర మోడీని అప్రదిష్టపాలు చేసేందుకే వారు ఇలా చేస్తున్నారు' అంటూ ట్వీట్ కూడా చేశారు. దీనిపై ఐపీసీలోని 153(ఏ), 120(బీ), 505(2), 34 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

మతం, జాతి, పుట్టిన ప్రదేశం, నివాసం, భాష ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, సుహృద్భావ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని, కుట్రకు పాల్పడ్డారని మాలవ్యాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. తనపై కేసు నమోదు కాగానే మాలవ్యా అదే వీడియోను మళ్లీ పోస్ట్ చేస్తూ రాహుల్ గాంధీ విదేశీ బంటు అని ట్వీట్ చేశారు. మాలవ్యా చర్యలపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటే బిజెపి నాయకులు గగ్గోలు పెడుతుంటారని చెప్పారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించడంలో వారికి సమస్యలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మాలవ్యాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఎలాంటి దురుద్దేశం లేదని చెప్పారు.

హెచ్-1బీ వీసాదారులకు కెనడా గొప్ప అవకాశం

ఒట్టావా : అమెరికాకు చెందిన హెచ్-1బీ వీసాదారులకు కెనడా ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. అమెరికాకు చెందిన 10,000 మంది హెచ్-1బి వీసాదారులు తమ దేశంలో ఉద్యోగం చేసుకునేందుకు వీలుగా ఓపెన్ వర్క్-పర్మిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కెనడా వసలు, శరణార్థులు, పౌరసత్వ సేవల శాఖ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. అలాగే ఈ ప్రొగ్రామ్ కింద హెచ్-1బీ వీసాదారుల కుటుంబసభ్యులు చదువుకునేందుకు, పనిచేసేందుకు అనుమతి కల్పించనున్నట్లు కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి సీన్ ఫ్రేజర్ వెల్లడించారు.

హైటెక్ రంగాలకు చెందిన కొన్ని కంపెనీలు అమెరికా, కెనడాల్లోనూ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాయి. అమెరికాలో పనిచేసేవారు తరుచుగా హెచ్-1బీ స్పెషల్ ఆక్యుపేషన్ వీసాను కలిగి ఉంటారు. జులై 16, 2023 నాటికి హెచ్-1బీ స్పెషల్ ఆక్యుపేషన్ వీసాలతో అమెరికాలో పనిచేస్తున్నవారు, వారి కుటుంబసభ్యులతో కలిసి కెనడాకు వచ్చేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ కొత్త ప్రోగ్రామ్ కింద.. ఆమోదం పొందిన హెచ్-1బీ వీసాదారులకు మూడేళ్ల కాల వ్యవధితో ఓపెన్ వర్క్ పర్మిట్ లభిస్తుంది. వారు కెనడాలో ఎక్కడైనా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం వెల్లడించింది. వారి జీవిత భాగస్వాములు, డిపెండెంట్లు కూడా కెనడాలో ఉద్యోగం లేదా చదువుకునేందుకు తాత్కాలిక నివాస వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఈ ఇమ్మిగ్రేషన్ స్ట్రీమ్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఇమ్మిగ్రేషన్ మంత్రి ఫ్రేజర్ వెల్లడించారు. అయితే, ఈ స్ట్రీమ్ కింద దరఖాస్తు చేసుకునేందుకు ఎవరు అర్హులు అనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు.

మీ కోసం

చింతపండు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే దాని నిల్వ చేసే డబ్బాలో రాళ్ల ఉప్పు వేయాలి.

జీవన సౌరభం

శ్రమ శక్తి ఈ ప్రపంచంలో చాలా ఉన్నతమైనది. దాన్ని జయించే శక్తి మరేదీ లేదు.

అలుసు కాని బలుసాకు

కోటలోని రాజుగారు
వేట కొరకు వెడలినారు
సాయంకాలం వేళకు
ఒక పల్లెను చేరినారు

కడుపులోన కలత కలిగి
అజీర్తితో బాధ కలిగి
రాజు గారు వేటనాపె
బాణములను వేయగలిగి

రాజుగారు సొలసిపోయె
పరివారము అలసిపోయె
వారెక్కిన అశ్వములూ
అలసిసొలసి నిలచిపోయె

పల్లె ప్రజలు మురిసిపోయె
మర్యాదలు సాగిపోయె
గ్రామపెద్ద గృహములోన
విందునీయ సిద్ధమాయె

గ్రామపెద్ద రాములయ్య
ఉబ్బి తబ్బిబ్బయెనయ్య
సంచినొకటి చేతబట్టి
పరుగును లంకించెనయ్య

మంచి కూరగాయలెంచి
మంచివిందునీయ దలచి
ఖరీదైన కూరలకై
హడావుడిగా గాలించి

ఏవేవో కొనసాగెను
ఆలస్యం అవసాగెను
పరుగుపరుగు తీసుకుంటు
ఇంటికొచ్చి అవాక్కయెను

పదిమందీ కూర్చొనుండె
భోజనాలు సాగుచుండె
రాములమ్మ వంట రుచిని
రాజుగారు మెచ్చుచుండె

బలుసాకుల పచ్చడి తిని
భలే! భలే! బాగుందని
మెచ్చుకొనుచు చెప్పసాగె
తామెన్నడు తినలేదని

కంటినిండ నిదురపోయె
తెల్లవారి నలత పోయె
అజీర్తి తొలగి ఆకలేసి
రాజుగారు మురిసిపోయె

రాములమ్మ మర్యాదని
బలుసాకుల పచ్చడిని
మెచ్చి రత్నహారాలను
ఇచ్చి వెడలె కానుక అని

భలే మంచి బలుసు మొక్క
పెరటిలోని మందు మొక్క
మలబద్ధక లక్షణమును
నివారించు చిన్న మొక్క.

అజీర్తినీ, పైత్యమునూ
జ్వర తీవ్రత బాధనూ
బలుసాకులు తగ్గించును
కీళ్ల నొప్పుల బాధనూ

ఆయుర్వేదమునందున
పథ్యముగా వాడు కాన
బతికుంటే బలుసాకును
తినవచ్చని సామెతన

- గుడిపూడి రాధికారాణి
94949 42583



బొమ్మ గీయండి!

చిన్నారులూ , ఈ రోజు చిన్న కందిరీగ బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ

- కాసరనేని జయదేవ్, 5వ తరగతి, సిద్ధార్థ పబ్లిక్ స్కూలు, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చదువు బతుకును బాగుచేస్తుందని..

వరుసగా ఆడపిల్లలు పుడుతున్నారని భర్త వదిలేసి పోయాడు. ముగ్గురు ఆడపిల్లలతో ఒంటరితల్లిగా బతుకు పోరాటం ప్రారంభించిన ఆమె పేరు కృష్ణవేణి (32). తమిళనాడు విల్లుపురానికి చెందిన ఆమె ఇరులి గిరిజన తెగకు చెందిన మహిళ. భర్త నిరాదరణకు గురైన ఆమె ఏమాత్రం నిరాశ పడకుండా బిడ్డల పోషణ కోసం ఇళ్లల్లో పాచి పనులు చేసింది. వ్యవసాయ కూలీగా మారింది. అయినా ఆ ఇంటి భారం ఆమెకు పెద్ద సమస్య. 'ఎన్నాళ్లీ కష్టాలు.. ఈ బాధల నుండి విముక్తి పొందాలంటే ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలి' అని బలంగా అనుకుంది. ఆలస్యం చేయకుండా 13 ఏళ్లకే అర్ధంతరంగా స్వస్తి చెప్పిన తన చదువును మళ్లీ కొనసాగించింది. అలా 2022లో తన కూతురు చదువుతున్న పాఠశాలలోనే పదవ తరగతిలో చేరి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉద్యోగం కోసం కొండంత ఆశతో ఎదురుచూస్తోంది. ఆమె చదువుకుంది చాలా చిన్న చదువే.. కానీ 'నా చదువు నా కుటుంబానికి వెలుగు ఇస్తుంది.. నాలాంటి వారు ఈ దారిలో నడిచేందుకు బాట వేస్తుందని' గట్టిగా చెబుతున్న కృష్ణవేణి తన జీవిత ప్రయాణం గురించి ఇలా చెబుతోంది..

'నాకు 16 ఏళ్లప్పుడు పెళ్లయ్యింది. ఎన్నో ఆశలతో అత్తవారింట్లో అడుగుపెట్టాను. మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. అందరూ సంతోషించారు. ఆ తరువాత కూడా ఆడపిల్ల పుట్టేసరికి నాపై వేధింపులు మొదలయ్యాయి. మగపిల్లవాడి కోసం మూడోసారీ తల్లయ్యాను. ఈసారీ ఆడపిల్ల పుట్టిందని నా భర్త వదిలేసి వెళ్లిపోయాడు. వేరే పెళ్లి చేసుకున్నాడు. పదేళ్ల నుండి నేనే నా బిడ్డలకి తల్లీ, తండ్రి అయ్యాను. పుట్టింటికి చేరినా.. అమ్మానాన్న మానసికంగా ధైర్యం ఇవ్వగలవారే గాని ఆర్థికంగా సాయం చేయలేని స్థితిలో ఉన్నారు. మేకల పోషణ చేసే వారి నుండి నేను కూడా ఏమీ ఆశించలేదు. అందుకే నా బిడ్డల పోషణ కోసం నేనే ఇంటింటికీ తిరిగి పని వెతుక్కున్నాను. ఇళ్లల్లో పనులు చేసి, వ్యవసాయ కూలీగా వెళ్లాను. రోజుకు రెండు పనులు చేస్తున్నా రూ.100 నుండి రూ.150 మాత్రమే సంపాదించడంతో పిల్లల పోషణ కష్టమయ్యేది' అంటూ తన గత అనుభవాలను చెబుతున్నప్పుడు ఆమె మాటల్లో బిడ్డల బాగు కోసం ఎందరో ఒంటరి తల్లులు పడుతున్న ఆవేదన కనిపిస్తోంది.

బిడ్డకు తెలియకుండా ఏడ్చేదాన్ని..

కృష్ణవేణి పెద్ద కూతురు కవిత గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. క్రమం తప్పకుండా వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి. 'ప్రభుత్వ ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా దారి ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఎన్నోసార్లు కూతురుకు కనపడకుండా కొంగు అడ్డం పెట్టుకుని ఏడ్చేదాన్ని. నా కమ్యూనిటీ ద్వారా ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని ఎంతోమందిని అడిగేదాన్ని. అయినా ఎవరూ సాయం చేయలేదు. ఏం చేయాలో పాలుపోక రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు. ఆర్థిక భారానికి తోడు అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లల భవిష్యత్తు కోసం నేను కచ్చితంగా ఏదైనా మెరుగైన ఉపాధి చూసుకోవాల్సిందేనని నిశ్చయించుకున్నాను. కానీ ఎలా.. చదువే మా బతుకులు బాగు చేస్తుందని నాకు తెలుసు. అందుకే ఎవరు ఏమనుకున్నా ఫరవాలేదు.. అనుకుని.. పెద్దపిల్ల చదువుతున్న స్కూల్లో పదోతరగతిలో నా పేరు కూడా నమోదు చేసుకున్నాను' అంటూ తను తీసుకున్న గొప్ప నిర్ణయం గురించి చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో మెరుపు కనపడింది.

ఇంటి పనులు, చదువు..

పనులు చేసుకుంటూ బడికెళ్లడం కృష్ణవేణికి సాధ్యపడలేదు. దీంతో స్కూల్లో చెప్పిన పాఠాలు కూతురు నుండి అడిగి తెలుసుకునేది. ఇంటిదగ్గర తను నేర్చుకున్న పాఠాలు కూతురుతో చర్చించేది. ఇలా ఇద్దరూ పరీక్షలకు సిద్ధమై ఉత్తీర్ణత సాధించారు. వారు సాధించింది చాలా చిన్న విజయమే కావచ్చు.. కానీ ఇది వారి జీవితాల్లో ఓ వెలుగురేఖకు కారణమౌతుందని వారు కొండంత ఆశతో ఉన్నారు. 'అమ్మ పదోతరగతి ఉత్తీర్ణత సాధించి మా కమ్యూనిటీలో చాలా ప్రత్యేకంగా నిలిచింది. ఇప్పుడు అమ్మకు ప్రభుత్వ ఉద్యోగం రావాలని, మా బతుకులు బాగుపడాలని మేమంతా కోరుకుంటున్నాం' అంటూ తల్లి సాధించిన విజయం గురించి చెబుతూనే భవిష్యత్తు గురించి గొప్ప కలలు కంటోంది ఆ చిన్నారి. ఈ కుటుంబం కల నెరవేరాలని మనమూ ఆశిద్దాం.

పిల్లలు అబద్ధాలు చెబుతున్నారా ...?

పిల్లలు ఎక్కువగా తన చుట్టూ ఉన్న తోటి పిల్లలతో పోల్చుకుని చూసుకుంటారు. వారి ఏమైనా ఖరీదైనా వస్తువు కొనుక్కున్నా, ఏదైనా తిన్నా... తాము తినలేకపోతున్నామని ఫీల్‌అవుతుంటారు. తమకు అలాంటి ఉంటే బాగుండు అని, తమ జీవితం అలాగ ఎందుకు లేదని ప్రశ్నించుకుంటూ ఉంటారు. ఆ క్రమంలో తాము అలాగే ఉండేందుకు ప్రయత్నిస్తూ...అబద్ధాలు చెబుతుంటారు. ఇది అలవాటుగా మారితే పెద్ద అయ్యేకొద్దీ ప్రమాదమవుతుంది. అందుకే మొదట్లోనే గుర్తించి పిల్లల్లో ఈ ఆలోచనను తగ్గించాలి.

- పిల్లలకు గ్రహింపు శక్తి వేగంగా ఉంటుంది. ఏదైనా విషయాన్ని చెప్పాలంటే సున్నితంగా చెబుతూ, పెద్దలు కూడా ఆ విషయంలో ఆచరణలో పెట్టాలి. లేకపోతే వెంటనే వారు ప్రశ్నిస్తారు. అబద్ధాలు ఆడినప్పుడు తిట్టడం, కొట్టడం లాంటివి చేయకూడదు.
- పిల్లలు కావాలని అబద్ధాలు చెప్పరు. వాళ్ల అబద్ధాల వెనుక ఏదో ఒక కారణం ఉంటుంది. అందుకే ముందుగా పిల్లలు ఏయే సందర్భాల్లో అబద్ధాలు చెప్తున్నారో గమనించాలి. హోంవర్క్ చేయకుండానే చేశాను అని చెప్తుంటే వాళ్లకు హెూమ్‌వర్క్ చేయడం ఇష్టం లేదని అర్థం. అలాంటప్పుడు హెూంవర్క్ ఎందుకు ఇష్టం లేదో తెలుసుకోవాలి. కష్టంగా అనిపిస్తున్న సబ్జెక్టులపై స్పెషల్ ఫోకస్ పెట్టేలా పేరెంట్స్ సపోర్ట్ చేయాలి.
- పిల్లల్లో ఉండే ఆత్మన్యూనత కూడా వాళ్లతో అబద్ధాలు ఆడిస్తుంది. అందుకే తరచుగా అబద్ధాలు ఆడేపిల్లలకు ఏవైనా ఇబ్బందులు, భయాలు ఉన్నాయేమో తెలుసుకోవాలి. వాళ్లతో సున్నితంగా మాట్లాడి, వాళ్లకున్న భయాలు, ఇబ్బందులు తొలగించే ప్రయత్నం చేయాలి. అలా చేస్తే పిల్లలకు అబద్ధాలు ఆడే అవసరం రాదు.
- కొందరు పేరెంట్స్ పిల్లలతో కఠినంగా ఉంటారు. అలాంటప్పుడు వారి తప్పించుకునేందుకు పిల్లలు అబద్ధాలు ఆడుతుంటారు. అలా భయంతో అబద్ధాలు ఆడుతున్నప్పుడు ఆ భయం పోగొట్టే ప్రయత్నం చేయాలి. పిల్లలతో ప్రేమగా, సున్నితంగా మాట్లాడడాన్ని పేరెంట్స్ అలవాటు చేసుకోవాలి.

- తాము చెప్పేది వినాలన్న కోరికతో కూడా చాలామంది పిల్లలు కట్టుకథలు చెప్తుంటారు. ఇలాంటి పిల్లలకి ఎక్కువ టైం ఇవ్వాలి. అలాచేస్తే వాళ్లకున్న తాపత్రయాన్ని తగ్గించొచ్చు. వాళ్లు ఏది చెప్పినా ఓపికగా వింటుండాలి. ఇలా చేయడం ద్వారా వాళ్లకు అబద్ధాలు ఆడే అవసరం తగ్గుతుంది.
- ఈ జాగ్రత్తలన్నింటితో పాటు పిల్లలకు అబద్ధాలు ఆడడం వల్ల జరిగే నష్టాలను కథల రూపంలో అర్థమయ్యేలా చెప్పాలి. ఎలాంటి సందర్భంలోనైనా నిజం చెప్పేవాళ్లే నిజమైన హీరోస్ అని వివరించాలి.

ఆగస్టు 25న 'గాండీవధారి అర్జున'



హీరో వరుణ్‌తేజ్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రం 'గాండీవధారి అర్జున'. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో సినిమాను ఆగస్టు 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. వరుణ్ తేజ్ గన్ పట్టుకుని స్టైలిష్‌గా కనిపిస్తున్నాడు. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వరా సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నాడు. సహా నిర్మాతగా నాగబాబు వ్యవహరిస్తున్నాడు. మిక్కీ జే మెయర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించింది.

కన్నడ దర్శకుడు శివశంకర్ కన్నుమూత



ప్రముఖ కన్నడ దర్శకుడు సీవీ శివశంకర్ (90) కన్నుమూశారు. కన్నడలో రచయితగా పలు చిత్రాలకు సినీ గీతాలు అందించారు. బెంగుళూరులో నివాసం ఉన్న ఆయనకు మంగళవారం రాత్రి ఆయన గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు వెంకట్ భరద్వాజ్ వెల్లడించారు. ఆయన మృతి పట్ల కన్నడ సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 1962లో తన కెరీర్‌ను ప్రారంభించిన శివశంకర్.. మంజరి చిత్రంలో నటుడిగా, సహాయ దర్శకుడిగా పనిచేశాడు. 1967లో పదవీధార అనే చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఆ తర్వాత 1968లో 'నమ్మ ఊరు' అనే మరో చిత్రానికి దర్శకత్వం వహించారు. అదే ఆయన దర్శకత్వం వహించిన చివరి చిత్రం. ఆయన కన్నడలో అనేక పాటలకు సాహిత్యం అందించారు. బెంగుళూరు నగారా, సిరివంతనాదరూ కన్నడ నాదల్లె మెరెవే, ఆనందదా తవరూరు వంటి అనేక పాటలు రాశారు. కాగా.. ఆయనకు భార్య రాధమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన కుమారుల్లో ఒకరైన వెంకట్ భరద్వాజ్ కూడా సినిమా రంగంలో ఉన్నారు. వెంకట్ రెండు సినిమాల్లో కలిసి పనిచేశారు.

'కీడా కోలా' టీజర్ విడుదల

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో రాబోతోన్న 'కీడా కోలా' చిత్రం నుండి తాజాగా టీజర్ రిలీజైంది. కోలా బాటిల్‌ను బ్రహ్మీ, చైతన్య రావు అనుమానాస్పదంగా చూస్తున్న సీన్‌తో టీజర్ మొదలైంది. ఆ తరువాత ఆ కోలాను ప్రధానంగా చూపిస్తూ గన్నులు, ఫైరింగ్, యాక్షన్ కనిపించింది. చివర్లో కోలాలోంచి బొద్దింక పైకి ఎక్కడానికి తెగ ట్రై చేస్తున్నట్లు చూపించారు. ఇలా టీజర్ ఆద్యంతం ఆసక్తి కలిగించేలా ఉంది. క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు తరుణ్ దర్శకత్వం వహించడమే కాకుండా ఓ కీలక పాత్ర కూడా చేస్తున్నారు. వీజీ సైన్మా సంస్థ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నాడు.

జులై 21న విజయ్ ఆంటోనీ 'హత్య'

విజయ్ ఆంటోనీ నుండి మరో కొత్త సినిమా వస్తోంది. వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో 'హత్య' అనే సినిమాను త్వరలో ఆయన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. హత్య ఎలా జరిగింది? ఎవరు చేశారు? ఎందుకు చేశారనే విషయాలనే తెలుసుకుని మర్డర్ మిస్టరీగా ఈ సినిమాను తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను విజయ్ ప్రకటించారు. ఈ చిత్రంలో రితికా సింగ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా జులై 21న విడుదలకు సిద్ధంగా ఉంది. బాలాజీ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాని ఇన్ఫినిటీ ఫిలిమ్ వెంచర్స్, లోటస్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గిరీష్ గోపాలకృష్ణన్ సంగీతం అందిస్తున్నారు. రాధికా శరత్ కుమార్, మురళీ శర్మ, జాన్ విజయ్, సంకిత్ బోహ్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

నొప్పితో పోరాడుతున్నాను

ఓ సినిమా షూటింగులో ఇటీవల మలయాళ నటుడు పృథ్వీ రాజ్ సుకుమారన్ గాయపడ్డ విషయం తెలిసిందే. ఆయన కాలికి తీవ్ర గాయం కావడంతో అర్ధాంతరంగా చిత్ర బృందం షూటింగ్ నిలిపివేసింది. తాజాగా ఆయన ఆరోగ్య పరిస్థితిని పృథ్వీరాజ్ సోషల్‌మీడియా వేదిక ద్వారా పంచుకున్నారు. 'నేను 'విలయత్ బుద్ధ' సినిమా యాక్షన్ సీన్స్ షూట్ చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాను. నిపుణులైన డాక్టర్ల సమక్షంలో కీలకమైన శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం రెండు నెలలు విశ్రాంతి తీసుకుంటాను. ఫిజియోథెరపీ కూడా జరుగుతోంది. నేను నొప్పితో పోరాడుతున్నాను. సాధ్యమైనంత త్వరగా తిరిగి వస్తాను. నా ఆరోగ్యం పట్ల ఆందోళన చెందడమే కాకుండా.. నాపై ప్రేమను వ్యక్తం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు' అంటూ పృథ్వీ రాజ్ నోట్ విడుదల చేశారు.

'సౌండ్ పార్టీ'తో విజె సన్నీ

బుల్లితెర నటుడు విజె సన్నీ తాజాగా 'సౌండ్ పార్టీ' చిత్రంతో రాబోతున్నారు. ఈ విషయం తెలియజేస్తూ మేకర్స్ ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ టైటిల్ పోస్టర్‌లో సంకెళ్లు, డబ్బు, దస్తావేజులు, పాప్ కార్న్.. ఇలా చాలా ఐటమ్స్ కనిపిస్తున్నాయి. ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో హృతికా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

టీమిండియా బిజీ.. బిజీ...

రానున్న ఐదు నెలల్లో మూడు విదేశీ పర్యటనలు

స్వదేశంలో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్‌లతో సిరీస్‌లు • అక్టోబర్‌లో ఐసిసి వన్డే ప్రపంచకప్

ముంబయి: రానున్న ఐదు నెలల్లో టీమిండియా బిజీ బిజీగా గడపనుంది. ఇందులో రెండు విదేశీ పర్యటనలతోపాటు శ్రీలంక వేదికగా ఆసియాకప్‌తోపాటు వన్డే ప్రపంచకప్‌కు ముందు స్వదేశంలో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌లతో టీమిండియా తీరికలేని షెడ్యూల్‌తో సతమతమౌతోంది. డబ్ల్యుటిసి ఫైనల్ తర్వాత నెల రోజుల విరామం తర్వాత జులైలో వెస్టిండీస్ పర్యటనకు వెళ్లనున్న టీమిండియా.. ఆ సిరీస్‌లో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టి20ల సిరీస్ ఆడనుంది. ఈ పర్యటన జూలై 12నుంచి ఆగస్టు 13వరకు సాగనుంది. ఆ వెంటనే మూడు టి20ల సిరీస్ ఆడేందుకు టీమిండియా ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటన ఆగస్టు 18 నుంచి 23వరకు సాగనుంది. సెప్టెంబర్‌లో శ్రీలంక వేదికగా ఆసియాకప్ జరగనుంది. అనంతరం సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో పాటు ఆఫ్ఘనిస్తాన్‌తో టీమిండియా మూడేసి వన్డేల సిరీస్ ఆడనుంది. వన్డే ప్రపంచకప్ సన్నాహకంలో భాగంగా ఈ సిరీస్‌లు నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌లకు సంబంధించిన షెడ్యూల్ ఖారారు కానప్పటికీ సెప్టెంబర్‌లోనే జరగనున్నాయి. అక్టోబర్ నుంచి నవంబర్ మధ్య వన్డే ప్రపంచకప్ జరగనుంది. వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో వెస్టిండీస్‌తో పాటు ఐర్లాండ్ పర్యటనకు యువ ఆటగాళ్లతో కూడిన జట్టును బిసిసిఐ పంపించనుంది. వన్డే ప్రపంచకప్ ఆడనున్న ఆటగాళ్లను కేవలం 50ఓవర్ల ఫార్మాట్‌కే పరిమితం చేయనున్నారు. ఐర్లాండ్ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను బిసిసిఐ ప్రకటించింది. ఆగస్టు 18, 20 23న మూడు టి20 ఆడనుంది. ఈ పర్యటనకు హార్దిక్ పాండ్యాతో పాటు ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్న ఆటగాళ్లందరూ దూరంగా ఉండనున్నారు. ఐపిఎల్‌లో సత్తా చాటిన తిలక్ వర్మతో పాటు రింకూ సింగ్ వంటి ఆటగాళ్లు ఈ సిరీస్ ఆడే అవకాశం ఉంది. ఈ సిరీస్‌కు జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం.

వేదికల కేటాయింపుల్లోనూ వివక్షే..

ప్రపంచకప్ టోర్నీకి సంబంధించిన వేదికల కేటాయింపు విషయమై రాజకీయ రంగు పులుముకుంది. ఉద్దేశపూర్వకంగా కొన్ని రాష్ట్రాల్లో స్టేడియాలకు బిసిసిఐ మ్యాచ్‌లు కేటాయించలేదని, ముఖ్యంగా బిజెపి అధికారంలో లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపించిందని ప్రతిపక్ష నాయకులు మండి పడ్డారు. పంజాబ్‌లోని మోహాలీ, కేరళలోని తిరువనంతపురం, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ స్టేడియాలను ఎంపిక చేయకపోవడంపై ఆయా రాష్ట్రాల నేతలు బిసిసిఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంజాబ్ క్రీడల మంత్రి గుర్మీత్ సింగ్ ఈ విషయమై బిసిసిఐపై తీవ్ర ఆరోపణలు చేశారు. అలాగే హైదరాబాద్‌లోనూ టీమిండియా మ్యాచ్‌లు లేవు. దాంతో తెలుగు అభిమానులు బిసిసిఐపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2011 వన్డే ప్రపంచకప్ సమయంలోనూ వైజాగ్ స్టేడియానికి మొండిచెయ్యే ఎదురైంది. ఈ విషయమై బిసిసిఐ ఉపాధ్యక్షులు రాజీవ్ శుక్లా తాజాగా స్పందించారు. దక్షిణ జోన్ నుంచి చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, తిరువనంతపురం వేదికలను ఖారారు చేయడంతో వైజాగ్‌కు చోటు దక్కలేదని వివరణ ఇచ్చారు.

సెమీస్‌లో భారత్ ప్రత్యర్థి లెబనాన్

శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

బెంగళూరు: శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో లీగ్ పోటీలు ముగిసాయి. బుధవారం జరిగిన గ్రూప్-బి ఆఖరి లీగ్ మ్యాచ్‌లో లెబనాన్ జట్టు 1-0తో మాల్దీవులను, బంగ్లాదేశ్ జట్టు 3-1తో బూటాన్‌ను ఓడించాయి. దీంతో ఈ గ్రూప్‌లో లెబనాన్ జట్టు అగ్రస్థానంలో, బంగ్లాదేశ్ జట్టు రెండోస్థానంలో నిలిచి సెమీస్‌కు చేరాయి. మంగళవారం జరిగిన గ్రూప్-ఏ లో కువైట్, భారత్ జట్టు 1, 2 స్థానాల్లో నిలిచి సెమీస్‌కు చేరడంతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో ఉన్న కువైట్ జట్టు గ్రూప్-బిలో రెండోస్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌తో తొలిసెమీస్‌లో ఆడనుంది. ఇక గ్రూప్-ఏలో రెండోస్థానంలో ఉన్న ఆతిథ్య భారతజట్టు గ్రూప్-బిలో అగ్రస్థానంలో ఉన్న లెబనాన్ జట్టు రెండో సెమీస్‌లో తలపడనుంది. ఈ రెండు సెమీస్ పోటీలు శనివారం జరగనున్నాయి.

పాయింట్ల పట్టిక

గ్రూప్-ఏ	మ్యా	గె	ఓ	డ్రా	చే.గో.	ఇ.గో.	గో.వ్య	పా
కువైట్	3	2	1	0	8	2	6	7
భారత్	3	2	1	0	7	1	6	7
నేపాల్	3	1	0	2	2	5	-3	3
పాకిస్తాన్	3	0	0	3	0	9	-9	0
గ్రూప్-బి								
లెబనాన్	3	3	0	0	7	1	6	9
బంగ్లాదేశ్	3	2	0	1	6	4	2	6
మాల్దీవులు	3	1	0	2	3	4	1	3
బూటాన్	3	0	0	3	2	9	7	0

మ్యా:మ్యాచ్‌లు, గె:గెలుపు; ఓ:ఓటమి; చే.గో:చేసినగోల్స్, ఇ.గో:ఇచ్చినగోల్స్: గో.వ్య. గోల్స్ వ్యత్యాసం

ఆస్ట్రేలియా 339/5

వార్నర్, స్మిత్, హెడ్ అర్ధసెంచరీలు

లండన్: యాషెస్ సిరీస్ రెండోటెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా జట్టు పట్టు బిగిస్తోంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు 83 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 339పరుగులు చేసింది. ఓపెనర్ డేవిడ్ వార్నర్(66), స్మిత్(85నాటౌట్), హెడ్(77) అర్ధసెంచరీలతో మెరిసారు. తొలిటెస్ట్ హీరో ఉస్మాన్ ఖవాజా(17)తో కలిసి డేవిడ్ వార్నర్ తొలి వికెట్‌కు 73పరుగులు జతచేశాడు. ఆ తర్వాత వీరిద్దరూ వెంట వెంటనే ఔటైనా.. లబూషేన్-స్టీవ్ స్మిత్ కలిసి ఆసీస్‌ను ఆదుకున్నారు. అర్ధసెంచరీకి దగ్గర్లో 47 పరుగుల వద్ద లబూషేన్‌ను రాబిన్సన్ ఔట్ చేశాడు. రెండోటెస్ట్ ప్రారంభమైన కొద్దిసేపటికే వర్షం కురవడంతో మ్యాచ్ కొంతసేపు నిలిచిపోయింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68